PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 106 | విజయవాడ, సోమవారం 18 నవంబర్ 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 18 November 2024 | Rs

ప్రత్యామ్నాయ రాజకీయాలు నచ్చకే సిపిఎంపై దాడి

3

రోహిత్‌శర్మ దూరం

పెర్త్ టెస్టుకు హిట్‌మ్యాన్ గైర్హాజరు

6

# పిఎం కిసాన్‌తో కలిపితే కోతలే

- అన్నదాత సుఖీభవ లబ్ధిదారుల్లో ఆందోళన
- వైసిపి హయాంలో జరిగిందిదే
- ఆ విధానాన్నే అనుసరిస్తున్న టిడిపి కూటమి ప్రభుత్వం
- ఒకేసారి కాకుండా విడతల్లో ఇస్తే సాగుకు ఆసరా కాదు
- కౌలు రైతుల్లో గుర్తింపు భయాలు

**ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి**

రైతులకు ప్రతి ఏటా రూ.20 వేల ఆర్థిక సాయం అందించే 'అన్నదాత సుఖీభవ'ను కేంద్ర పథకం 'పిఎం కిసాన్'తో కలిపి అమలు చేస్తామని టిడిపి కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో క్లారిటీ ఇవ్వడంతో లబ్ధిదారులకు భారీ కోతలు తప్పవన్న ఆందోళనలు బయలుదేరాయి. వైసిపి సర్కారు 'రైతు భరోసా'ను పిఎం కిసాన్‌కు అనుసంధానం చేయడం వలన లబ్ధిదారులు, వారికి చేకూరే లబ్ధికి భారీగా గండి పడింది. ప్రతిపక్షంలో ఉండగా ఈ విధానాన్ని టిడిపి విమర్శించింది. అధికారంలోకొచ్చిన కూటమి ప్రభుత్వం రైతులకు సూపర్ సిక్స్‌లో ఇచ్చిన హామీపై గత వైసిపి ప్రభుత్వ విధానాన్నే అనుసరించడంపై అన్నదాతల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. పిఎం కిసాన్‌కు ఇ-కెవైసి, ఆధార్ బేస్డ్ పేమెంట్స్, సాయానికి పలు వర్గాల మినహాయింపులు, సహా పలు కఠిన ఆంక్షలు ఉన్నందున లబ్ధిదారుల సంఖ్య లక్షల్లో తగ్గింది. కేంద్రం కౌలు రైతులను పిఎం కిసాన్‌కు అనర్హులుగా ప్రకటించింది. రాష్ట్రంలో కూటమి సర్కారు కౌలు రైతులకు 'అన్నదాత'ను వర్తింపజేస్తామంటున్నా వారి గుర్తింపు సమస్య ఇంకా పరిష్కారం కాలేదు. వైసిపి ప్రభుత్వానికి భిన్నంగా కౌలు రైతుల గుర్తింపునకు సరళతర చట్టం తెస్తామంటున్నప్పటికీ ఇంకా కసరత్తు దశలోనే ఉంది. దాంతో ఈ ఏడాది కౌలు రైతులకు 'అన్నదాత'సాయంపై అయోమయం కొనసాగుతోంది.

**కటింగ్‌లు**

రాష్ట్రంలో 76 లక్షల మంది సొంత భూమి కలిగిన రైతులున్నారని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. వైసిపి ప్రభుత్వం సుమారు 52 లక్షల మందికి 'భరోసా' ఇచ్చింది. వారిలో పిఎం కిసాన్‌కు అర్హులు 41 లక్షలే. పిఎం కిసాన్‌లో 11 లక్షల మంది తగ్గిపోయారు. వీళ్లకు కేంద్రం నుంచి పిఎం కిసాన్ అందలేదు. కేవలం రాష్ట్ర వాటానే దక్కింది. 2024-25లో ఇప్పటి వరకు పిఎం కిసాన్ రెండు కిస్తులూ ఈ 41 లక్షల మందికి జమ అయ్యాయి. పిఎం కిసాన్‌తో 'అన్నదాత'ను లింక్ చేస్తే లక్షల మంది ప్రభుత్వం ఇచ్చే అరకొర లబ్ధి కోల్పోతారని రైతుల్లో భయాలు అలముకున్నాయి.

**విడతల్లోనే..**

రైతులకు పెట్టుబడి సాయం ఒకేసారి అందిస్తే పెరుగుతున్న ఇన్‌పుట్ ధరలతో పోల్చుకుంటే అది తక్కువే అయినా రైతులు సాగును సాగించేందుకు కాస్తయినా ఆసరా అవుతుంది. వైసిపి సర్కారు పిఎం కిసాన్‌తో కలిపి విడతల్లో రైతులకు భరోసా ఇచ్చింది. రూ.13,500 ఇస్తామనిచెప్పి కేంద్రం ఇచ్చే రూ.6 వేలను మినహాయించి కేవలం 7,500 ఇచ్చింది. అదీ రెండు విడతల్లో ఇచ్చింది. కౌలు రైతులకు స్వల్ప సంఖ్యలో ఖరీఫ్ ముందు ఇవ్వకుండా రబీలో రెండు విడతల్లో రూ.13,500 ఇచ్చింది. ఈ విధానాన్ని టిడిపి అప్పట్లో తప్పుబట్టింది. ఇప్పుడేమో తానూ పిఎం కిసాన్‌తో కలుపుతామని, త్వరలో విధి విధానాలు జారీ అవుతాయంది. సొంత భూమి కలిగిన రైతులకు ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా రూ.20 వేలు కాకుండా కేంద్రానిది రూ.6 వేలు తీసేసి, మిగతా 14 వేలనూ మూడు కిస్తుల వంతున విభజించనుంది. కౌలు రైతులకు తన ఖజానా నుంచి రూ.20 వేలూ ఇవ్వాల్సి ఉన్నందున ఆ అమౌంట్‌ను కూడా కిస్తుల వంతున ఇచ్చేందుకు కసరత్తు చేస్తోంది.

**ఎలా సరిపోతాయి...**

'అన్నదాత'కు వ్యవసాయ బడ్జెట్‌లో ఈ ఏడాదికి రూ.4,500 కోట్లు అని చెప్పగా, జనరల్ బడ్జెట్‌లోని వ్యవసాయ పద్దులో రూ.1,026 కోట్లు ప్రతిపాదించారు. పిఎం కిసాన్ లబ్ధిదారులు 41 లక్షల మంది. వారికే రాష్ట్రం తన వాటా 14 వేలు ఇవ్వాలన్నా రూ.5,740 కోట్లు కావాలి. బడ్జెట్‌లో పెట్టింది వెయ్యి కోట్లు మాత్రమే. ఒక వేళ లబ్ధిదారులు పెరిగితే ఏం చేస్తారు? కౌలు రైతులను ఉదారంగా గుర్తించి వారికి తన ఖజానా నుంచి మొత్తం ఇరవై వేలూ ఇస్తామంటున్నారు. వాటి సంగతేంటి? విధి విధానాలు ఖరారైతేనే స్పష్టత వస్తుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

ప్రధాన వీధుల్లో విధ్వంసానికి పాల్పడుతున్న ఆందోళనకారులు

# మరోసారి భగ్గుమన్న మణిపూర్

- సిఎం, మంత్రులు, ఎమ్మెల్యేల నివాసాలపై దాడులు
- ఆస్తులు ధ్వంసం... వాహనాలకు నిప్పు
- నిరవధిక కర్ఫ్యూ... ఇంటర్నెట్ సేవల నిలిపివేత
- బిజెపికి ఎన్‌పిపి మద్దతు ఉపసంహరణ

**ఇంఫాల్ :** మణిపూర్‌లో దాదాపు పద్దెనిమిది మాసాల నుంచి కొనసాగుతున్న హింసాకాండకు ముగింపు కనుచూపు మేరలో కానరావడం లేదు. రాష్ట్రం తాజాగా మరోసారి హింస పెద్దయెత్తున చెలరేగింది. ఆందోళనకారులు వీధుల్లోకి వచ్చి విధ్వంసానికి పాల్పడ్డారు. ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ సహా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేల నివాసాలపై దాడి చేశారు. ఇళ్లు, ఆస్తులను దగ్ధం చేశారు. ఇటీవల కిడ్నాప్‌కు గురైన ఆరుగురిలో ఇద్దరి మృతదేహాలు లభ్యం కావడంతో ఆందోళనకారులు ఈ విధ్వంసానికి పాల్పడుతున్నారు. మహిళలు, చిన్నారులను పొట్టనపెట్టుకుంటున్న వారిని శిక్షించలేకపోతే పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. శనివారం రాత్రి ఆందోళనకారులు ఇంఫాల్ ఈస్ట్‌లో ఉన్న ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ పూర్వీకుల నివాసంపై దాడికి దిగారు. అయితే భద్రతా సిబ్బంది ఆందోళనకారులపై టియర్ గ్యాస్, రబ్బరు బుల్లెట్లు ప్రయోగించి వారిని నిలువరించారు. అలాగే, ఆందోళనకారులు నింగ్‌తౌఖోంగ్‌లో పిడబ్ల్యూడి మంత్రి గోవిందాస్ కొంతౌజం,

మిగతా 5లో

## చిన్నారుల ఎదుగుదలకూ కులం అవరోధమే !

- అణగారిన పిల్లల్లోనే సమస్య అధికం
- ఆదివాసీ, దళితుల్లో మరింత ఆందోళనకరం
- బాధితుల సంఖ్య 35% పైనే
- తాజా అధ్యయనంలో వెల్లడి

5

## రామ్మూర్తి నాయుడుకు తుది వీడ్కోలు

- పాడె మోసిన చంద్రబాబు, లోకేష్
- అధికార లాంఛనాలతో అంత్యక్రియలు
- సంతాపం తెలిపిన గవర్నర్

3

ఇజ్రాయిల్ బాంబు దాడులతో ధ్వంసమైన పాలస్తీనావాసులు తలదాచుకుంటున్న గాజా పాఠశాల భవనం

# ఇజ్రాయిల్ వైమానిక దాడిలో హిజ్బుల్లా ప్రతినిధి మృతి

- 24 గంటల్లో 50 మంది బలి

**బీరుట్:** ఇజ్రాయిల్ దాడుల్లో హిజ్బుల్లా అధికార ప్రతినిధి మహ్మద్ అఫీఫ్ మరణనించినట్లు లెవబనీస్ భద్రతా దళాలు తెలిపాయి. సెంట్రల్ బీరుట్‌లోని రసుల్ నాబా జిల్లాలో సిరియన్ బాత్ పార్టీ లెబనీస్ శాఖను లక్ష్యంగా చేసుకుని ఆదివారం దాడి జరిగింది. ఈ దాడిలో హిజ్బులా మీడియా రిలేషన్స్ అధికారి మహ్మద్ అఫీఫ్ మరణించగా, మరో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. ఎలాంటి హెచ్చరిక లేకుండా ఇజ్రాయిల్ చేసిన ఈ దాడి భారీ నష్టాన్ని కలిగించిందని నేషనల్ న్యూస్ ఏజెన్సీ తెలిపింది. ఇదిలా వుండగా ఇజ్రాయిల్ గాజా, లెబనాన్‌లపై కొనసాగిస్తున్న వైమానిక దాడుల్లో గడచిన 24 గంటల్లో 50 మంది దాకా మరణించారు. మరో వైపు ఉత్తర గాజాలోని బీట్ లాహియా నుండి పాలస్తీనీయులను ఇజ్రాయిల్ సైన్యం బలవంతంగా ఇళ్ల నుంచి తరిమేస్తోంది. గాజాలోని ఎనిమిది శరణార్థి శిబిరాల్లో అతి పెద్దదైన బీట్ లాహియా, జబాలియాలోకి ఇజ్రాయిల్ యుద్ధ ట్యాంకులను పంపింది.

## హైస్కూల్ టైమింగ్స్ మార్పు!

- నెల్లూరులో పైలట్ ప్రాజెక్టు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ప్రభుత్వ ఉన్నత పాఠశాలల పనివేళల్లో మార్పులు చేసే దిశగా పాఠశాల విద్యాశాఖ అడుగులు వేస్తోంది. ప్రస్తుతం పనిచేస్తున్న సమయానికి అదనంగా మరో గంట పెంచేందుకు సిద్ధమైంది. తొలుత నెల్లూరు జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా పనివేళలల పెంపును అమలు చేసేందుకు నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఉన్నత పాఠశాలలు ఉదయం 9 నుంచి 4 గంటల వరకు నడుస్తున్నాయి. దీనిని ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అమలు చేయనుంది. నెల్లూరు జిల్లాలో ప్రతి మండలంలోని ఒక ఉన్నత పాఠశాలలో గానీ, హైస్కూల్ ప్లస్‌లో గానీ కొత్త టైం టేబుల్ అమలు చేయాలని నెల్లూరు జిల్లా విద్యాశాఖ అధికారి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 25 నుంచి 30వ తేది వరకు ఈ టైం టేబుల్‌ను అమలు చేసి ఫీడ్‌బ్యాక్ అందించాలని ఆదేశించారు. పాఠశాల విద్యాశాఖ నిర్ణయంపై ఉపాధ్యాయుల్లో భిన్నస్వరాలు వినిపిస్తున్నాయి. కొంతమంది స్వాగతిస్తుండగా, మరికొంతమంది వ్యతిరేకిస్తున్నారు.

# గిరిజనులకు రోడ్లేవి?

- రోడ్డు సౌకర్యం లేని తండాలు 2,162
- తప్పని డోలీ కష్టాలు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

గిరిజనులకు కనీస సౌకర్యాల కల్పన దశాబ్దాల తరబడి సాకారం కావడం లేదు. ప్రభుత్వాలు మారినా గిరిజనుల జీవితాల్లో ఎలాంటి మార్పు లేదు. బడ్జెట్‌లో వేల కోట్లు కేటాయింపుల పేరుతో చూపించినప్పటికీ ఆ నిధులు వారి కోసం కాకుండా ఇతర పథకాలకు మళ్లించడంతో అభివృద్ధి ఫలాలు వీరికి అందని ద్రాక్షగానే మిగిలాయి. ఇప్పటికీ అనేక గిరిజన తండాలు రోడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి సౌకర్యాలకు నోచుకోలేదు. రాష్ట్రంలో నేటికీ రోడ్డు సౌకర్యం లేని గిరిజన ఆవాసాలు 2,162 ఉన్నాయి. వీటిలో ప్రధానంగా ఉమ్మడి విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు, పశ్చిమ గోదావరి, కర్నూలు జిల్లాల్లో అధికంగా ఉన్నాయి. దీంతో రవాణా సౌకర్యాలు అందుబాటులో లేక ఆయా తండాల గిరిజనులు తమ అవసరాల కోసం నిత్యం మైళ్ల కొద్దీ దూరం కాలినడకన వెళ్లాల్సి వస్తుంది. మరోవైపు ఏదైనా అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు వారిని ఆస్పత్రికి తరలించడానికి డోలీలే శరణ్యమవుతున్నాయి. ఫలితంగా సరైన సమయంలో వైద్యం అందక గర్భిణులు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారి ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి.

**కేటాయింపులు ఘనం - వ్యయం అంతంతే**

గిరిజనుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం ఏ స్థాయిలో వుందో బడ్జెట్‌లో కేటాయింపులకు, ఖర్చులకు మధ్య ఉన్న అంతరమే తెలియజేస్తుంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో గిరిజన సంక్షేమశాఖకు అప్పటి ప్రభుత్వం రూ.4,123.38 కోట్లు బడ్జెట్ అంచనాలు రూపొందిస్తే, వాస్తవంగా ఖర్చు చేసింది కేవలం రూ.2,927.47 కోట్లు మాత్రమే. అంటే రూ.1,195.91 కోట్లు నిధులు దారి మళ్లించారు. గిరిజన సంక్షేమశాఖ బడ్జెట్‌లో ఆర్‌ఐడిఎఫ్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించలేదు. ఇది గిరిజనుల పట్ల పాలకుల నిర్లక్ష్యాన్ని తెలియజేస్తుంది. మరోవైపు పంచాయతీరాజ్ శాఖ నుంచి గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రధాన మంత్రి గ్రామ్ సడక్ యోజనలో భాగంగా పిఎం జన్‌మాన్ కార్యక్రమంలో గత రెండేళ్లుగా ఒక్క రూపాయి కేటాయించకపోడం గమనించాల్సిన విషయం. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.73.02 కోట్లు కేటాయించినప్పటికీ వచ్చే ఐదు నెలల్లో వీటిలో ఏ మేర ఖర్చు చేస్తుందనేది ప్రశ్నార్థకం. వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా రోడ్ల అభివృద్ధికి తీసుకున్న చర్యలు అరకొరగానే ఉన్నాయి. ఇక గిరిజన ప్రాంతాలకు రోడ్ల నిర్మాణం సంగతి చెప్పనక్కర్లేదు.

## ఘనంగా ముగిసిన అమరావతి బాలోత్సవం

2లో..

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులు మృతి

**ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్**

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులు మృతి చెందిన ఘటన ప్రకాశం జిల్లాలో చోటు చేసుకుంది. మృతుల్లో ఇద్దరు అన్నాదమ్ములు ఉన్నారు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. ఒంగోలు కార్పొరేషన్ పరిధి కొప్పోలు కొత్త అంబేద్కర్ నగర్‌కు చెందిన కన్నెధారి రేష్మంత్ (16), వడ్డే వికాస్ (13), ఆయన తమ్ముడు వడ్డే అశ్వినీకుమార్ (9) అలియాస్ విశాల్ ముగ్గురు కలిసి ఓ శుభకార్యం నిమిత్తం కొత్త దుస్తులు కొనుగోలు చేసేందుకు ఇంటి నుంచి ఒంగోలుకు స్కూటీపై బయలుదేరారు. కొప్పోలు ఆంజనేయ స్వామి గుడి వద్దకు రాగానే స్కూటీని వాటర్ ట్యాంకర్ ఢీకొంది. రేష్మంత్ అక్కడికక్కడే మృతి చెందారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వికాస్, అశ్వినీ కుమార్ మరణించారు. రేష్మంత్ తండ్రి ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ వాటర్ వర్క్స్‌లో పనిచేస్తున్నారు. వడ్డే వికాష్, అశ్వినీకుమార్‌ల తండ్రి చనిపోగా, తల్లి కోటేశ్వరి కార్మికురాలుగా పనిచేస్తున్నారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు చిన్నారులు చనిపోవడంతో బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఘటనా స్థలాన్ని ఒంగోలు డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు పరిశీలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# సిబిఐ వలలో వాల్తేరు డిఆర్‌ఎం

- కాంట్రాక్టరు నుంచి రూ.25 లక్షల లంచం డిమాండ్
- పక్కావ్యూహంతో ముంబయిలో అరెస్టు

**ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)**

వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ (డిఆర్‌ఎం) సౌరభ్ కుమార్ ప్రసాద్ ముంబయిలో లంచం తీసుకుంటూ సిబిఐకి చిక్కారు. ఓ కాంట్రాక్టర్ నుంచి లంచం డిమాండ్ చేసిన నేపథ్యంలో ఢిల్లీకి చెందిన కేంద్ర దర్యాప్తు బృందం సిబిఐ పక్కాగా వల పన్ని శనివారం ముంబయిలో ఆయనను అరెస్టు చేసింది. సిబిఐ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... వాల్తేరు డివిజన్‌లోని మెకానికల్ బ్రాంచి పరిధిలో 39 కోట్ల రూపాయల విలువైన పనుల టెండర్లను అనుకూలంగా మార్చేందుకు సౌరభ్ కుమార్ ప్రసాద్ రూ.25 లక్షలు డిమాండ్ చేశారు. దీంతో, కాంట్రాక్టర్ సిబిఐని ఆశ్రయించారు. ప్రస్తుతం సెలవులో ఉన్న డిఆర్‌ఎం కాంట్రాక్టర్‌ను డబ్బులు తీసుకుని ముంబయిలోని తన నివాసానికి రావాలని చెప్పారు. సిబిఐ అధికారులు సదరు కాంట్రాక్టర్ వెంట వెళ్లి డబ్బులు ఇస్తున్న సమయంలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ క్రమంలోనే ఆదివారం విశాఖలోని డిఆర్‌ఎం కార్యాలయంలోనూ, బంగ్లాలోనూ సిబిఐ అధికారులు సోదాలు నిర్వహించి కీలక పత్రాలు స్వాధీనం చేసుకు న్నారు. వాల్తేరు డిఆర్‌ఎంపై గతం నుంచీ ఆరోపణలు ఉన్నాయి. ఎట్టకేలకు సిబిఐ ఢిల్లీ అధికారులు ఆయనను అరెస్టు చేసి విచారణ చేపట్టడంతో సర్వత్రా చర్చనీ యాంశంగా మారింది. సౌరభ్ కుమార్ ప్రసాద్‌ను ఒకటి, రెండు రోజుల్లో విశాఖపట్నానికి తీసుకొచ్చే అవకాశముందని రైల్వే అధికారులు చెప్తున్నారు. రైల్వే చరిత్రలో లంచం తీసుకుంటూ పట్టుబడ్డ డిఆర్‌ఎంల్లో సౌరబ్ కుమార్ ప్రసాద్ రెండోవారు. కొద్ది రోజుల క్రితం గుంతకల్లు డిఆర్‌ఎం వినీత్ సింగ్ లంచం తీసుకుంటూ సిబిఐకి చిక్కారు.

సౌరభ్ కుమార్ ప్రసాద్ (ఫైల్)

## ఎనర్జీ ఎఫిషియెన్సీకి దిక్సూచిలా రాష్ట్రం

- ఇంటర్నేషనల్ సోలార్ అలయెన్స్ డిజి అజయ్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ఎనర్జీ ఎఫిషియెన్సీకి ఆంధ్రప్రదేశ్ దిక్సూచిలా ఉందని ఇంటర్నేషనల్ సోలార్ అలయెన్స్ (ఐఎస్ఎ) డైరెక్టర్ జనరల్ అజయ్ మాథుర్ తెలిపారు. పర్యావరణ మార్పుల నివారణకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకమైన చర్యలు చేపట్టడం అభినందనీయమని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎనర్జీ ఎఫిషియెన్సీకి సంబంధించిన రోడ్ మ్యాప్‌ను అత్యున్నత స్థాయిలో సిఎం పలుమార్లు వ్యక్తిగతంగా సమీక్షించారని తెలిపారు. పెద్దయెత్తున పునరుద్ధరణ ఇంధన ప్రాజెక్టులను స్థాపించడం ద్వారా స్థిరమైన అభివృద్ధిపై దృష్టి సారించిన ఎపి ప్రభుత్వం క్లీన్ ఎనర్జీ (ఐసిఇ) పాలసీ-2024ను రూపొందించడం అభినందనీయమని పేర్కొన్నారు. బిఇఇ, ఇఇఎస్ఎల్ ద్వారా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న అనేక ప్రతిష్టాత్మక కార్యక్రమాల అమల్లో ఎపి అగ్రగామిగా ఉందన్నారు. ఉజాలా పథకం ద్వారా అందరికీ అందుబాటులో ఉండేలా ఎల్ఇడి బల్బులు, స్ట్రీట్‌లైటింగ్ నేషనల్ ప్రోగ్రామ్, అగ్రికల్చర్ డిమాండ్ సైడ్ మేనేజ్‌మెంట్‌తోపాటు ఈ మొబిలిటీ ద్వారా ఉన్నత జ్యోతి పథకాల అమల్లో రాష్ట్రం కీలకంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు.

**ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006**

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501**కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

## సచివాలయ ఉద్యోగులకు వేధింపులు

- గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను ప్రోగ్రెస్ రిపోర్టులు, ర్యాంకుల పేరిట వేధింపులకు కొంతమంది క్షేత్రస్థాయి అధికారులు గురిచేస్తున్నారని గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ విమర్శించింది. జాబ్‌చార్ట్‌కు సంబంధం లేని పనులు చేయిస్తూ మానసిక ఒత్తిడికి గురిచేస్తున్న అధికారులపై శాఖాపరమైన చర్యలను ప్రభుత్వం తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎమ్‌డి జాని పాషా, బత్తుల అంకమరావు, జి హరీంద్ర ఆదివారం విజయవాడ నుంచి ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. వికలాంగ ఉద్యోగులకు క్షేత్రస్థాయి ఫీల్డ్ విధుల నుంచి విముక్తి కల్పించి కేవలం కార్యాలయ విధులు అప్పగించాలని కోరారు.

## పోలవరం ఎత్తు తగ్గించేందుకు కేంద్రం యత్నం

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ విమర్శించారు. సిఎం చంద్రబాబు నదుల అనుసంధానం గురించి మాట్లాడుతుంటే, మరోవైపు కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించే యత్నాలు చేస్తోందని తెలిపారు. విజయవాడలోని దాసరి భవన్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాజెక్టు ఎత్తు తగ్గిస్తే ఈ ప్రాజెక్టు ప్రయోజనాలు దెబ్బతింటాయని చెప్పారు. ఇందువల్ల కేంద్రానికి రూ.25 వేల కోట్లు ఆదా అవుతుందన్నారు.

అలాగే విభజన చట్టానికి వ్యతిరేకంగా నీటి కేటాయింపులు తగ్గించాలని చూస్తున్నారని తెలిపారు. దీనిపై పారదర్శకంగా చర్చ జరగాలన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సిఎం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలని కోరారు. పేదలకు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు నివేశన స్థలాలు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించాలన్నారు.

ఇందుకోసం ఈ నెల 18న అర్హులైన పేదలు సచివాలయాల్లో వ్యక్తిగతంగా అర్జీలు సమర్పించాలని పిలుపునిచ్చారు. ఎఫ్‌పిపిసిఎ ఛార్జీల పేరుతో ప్రజలపై రూ.6,072 కోట్లు భారాన్ని మోపుతూ ఎపిఇఆర్‌సి జారీ చేసిన ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మరో రూ.11,820 కోట్లు విద్యుత్ సర్దుబాటుపై అభ్యంతరాలు స్వీకరించే గడువు నవంబరు 19వ తేదీ వరకూ ఉందని, వివిధ పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యుత్ వినియోగదారులు తమ అభ్యంతరాలను తెలియజేయాలని కోరారు. పది వామపక్ష పార్టీల ఆధ్వర్యాన విజయవాడలో భారీ నిరసన కార్యక్రమం ఈ నెల 19న నిర్వహించనున్నట్లు తెలిపారు.

# ఏటా 15 శాతం వృద్ధి సాధ్యమేనా?

- వ్యవసాయ రంగంలో ఏటా తగ్గుతున్న విస్తీర్ణం
- రైతులకు కొరవడుతున్న ప్రోత్సాహకాలు
- పెరుగుతున్నపెట్టుబడులు
- తగ్గుతున్న ఆదాయం
- విజన్-2047 డాక్యుమెంట్‌పై అధికారుల మల్లగుల్లాలు

**ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి**

రాష్ట్రంలో అన్ని రంగాల్లో 15 శాతం వృద్ధి రేటు సాధించే లక్ష్యంతో నూతనంగా నిర్దేశించుకున్న విజన్-2047 ప్రణాళికల అమలుకు అన్ని జిల్లాల నుంచి ప్రభుత్వం సమాచారం సేకరిస్తోంది. ప్రస్తుతం ఆయా జిల్లాల్లోని వనరులు, వివిధ రంగాల్లో వృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై అన్ని జిల్లాల్లో క్షేత్రస్థాయిలో సదస్సులు నిర్వహిస్తోంది. వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగాల ద్వారా ఏటా 15 శాతం వృద్ధి సాధించాలని, ఐదేళ్లలో వృద్ధి ప్రస్తుతం ఉన్న దాని కన్నా రెట్టింపు కావాలని ప్రభుత్వం జిల్లా కలెక్టర్లకు లక్ష్యాలను నిర్దేశించింది. వివిధ జిల్లాల నుంచి అందిన సమాచారం ప్రకారం... వ్యవసాయ రంగంలో వృద్ధి రేటు ఏటా క్షీణిస్తోంది. కాగితాల్లో గణాంకాలు చెప్పుకోవడానికి గొప్పగా ఉన్నా క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉంటున్నాయి. ప్రధానంగా రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల పరిధిలో సాగు విస్తీర్ణం ఏటా గణనీయంగా తగ్గిపోతోంది. ప్రభుత్వ ప్రోత్సాహకాలు, సబ్సిడీలు తగ్గడం, ఉత్పత్తులు చేతికి వచ్చే సమయానికి ధరలు పడిపోవడం, ఉత్పత్తులన్నీ రైతుల నుంచి దళారుల చేతుల్లోకి వెళ్లిన తర్వాత ధరలు పెరగడం పరిపాటిగా మారింది. కౌలు రైతులే ఎక్కువగా పంటలను సాగు చేస్తున్నారు. వారికి కనీస ఆదరణ, గుర్తింపు లేకుండా ఉంది. దీంతో, సాగు సంక్షోభంలో చిక్కుకుంటోంది. సాగు భూమి విస్తీర్ణం తగ్గిపోతోంది. గత ఐదేళ్లలో ఈ పరిస్థితి మరింత పెరిగింది. 15 నుంచి 20 శాతం విస్తీర్ణం తగ్గడం, లక్షలాది ఎకరాలు ఎలాంటి పంటలూ వేయకుండా ఉండడం గత పదేళ్లగా వ్యవసాయ క్షీణతను తెలియజేస్తోంది. ప్రధానంగా ఖరీఫ్‌లో సాగు విస్తీర్ణం తగ్గడంతో వృద్ధి రేటు పెరుగుదలపై ప్రతికూల ప్రభావం పడుతోందని అధికారులు అంగీకరిస్తున్నారు. 2014 ఖరీఫ్‌లో రాష్ట్రంలో సాగు భూమి 1,05,90,000 ఎకరాలు కాగా, 2024 నాటికి 85,50,250 ఎకరాలకు తగ్గిపోయినట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. 2014 ఖరీఫ్‌లో సాగు విస్తీర్ణం 99 లక్షల ఎకరాలు కాగా, 2024లో 69,97,400 ఎకరాల్లో మాత్రమే వివిధ పంటలు సాగయ్యాయి. వ్యవసాయ శాఖ నుంచి కొంత భూమి ఉద్యాన పంటలకు బదలాయింపు జరిగినా ఎక్కువ భూమి వ్యవసాయేతర అవసరాలకు మారుతోంది. ప్రధానంగా రియల్ ఎస్టేట్ రంగానికి, ఆక్వా కల్చర్‌కు ఎక్కువగా భూ మార్పిడి జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా 66 వేల ఎకరాలు జగనన్న కాలనీలకు నాలుగేళ్ల క్రితం ప్రభుత్వం రైతుల నుంచి సాగు భూమిని కొనుగోలు చేసింది. రాజధాని ప్రాంతంలో 34 వేల ఎకరాల రైతుల పట్టా భూమి, మరో 16 వేల ఎకరాల ప్రభుత్వ భూమిని సిఆర్‌డిఎ తీసుకుంది. వివిధ జిల్లాల్లో రియల్టర్ల కొనుగోళ్లుకూడా పెద్ద సంఖ్యలో జరిగాయి. ఒకవైపు ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడల ప్రభావం, మరోవైపు పెట్టుబడులు భారీగా పెరగడం, ప్రభుత్వ సంస్థలు ఆంక్షల పేరుతో సకాలంలో ఉత్పత్తులను కొనుగోలు చేయకపోవడంతో ఏ పంట సాగు చేసినా గిట్టుబాటు అవుతుందనే నమ్మకం రైతులకు లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో వ్యవసాయ రంగంలో ప్రభుత్వం నిర్దేశించిన వృద్ధి (విజన్ డాక్యుమెంట్-2047)పై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. సాగు నీరు, రైతులకు ప్రోత్సాహకాలు, గిట్టుబాటు ధరల కల్పన, కనీస మద్దతు ధరకు సకాలంలో కొనుగోలు, ప్రకృతి వైపరీత్యాల బారిన పడితే తక్షణ సాయం, ప్రత్యామ్నాయ పంటలకు ప్రోత్సాహకాలు అందించగలిగితే వృద్ధి రేటు కొంతవరకు మెరుగుపడుతుందని వ్యవసాయ అధికారులు, రైతు ప్రతినిధులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ రంగంలో నిర్దేశించుకున్న వృద్ధి సాధించడానికి ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపడుతుందో వేచి చూడాలి.

**గత పదేళ్లలో సాగు భూమి, సాగైన విస్తీర్ణం వివరాలు ఇలా ఉన్నాయి**

| సంవత్సరం | సాగు భూమి (ఎకరాల్లో) | సాగు చేసిన విస్తీర్ణం (ఎకరాల్లో) |
|---|---|---|
| 2014 | 1,05,90,000 | 99,65,000 |
| 2015 | 1,06,25,000 | 90,82,500 |
| 2016 | 1,02,40,000 | 96,55,000 |
| 2017 | 1,05,17,500 | 89,75,000 |
| 2018 | 1,05,40,500 | 88,65,000 |
| 2019 | 1,05,10,500 | 87,35,500 |
| 2020 | 98,97,500 | 91,07,450 |
| 2021 | 96,87,400 | 88,77,500 |
| 2022 | 96,40,700 | 86,55,400 |
| 2023 | 89,37,500 | 62,45,500 |
| 2024 | 85,50,250 | 69,97,400 |

## గ్రూప్-1 అవకతవకలపై న్యాయ విచారణ

- 2018 గ్రూప్-1 అభ్యర్థుల డిమాండ్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

గ్రూప్-1 (2018) నోటిఫికేషన్ ప్రధాన పరీక్షలో అవకతవకలపై జరిగాయని, దానిపై విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఈ పరీక్ష బాధితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రధాన పరీక్షలో అవకతవకలు జరిగాయని ఈ ఏడాది మార్చి 3వ తేదీన తీర్పునిచ్చిందని గుర్తుచేశారు. ప్రధాన పరీక్షను మరలా 6 నెలల్లోగా పూర్తి చేయాలని ఆదేశించిందని తెలిపారు. ప్రతిపక్షంలో ఉండగా టిడిపి ఈ అవకతవకలపై ప్రజాక్షేత్రంలో ప్రస్తావించిందని పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక జరిగిన అసెంబ్లీలోనూ అవినీతి, అవకతవకలపై ప్రస్తావించిందని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు గడుస్తున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ, హైకోర్టు తీర్పు అమలుకు నోచుకోలేదని పేర్కొన్నారు. గ్రూప్-1 ఉద్యోగమే లక్ష్యంగా ప్రధాన పరీక్షలు మరలా నిర్వహిస్తారని తాము ఎదురుచూస్తున్నామని తెలిపారు. ఒకపక్క వయసు పెరుగుతుందని, మరోపక్క ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు.

## 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాల్సిందే

- ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

**ప్రజాశక్తి - పాడేరు (అల్లూరి జిల్లా)**

ఏజెన్సీలో 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, గిరిజనేతరులు ఆక్రమించిన భూములను, నిర్మించుకున్న ఇళ్లను, షాపింగ్ కాంప్లెక్సలను, రిసార్టులను స్వాధీనం చేసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లోతా రామారావు, కిల్లో సురేంద్ర ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. షెడ్యూల్ ఏరియాలో గిరిజనేతరులకు ఇళ్ల స్థలాలను కేటాయించాలని కొందరు గిరిజనేతరులు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రికి విన్నవించడాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకించారు. షెడ్యూల్ ఏరియాలో 1/70 చట్టం అమలులో ఉండగా గిరిజనేతరులకు ఇళ్ల మంజూరు చేయడం నిషేధమన్నారు. అయినప్పటికీ ఏజెన్సీలో పెద్ద పెద్ద షాపింగ్ కాంప్లెక్సలు, రిసార్టులు, మైనింగ్ పేరుతో వందలాది ఎకరాల భూములను కొందరు ఆక్రమించారని, వారిపై ప్రభుత్వం ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడం దారుణమని పేర్కొన్నారు. గిరిజనేతరులకు షెడ్యూల్ ఏరియాలో స్థలాలు మంజూరు చేస్తే ఆదివాసీల భూములు, అడవులు పూర్తిగా కబ్జా అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.

ఇప్పటికే షెడ్యూల్ ఏరియాలో ఆదివాసీలకు వంద శాతం ఉద్యోగ నియామకాలకు ఉద్దేశించిన జిఒ నంబర్ 3 రద్దయిందని, దీంతో ఆదివాసీ యువత, నిరుద్యోగులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని పేర్కొన్నారు. ఆదివాసీ ప్రాంతంలో గిరిజనేతరులకు స్థలాలు కేటాయిస్తే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు.

సైన్స్ ప్రదర్శనను తిలకిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

# ఘనంగా ముగిసిన అమరావతి బాలోత్సవం

**ప్రజాశక్తి-విజయవాడ అర్బన్**

విజయవాడ సిద్ధార్థ ఆడిటోరియంలో మూడు రోజులపాటు జరిగిన అమరావతి బాలోత్సవం ఏడో పిల్లల పండుగ ఆదివారం ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో 200 పాఠశాలల నుండి 15 వేల మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. అకడమిక్, కల్చరల్ విభాగాలు మొత్తం 60 అంశాల్లో పోటీలు జరిగాయి. చివరి రోజు ఆదివారం సైన్సు ప్రదర్శనలు, జానపద గీతాలాపన, మూఖాభినయం, నాటకం వంటి పలు విభాగాల్లో పోటీ పడ్డారు. అమరావతి బాలోత్సవంలో విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ప్రదర్శనలను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు తిలకించారు. చిన్నారులతో ముచ్చటించారు. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో విజేతలకు ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు బహుమతులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పిల్లల వికాసం కోసం ప్రత్యేక మండలి ఏర్పాటు చేయాలని కోరారు. పిల్లల్లో అద్భుతమైన శక్తులు ఉన్నాయని, వాటిని వెలికితీసి సమాజానికి మంచి పౌరులను అందించాలని అన్నారు. పిల్లల కోసం, వారి వికాసం కోసం కృషి చేసే సంస్థలు రావాలని కోరారు. పిల్లల కోసం అమరావతి బాలోత్సవం విశేషంగా కృషి చేస్తోందని, భవిష్యత్తులో కూడా మంచి కార్యక్రమాలను నిర్వహించాలని అన్నారు. కొత్తగూడెం బాలోత్సవం అధ్యక్షులు వాసిరెడ్డి రమేష్‌బాబు మాట్లాడుతూ విజయవాడలో నిర్వహిస్తోన్న పిల్లల పండుగకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. పది వేల మందికిపైగా చిన్నారులు వివిధ పోటీల్లో తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నారని తెలిపారు. పిల్లలకు వారు కోరుకున్న విధంగా బాల్యంలో ఆట, పాట, క్రీడలు ఉండే విధంగా తల్లిదండ్రులు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో అమరావతి బాలోత్సవం అధ్యక్షులు ఎస్‌పి.రామరాజు, ప్రధాన కార్యదర్శి ఆర్.కొండలరావు, కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ, కెనరా బ్యాంక్ జనరల్ మేనేజర్ విజయలక్ష్మి, ప్రముఖ పారిశ్రామికవేత్త బాయణ వెంకట్రావు, సభ్యులు స్వరూప రాణి పలువురు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న విఆర్ఎల గృహ నిర్బంధాలు, పోలీసుల నోటీసులు

- ఆపకుంటే భవిష్యత్తులో పోరాటాలు
- ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

విఆర్ఎ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గట్టు వెంకన్నను గృహ నిర్బంధం చేసిన పోలీసులు

రాష్ట్ర వ్యాప్తంగా విఆర్ఎలు ఎదుర్కొంటున్న న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ ఈ నెల 18న సిసిఎల్ఎతో సామూహిక రాయబారం నిర్వహించేందుకు ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం (గ్రామ సేవకుల సంఘం) పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో సిసిఎల్ఎ కార్యాలయానికి వెళ్లేందుకు అనుమతుల్లేవంటూ గత 48 గంటలుగా రాష్ట్ర వ్యాప్తంగా విఆర్ఎ నేతలకు తహశీల్దార్లు, పోలీసులు నోటీసులివ్వడం, గృహ నిర్బంధాలు చేస్తుండటాన్ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గట్టు వెంకన్న, ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు ఖండించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. విఆర్ఎలను గృహ నిర్బంధాలు చేస్తుండటం దుర్మార్గమని, వారి సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం.. సంఘం నేతలతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. అక్రమ అరెస్టులు సాగించి నిర్బంధాన్ని కొనసాగిస్తే భవిష్యత్తులో పెద్దయెత్తున ఆందోళనా పోరాటాలకు పూనుకోవాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

పుస్తకాన్ని ఆవిష్కరించిన సీనియర్ పాత్రికేయులు అన్నవరపు బ్రహ్మయ్య

## మానవస్పర్శకు సజీవ రూపమే అసలైన సాహిత్యం

- 'అంతరంగ వీక్షణం' పుస్తకావిష్కరణ సభలో వక్తలు

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్**

మానవ స్పర్శకు సజీవ రూపాన్నివ్వడమే అసలైన సాహిత్యమని వక్తలు అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం విజయవాడలోని ఠాగూర్ గ్రంథాలయంలో మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ ఆధ్వర్యంలో కొమ్మవరపు విల్సన్‌రావు సాహితీవేత్తలతో నిర్వహించిన ముఖాముఖిల సంకలనం 'అంతరంగ వీక్షణం' గ్రంథావిష్కరణ సభ జరిగింది. ఈ సభకు సాహిత్య ప్రస్థానం వర్కింగ్ ఎడిటర్ సత్యాజీ అధ్యక్షత వహించారు. పుస్తకాన్ని సీనియర్ పాత్రికేయులు అన్నవరపు బ్రహ్మయ్య ఆవిష్కరించారు. అనంతరం బ్రహ్మయ్య మాట్లాడుతూ, సాహితీవేత్తలను ఇంటర్వ్యూ చేయడం మహాకష్టమని, ఆ కష్టాన్ని ఇష్టంగా చేసుకొని 34 మంది సాహితీవేత్తలను ఇంటర్వ్యూ చేసి వాటన్నిటికీ గ్రంథంగా తీసుకురావడం చాలా గొప్ప విషయమని అన్నారు. విల్సన్‌రావుకు సాహిత్యంపై ఉన్న ప్రేమే పుస్తకం అందించడానికి కారణమని తెలిపారు. సత్యాజీ మాట్లాడుతూ ఈ పుస్తకం ద్వారా ఎంతోమంది వర్తమాన కవుల, రచయితల నేపథ్యాన్ని, సాహిత్య దృక్పథాన్ని అర్థం చేసుకోవచ్చునని అన్నారు. సమకాలీన సాహిత్య, సామాజిక అవగాహనలను ఈ పుస్తకం ప్రతిభావంతంగా రికార్డు చేసిందని కొనియాడారు. పుస్తకాన్ని సమీక్షించిన డాక్టర్ సుంకర గోపాల్ మాట్లాడుతూ, రెండు మూడు తరాల సాహితీవేత్తల వృత్తిని, ప్రవృత్తిని రికార్డు చేసిన విల్సన్‌రావు చరిత్రలో ఓ పేజీగా నిలిచిపోతారని అన్నారు. సాహితీవేత్త బండ్ల మాధవ రావు మాట్లాడుతూ విల్సన్‌రావు సాహిత్యపు అద్దంలోంచి సమాజాన్ని చూస్తున్న ఒక కొత్తచూపునకు ఈ ఇంటర్వ్యూల గ్రంథం తిరుగులేని నిదర్శనమన్నారు. రచయిత విల్సన్‌రావు మాట్లాడుతూ.. 34 మంది సాహితీవేత్తల జీవన, సాహితీ నేపథ్యాన్ని అక్షరాలుగా మార్చడంలో తాను పడ్డ కష్టాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.రమాదేవి, మల్లెతీగ ఎడిటర్ కలిమిశ్రీ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమాన్ని చొప్పా రాఘవేంద్రశేఖర్ పర్యవేక్షించారు.

## జిల్లా సమగ్రాభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించాలి

- సిపిఎం విజయనగరం జిల్లా 10వ మహాసభ డిమాండ్

**ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి**

జిల్లా సమగ్రాభివృద్ధికి కనీసం రూ.10 వేల కోట్లు కేటాయిచాలని సిపిఎం విజయనగరం జిల్లా పదో మహాసభ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. నిర్దిష్ట కాలపరిమితితో కూడిన ప్రణాళికను ప్రభుత్వం ప్రకటించి అభివృద్ధి చేయాలని కోరింది. విజయనగరంలో శని, ఆదివారాల్లో జరిగిన మహాసభలో ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు తీర్మానం ప్రవేశపెట్టగా మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఉత్తరాంధ్ర అభివృద్ధికి బుందేల్‌ఖండ్ తరహా ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని, గిరిజన యూనివర్సిటీ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని డిమాండ్ చేసింది. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి సహా జిల్లాలో చేపట్టిన తారకరామ, తాటిపూడి జలాశయాలకు తగినంత నిధులు కేటాయించాలని, మామిడి, జీడి, చింతపండు లాంటి ప్రాసెసింగ్ ప్లాంట్లు, సంప్రదాయ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసింది. ఉపాధి హామీ పని దినాలు 200 రోజులకు పెంచాలని, కనీసంగా రూ.600 చొప్పున కూలి రేట్లు పెంచాలని కోరింది. పట్టణాల్లో ఉపాది హామీని వర్తింపజేయాలని, మహిళల ఉపాధికి ప్రత్యేక ప్రభుత్వం కృషి చేయాలని, విభజన హామీల్లో భాగంగా ప్రత్యేక ప్యాకేజీ అమలు చేయాలని డిమాండ్ చేసింది.

**బలమైన ప్రజా ఉద్యమాలు నిర్మించాలి : కె.లోకనాథం**

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం

జిల్లాను ప్రభావితం చేసే అంశాలపై ఉద్యమించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం పిలుపునిచ్చారు. మహాసభలో ఆయన మాట్లాడుతూ బలమైన ప్రజా ఉద్యమాల ద్వారానే ప్రజల్లో విశ్వాసాన్ని పొందగలమన్నారు.. కార్మికవర్గ సమస్యలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. ప్రజాసంఘాలను ఐక్యవేదికపైకి తీసుకొచ్చి ఉద్యమించడం ద్వారా ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక చర్యలను నిలువరించవచ్చని అన్నారు. పార్టీ సభ్యులంతా ప్రజలతో మరింత మమేకం కావాలని, సైనికుల్లా ముందుకు కదలాలని దిశానిర్దేశం చేశారు.

**మతోన్మాద శక్తులను నిలువరించాలి : వై.వెంకటేశ్వరరావు**

దేశంలో మతోన్మాద శక్తులను నిలువరించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఇందుకోసం కలిసొచ్చే శక్తులతో కలిపి పోరాడేందుకు సన్నద్ధం కావాలని దిశానిర్దేశం చేశారు. మహాసభలో ఆదివారం ఆయన ముగింపు ఉపన్యాసం చేశారు. దేశంలో బిజెపి ప్రభుత్వం మతోన్మాద అజెండాతో ముందుకు సాగుతోందన్నారు. గతంలో తనకు కమ్యూనిస్టు యోధుడు చేగువేరా ఆదర్శమంటూ చెప్పుకున్న జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్... ఇప్పుడు బిజెపి తరపున మహారాష్ట్రలో ఎన్నికల ప్రచారంలో బాలా సాహెబ్ థాక్రే ఆదర్శమంటున్నారని విమర్శించారు.

**జిల్లా కార్యదర్శిగా తమ్మినేని**

తమ్మినేని సూర్యనారాయణ

సిపిఎం విజయనగరం జిల్లా కార్యదర్శిగా తమ్మినేని సూర్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా టివి.రమణ, రెడ్డి శంకరరావు, వి.లక్ష్మి, పి.శంకరరావు సహా 14 మందితో జిల్లా కమిటీ ఎన్నికైంది.

## శిక్షణా కేంద్రం దూరంగా ఉంటే లీడర్‌షిప్ ట్రైనింగ్ బాయ్‌కాట్ : ఫ్యాప్టో

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

శిక్షణా కేంద్రానికి దూరంగా ఉన్న ఉమ్మడి జిల్లాల వారు లీడర్‌షిప్ ట్రైనింగ్‌ను బాయ్‌కాట్ చేయాలని ఫ్యాప్టో పిలుపునిచ్చింది. ఈ మేరకు ఫ్యాప్టో ఛైర్మన్ ఎల్ సాయిశ్రీనివాస్, సెక్రటరీ జనరల్ ఎస్ చిరంజీవి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. లీడర్‌షిప్ ట్రైనింగ్‌కు రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది కేంద్రాల్లో శిక్షణ నిర్వహించేందుకు నిర్ణయం చేసిందని తెలిపారు. ఉపాధ్యాయ సంఘాలు, ఫ్యాప్టో ప్రాతినిధ్యం మేరకు అన్ని జిల్లా కేంద్రాల్లో ట్రైనింగ్ నిర్వహిస్తామని సమగ్రశిక్షా డైరెక్టర్ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఇచ్చిన హామీకి భిన్నంగా పాత పద్ధతిలోనే శిక్షణా కేంద్రానికి దూరంగా ఉన్నచోట నిర్వహిస్తున్నారని వెల్లడించారు. శిక్షణా కేంద్రానికి దూరంగా ఉన్న ఉమ్మడి జిల్లాల వారు (ఉమ్మడి కడప, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలు) ట్రైనింగ్‌ను బాయ్‌కాట్ చేయాలని పిలుపునిచ్చారు.

## ధాన్యం అమ్మకం సులభతరం

- అందుబాటులోకి వాట్సాప్ నెంబరు

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

రైతులు ధాన్యం అమ్మకం ప్రక్రియను ప్రభుత్వం సులభతరం చేస్తోంది. రైతుల సమయం వృథా కాకుండా ఉండేందుకు ఈజ్ ఆఫ్ డూయింగ్ ఫార్మర్ సర్వీస్ పేరుతో కొనుగోళ్లను సరళతరం చేసేందుకు వీలుగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటున్నట్లు పేర్కొంటోంది. రైతులకు మెరుగైన సేవలందించేందుకు వీలుగా 7337359375 వాట్సాప్ ద్వారా సేవలు అందుబాటులోకి తెచ్చినట్లు పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ధాన్యం అమ్మదలచిన రైతులు వాట్సాప్ నెంబర్‌కు హాయ్ అని సందేశం పంపిన వెంటనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ప్రత్యేక వాయిస్‌తో సేవల వినియోగం మార్గదర్శకం చేయనుంది. తొలుత రైతు తన ఆధార్ నెంబర్ నమోదు చేయాలి. అనంతరం రైతు పేరును ధ్రువీకరించాల్సి ఉంటుంది. అనంతరం ధాన్యం అమ్మదలచిన కొనుగోలు కేంద్రం పేరును ఎంచుకోవాల్సి ఉంటుంది. తర్వాత ధాన్యం అమ్మదలచిన తేదీకి సంబంధించి మూడు ఆప్షన్లు ఇస్తారు. అందులో ఏదో ఒక తేదీని రైతు నిర్ణయించుకోవాల్సి ఉంటుంది. అనంతరం వచ్చే సందేశంలో ఎంత మేర ధాన్యం బస్తాలను అమ్మదలిచారో అనే అంశానికి సంబంధించి ప్రత్యేక ఆప్షన్ ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే పౌరసరఫరాలశాఖ నుంచి స్లాట్ బుక్ అయినట్లు షెడ్యూల్ కూపన్ కోడ్ వస్తుంది. దీంతో రైతు సులభంగా తన ధాన్యం అమ్మకం తేదీ, సమయాన్ని బట్టి తాను ఎంచుకున్న కొనుగోలు కేంద్రం వద్దకు వెళ్లి సులభంగా ధాన్యాన్ని అమ్ముకోవచ్చని ప్రభుత్వం పేర్కొంటోంది. ప్రతి ఆప్షన్ కేవలం ఒక క్లిక్‌తో రైతు సులభంగా స్లాట్ బుక్ చేసుకునే విధంగా అందుబాటులోకి తేనుంది.

## టిటిడి బోర్డు ఎక్స్‌అఫీషియో సభ్యునిగా శ్యామలరావు ప్రమాణం

**ప్రజాశక్తి- తిరుమల**

టిటిడి బోర్డు ఎక్స్-అఫీషియో సభ్యుడిగా టిటిడి ఇఒ జె.శ్యామలరావు ఆదివారం తిరుమల శ్రీవారి ఆలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో అడిషనల్ ఇఒ సిహెచ్.వెంకయ్య చౌదరి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆలయం ముందు మీడియాతో ఇఒ మాట్లాడుతూ.. గత ఐదు నెలలుగా టిటిడిలో ఎన్నో మంచి కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. సామాన్య యాత్రికులకు సౌకర్యాల కల్పన, అన్న ప్రసాదాలు, లడ్డూ ప్రసాదాల నాణ్యత పెంచేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిటిడి సివిఎస్ఒ శ్రీధర్, డిప్యూటీ ఇఒలు లోకనాథం, భాస్కర్, విజిఒ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ విద్యార్థిపై అసిస్టెంట్ ప్రొఫెసర్ దాష్టీకం

- కటింగ్ సరిగా లేదని మెడికోకు గుండు కొట్టించిన వైనం

**ప్రజాశక్తి - హైదరాబాదవ్ బ్యూరో**

ఈ నెల 12వ తేదీ రాత్రి తెలంగాణ రాష్ట్రం ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థిపై.. అసిస్టెంట్ ప్రొఫెసర్ దాష్టీకం ప్రదర్శించి గుండు గీయించాడు. ఈ ఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న ములుగు జిల్లాకు చెందిన ఓ విద్యార్థి ఈనెల 12వ హెయిర్ కటింగ్ చేయించుకుని హాస్టల్‌కు వచ్చారు. కటింగ్ స్టైల్ సరిగా లేదని సెకండియర్ విద్యార్థులు చెప్పడంతో తిరిగి మళ్లీ కటింగ్ చేయించుకు వచ్చారు. విద్యార్థి హాస్టల్‌కు వచ్చే సరికి యాంటీ ర్యాగింగ్ మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ చూసి "ఏందా కటింగ్" అంటూ విద్యార్థిపై కోపోద్రికుడై ఉన్నతాధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే సెలూన్ షాప్‌లో గుండుగీయించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, పిడిఎస్‌యు ఆధ్వర్యంలో ఆదివారం మెడికల్ కళాశాల బాలుర హాస్టల్ ఎదుట ఆందోళన నిర్వహించారు.

# ప్రత్యామ్నాయ రాజకీయాలు నచ్చకే సిపిఎంపై దాడి

**ప్రజామిత్ర**

సిపిఎం స్వతంత్ర రాజకీయ విధానాలు నచ్చని వారు వివిధ కోణాల నుంచి పార్టీపై ఏదో ఒక నింద మోపుతూ దాడి చేస్తూనే ఉన్నారు. తాజాగా ఆంధ్రజ్యోతిలో ఆర్‌కె "కొత్త పలుకు" లో "అహంకారం, హాహాకారం" అన్న శీర్షికతో రాసిన సంపాదక వ్యాసం కూడా అలాంటిదే. సిపిఎం రాష్ట్రంలో వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌తో అంటకాగిందని, రహస్యంగా సహకరించిందని నిరాధారమైన ఆరోపణ చేశారు. ఇందులో కొత్తదనమేమీ లేదు. ఈ రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపికి ప్రజలు ఎలాంటి సమాధానం చెప్పారో ఆర్కేగారికి తెలుసు. దేశంలో ఎక్కడా లేనంత బలహీనంగా ఈ రాష్ట్రంలో బిజెపి ఉందంటే దానికి అదే కారణం. కానీ, బిజెపి రాష్ట్రానికి చేస్తున్న ద్రోహం గురించి గానీ, నష్టం గురించి గానీ ఈ రాష్ట్రంలో దాని స్థానం గురించి గానీ కనీసం ఒక్క మాట కూడా ఆర్కేగారు ప్రస్తావించలేదు. ఆయనకు బిజెపిపై విమర్శలు చేసే ధైర్యం ఉందా లేదా అన్నది ప్రశ్నార్థకమే. రాజకీయ పరిణామాలను, అంచనాలను నిష్పక్షపాతంగా, వస్తుగతంగా అంచనా వేయాల్సిన ఆర్కే లాంటి ఒక వృత్తిపరమైన సీనియర్ జర్నలిస్టు రాజకీయ నాయకునిలాగా విమర్శలు చేయడం సబబు కాదు. ఆయనకు సిపిఎం రాజకీయ విధానం తెలియదని అనుకోలేం. సిపిఎం రాజకీయ తీర్మానం చదవకుండా రాసి ఉంటారని కూడా అనుకోలేం. ఇతర పార్టీల్లోలాగా ఒక వ్యక్తి లేదా కొందరు వ్యక్తులు ఇష్టాను సారం రాజకీయ విధానాలు తీసుకోలేరని సిపిఎం గురించి కనీస అవగాహన ఉన్నవారికెవరికైనా తెలుసు. అయినా దాన్ని అప్రతిష్టపాల్జేయడానికే ఇలాంటి నిందలు నిరంతరం వేస్తుంటారు. ఇది ఒకవైపు నుంచి సాగుతున్న దాడి మాత్రమే కాదు. గతంలో వైసిపి ప్రభుత్వ హయాంలో జరిగిన ప్రజా ఉద్యమాల సందర్భంగా ఇలాంటి దాడే జరిగింది. అధికారంలో ఏ పార్టీ ఉన్నా సిపిఎం వారికి వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీ కోసమే ఉద్యమాలు సాగిస్తున్నట్టు ప్రచారం చేస్తుంటారు. 2000 సంవత్సరం నుంచి ఇదే తంతు. నాడు విద్యుత్ ఉద్యమం బషీర్‌బాగ్ కాల్పులు సందర్భంగా కాంగ్రెస్‌తో కలిసి టిడిపిని గద్దె దించడానికే ఈ ఉద్యమం చేసిందని ఇదే పత్రికలో రాశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సిఎంగా ఉండగా జరిగిన ఇళ్ల స్థలాల పోరాటం సందర్భంగా ముదిగొండలో కాల్పులు జరిగాయి. తెలుగుదేశం పార్టీని గద్దెనెక్కించడానికి సిపిఎం ఈ ఉద్యమాన్ని నడిపినట్టు ఆడిపోసుకున్నారు. పైగా కులగజ్జిని కూడా అంటించారు. నాడైనా... నేడైనా... రాష్ట్రంలో సిపిఎం అనుసరించే రాజకీయ విధానం అఖిలభారత రాజకీయ విధానానికి అనుగుణంగానే ఉంటుంది.

1999-2004 మధ్య టిడిపి... బిజెపితో కలిసి కేంద్రాన్ని బలపర్చింది. 2014-19 మధ్య కూడా ఇదే కూటమి వచ్చింది. ఇప్పుడు కూడా బిజెపి కూటమిలోనే టిడిపి సాగుతోంది. మధ్యలో రెండుసార్లు బయటకు వచ్చి మళ్లీ కలిసిపోయారు. బిజెపిని ఒంటరిపాటు చేయడం, ఓడించడం అనేది పార్టీ రాజకీయ విధానం. ఒకవైపు ప్రజాసమస్యలపై ఉద్యమిస్తూనే మరోవైపు బిజెపి వ్యతిరేక శక్తులను కూడేసే ప్రయత్నం చేశాం. 2024 ఎన్నికలు ఇండియా బ్లాక్‌లో భాగంగా సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్ సర్దుబాటు చేసుకున్నాయి. తెలుగుదేశాన్ని గెలిపించడానికే వామపక్షాలు కాంగ్రెస్‌తో కలిశాయని ప్రచారం చేసినవారున్నారు. ఆర్‌కె గారు ఈ వ్యాసంలో ఎక్కడా బిజెపి ప్రస్తావనే చేయలేదు. గత ప్రభుత్వ హయాంలో వైఎస్‌ఆర్ పార్టీకి పరోక్షంగా సహకరించి, ఇప్పుడు ఐదు నెలలనైనా కాకుండా టిడిపి కూటమి ప్రభుత్వంపై ఉద్యమాలు చేస్తున్నాయని ఆరోపిస్తున్నాయి. బహుశా వారి దృష్టిలో టిడిపిని అనుసరించకపోవడం అంటే వైఎస్‌ఆర్‌ను బలపర్చినట్టు కావచ్చు. వైఎస్‌ఆర్ దృష్టిలో వారిని వ్యతిరేకిస్తే టిడిపిని బలపర్చినట్టు చూస్తారు. రాష్ట్రంలో గతంలో వైఎస్‌ఆర్, ఇప్పుడు టిడిపి రెండూ బిజెపిని అంటకాగుతున్నాయి. బిజెపి పట్ల ఆయా పార్టీల వైఖరిని బట్టే ఆ పార్టీల పట్ల సిపిఎం విధానం ఉంటుంది. దాన్ని బట్టే రాజకీయ విమర్శలు కూడా ఉంటాయి. వారు ఒకవేళ బిజెపికి వ్యతిరేకంగా ఉన్నా... ప్రజా సమస్యల విషయంలో పోరాటాలు చేయకుండా రాజీపడదు. అది పాలక పార్టీలకు వేటికైనా కంటగింపుగానే ఉంటుంది.

రహస్య రాజకీయాలు చేయడం సిపిఎంకు ఇంటా వంటా ఉండదు. పాలక పార్టీల మకిలి ఆలోచనలను దుష్ట రాజకీయాల ఆలోచనలను సిపిఎంకు అంటగట్టి ఆరోపించడం అన్యాయం. మన రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపి, మోడీ రాజకీయాలను నెత్తికెత్తుకుని చంద్రబాబు నాయుడు గారు ప్రచారం చేస్తున్నారు. గతంలో జగన్ కూడా ఇదే పనిచేశారు. ఈ లాలూచీ రాజకీయాలను వ్యతిరేకించడమే సిపిఎం చేసిన నేరం. సిపిఎం రాజకీయ విధానం ఏదైనా అది తప్పయినా... ఒప్పయినా పారదర్శకంగానే ఉంటుంది. ఒకవేళ తప్పు నిర్ణయం చేస్తే... ప్రజల ముందు బహిరంగంగా అంగీకరించి ఆత్మవిమర్శ చేసుకుంటుంది. దాన్ని కూడా సహించలేక ఏగతాళి చేసేవారు లేకపోలేదు. సిపిఎం అధికార విధానం తెలియకుండానే మతం విషయంలో ఈ మధ్య ఆంధ్రజ్యోతిలో ఒక వార్త వచ్చింది. దాన్ని అడ్డంపెట్టుకుని సిపిఎంపై సోషల్ మీడియాలో కొంతమంది దాడి చేశారు. ఏప్రిల్‌లో మదురైలో జరగనున్న అఖిల భారత మహాసభకు ముందు అంటే ఫిబ్రవరి మొదటి వారంలో పార్టీ సమీక్షా నివేదిక, రాజకీయ ముసాయిదా తీర్మానం బహిరంగంగా వెలువడతాయి. అప్పటి దాకా ఆగే ఓపిక కూడా లేకుండా అదిగో పులి అంటే... ఇదిగో తోక అంటూ సిపిఎంపై విమర్శల వర్షం కురిపించారు. సిపిఎం ఎవరిపక్షమూ కాదు. ఎన్నికల సర్దుబాటు ఎన్నికల వరకే పరిమితం. దానికి ముందు, తర్వాత ఎప్పుడూ ప్రజాపక్షమే. ప్రజల కోసమే సిపిఎం విధానం. పదవుల కోసం లాలూచీ పడేవారికి రహస్య ఎజెండాలు ఉంటాయి. సిపిఎం నాయకత్వానికి ఆ అవసరం లేదు. వైఎస్‌ఆర్ అనుకూల మీడియాలో సిపిఎం పోరాడటం లేదని, చేవ చచ్చిందని రెచ్చగొడుతూ రాసినవారున్నారు. ప్రభుత్వంపై చిన్నపాటి విమర్శ చేసినా... వైఎస్‌ఆర్ కోసమే చేసినట్టు చిత్రీకరించేవారూ ఉన్నారు. నిజానికి ఇటీవల ప్రభుత్వ విధానాలపై ఈనాడు, ఆంధ్రజ్యోతి వంటి పత్రికలు సైతం విమర్శలు చేస్తూ రాశాయి. ఉదాహరణ... ఇసుక, మద్యం, అవినీతి విషయాల్లో టిడిపి ఎమ్మెల్యేలపై ఈ పత్రికలు కూడా విరుచుకుపడుతున్నాయి. ఆఖరికి ప్రభుత్వ యంత్రాంగం, పోలీస్, పాలనా అధికారులపై విమర్శలు గుప్పించారు. అంటే దాని అర్థం వారు వైఎస్‌ఆర్‌కు తోడ్పడుతున్నారనా?

టిడిపి కూటమి అధికారంలోకి వచ్చి ఐదు మాసాలే అయినా గత ప్రభుత్వానికి భిన్నంగా ఏమి చేసిందో ఆర్‌కె గారు చెప్పాలి. గత ప్రభుత్వం వదిలి వెళ్లిపోయిన విద్యుత్ ట్రూ అప్ ఛార్జీలను జనంపై మోపలేదా? ఇదే ప్రభుత్వం స్కీం వర్కర్స్, మున్సిపల్ కార్మిక యూనియన్లతో చేసుకున్న ఒప్పందాలను కూడా గౌరవించి అమలు చేయాలి కదా? కార్పొరేట్‌లకు అనుకూలమైన విధానాలను పాత ప్రభుత్వం చేసినా కొనసాగించడం, ప్రజలకు మేలు చేసే నిర్ణయాలు పాత ప్రభుత్వం చేసినా దానితో సంబంధం లేదనడం ఎంతవరకు సబబు? దాన్నే సిపిఎం ప్రశ్నిస్తుంది. అదే ఆర్‌కె గారికి నచ్చడం లేదు. ఈ విషయంలో సిపిఎం నిస్సహాయత వ్యక్తం చేయడం మినహా ఏమీ చేయలేదు. టిడిపి చేసిన వాగ్దానాలను అమలు చేయమంటున్నాం తప్ప గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదే? విశాఖ ఉక్కు పరిరక్షణ, ఉద్యోగులు, కార్మికుల వేతనాలు పెంపుదల, రైతులకు, కూలీలకు ఇచ్చిన హామీల అమలు, సంక్షేమ పథకాల అమలు ఇదే కదా సిపిఎం కోరుతోంది? వీటిని అడుగుతున్నందుకే సిపిఎంపై దాడి. మహిళలకు రక్షణ కల్పించాలని సిపిఎం డిమాండ్ చేస్తే తప్పు. అదే పవన్‌కల్యాణ్ మాట్లాడితే ఒప్పు. ఇదేమి విధానం? సిపిఎం విధానాలపై విమర్శలు, అది చేస్తున్న ఉద్యమాలపై ఈ రచయితలకు కలిగిన కలవరపాటును అర్థం చేసుకోగలం. సిపిఎం రాజకీయ విధానాలను బట్టి నడుస్తుంది తప్ప వ్యక్తులను బట్టి నడవదు. అధికార పార్టీ నాయకులైనా... అది చంద్రబాబైనా, జగనైనా... వ్యక్తిగత ధూషణలకు దిగదు. అలాంటి వాటిని అంగీకరించదు. సోషల్ మీడియాలో చంద్రబాబు కుటుంబ సభ్యులపై దాడి జరిగినా, షర్మిలపై జరిగినా, భారతిపై జరిగినా సిపిఎం అంగీకరించదు. సోషల్ మీడియాలో ట్రోలింగ్‌తో వ్యక్తిత్వ హననానికి పాల్పడే సంస్కృతిని మొదట ప్రవేశపెట్టింది బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్. వామపక్ష మేధావులకు నిద్రపట్టకుండా చేసింది. ద వైర్, న్యూస్ క్లిక్ వంటి సంస్థలపై సంఘపరివార్ దాడి చేసినప్పుడు టిడిపి మాట్లాడిందా? బిజెపి మతోన్మాది కాదు... మానవతావాది అంటూ సనాతన ధర్మం పేరుతో లౌకికవాదంపై పవన్‌కల్యాణ్ దాడి చేస్తుంటే నోరు విప్పారా? ఆర్‌కె గారు దాన్ని ప్రశ్నించరా? ఇటీవల కన్నుమూసిన సీతారాం ఏచూరిని చంపుతామని బెదిరించింది వాస్తవం కాదా? దాన్ని ఖండించారా? ఇలాంటి ప్రశ్నలు ఎన్నింటికో ఆర్‌కె గారు భవిష్యత్తులోనైనా సమాధానం చెబుతారని ఆశిద్దాం.

## కేంద్ర ఉద్యోగుల రిటైర్‌మెంట్ వయసు
## 62 ఏళ్లకు పెంపు

- క్యాబినెట్ ఆమోదం

**న్యూఢిల్లీ :** కేంద్ర ఉద్యోగుల పదవీ విరమణ వయసు 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలని కేంద్రం నిర్ణయించింది. అనుభవజ్ఞులైన ఉద్యోగుల సేవలను ఎక్కువ కాలం పొందడం వల్ల పరిపాలన మెరుగుపడుతుందని కేంద్రం చెబుతోంది. ఉన్న ఖాళీలను భర్తీ చేయకుండా.. ఇప్పుడున్న ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంచటం పట్ల నిరుద్యోగుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.

చాలా కాలంగా కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న ఈ ప్రతిపాదన మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికలకు ముందు కేంద్ర క్యాబినెట్ సమావేశంలో ఆమోదం పొందటం గమనార్హం. ఈ నిర్ణయం ఏప్రిల్ 1, 2025 నుంచి అమల్లోకి వస్తుంది.

## రవిబాబు జీవితం ఆదర్శప్రాయం

- సంతాప సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి

**ప్రజాశక్తి - ఇంకొల్లు(బాపట్ల జిల్లా)**

ఎస్‌ఎఫ్‌ఐ మాజీ నాయకులు, ఐఆర్‌ఎస్ మాజీ ఉద్యోగి కామ్రేడ్ మంచాల రవిబాబు జీవితం ఆదర్శప్రాయమని సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.రమాదేవి అన్నారు. బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలం గంగవరంలో రవిబాబు సంతాప సభ ఆదివారం జరిగింది. తొలుత ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. సిపిఎం మండల కార్యదర్శి నాగండ్ల వెంకటరావు అధ్యక్షతన జరిగిన సంతాప సభలో రమాదేవి మాట్లాడుతూ.. ఉన్నతమైన ఉద్యోగంలో ఉండి కూడా తాను నమ్మిన సిద్ధాంతానికి అనుగుణంగా పని చేశారని తెలిపారు. ఎదుటివారి కష్టాల గురించి మనకెందుకులే అనే భావనలు ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో తాను పుట్టిన గ్రామం, పని చేస్తున్న శాఖ గురించి ఆలోచించే తత్వం ఉన్న రవిబాబు లాంటి వారు అరుదుగా ఉంటారన్నారు. ఆయనను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి వి కృష్ణయ్య మాట్లాడుతూ.. రవిబాబు కాకినాడ జెఎన్‌టియు కాలేజీలో ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్షులుగా పని చేశారని తెలిపారు. విద్యార్థి దశలో జరిగిన అనేక పోరాటాల్లో ముందు ఉండేవారని వివరించారు. గత ఆరేళ్లుగా 'అనేక ధార' అనే సంస్థను ఏర్పాటు చేసి దాదాపు 200 మంది మేధావులతో ఆర్థిక, సామాజిక, విద్య, ఉద్యోగ సమస్యలపై చర్చించే వారని తెలిపారు. సిపిఎం రాష్ట్ర నాయకులు వై.సిద్ధయ్య మాట్లాడుతూ.. రవిబాబుతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. రవిబాబు సోదరుడు డాక్టర్ మంచాల రమేష్ బాబు మాట్లాడుతూ.. తాను పెద్దవాడినైనప్పటికీ తమ కుటుంబ సభ్యులు విద్య, జీవనశైలి, ఉద్యోగ, ఆర్థిక వ్యవహారాల్లో రవిబాబు సూచనలే పాటించే వారమని తెలిపారు. ఉద్యోగరీత్యా నియమాలకు అనుగుణంగా కొనసాగేవాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో రవిబాబు సహచర ఉద్యోగి గగారిన్, ప్రకాష్, విశ్రాంత ఉపాధ్యాయుడు కరిక మల్లేశ్వరరావు, కందిమళ్ల రామకోటేశ్వరరావు, డాక్టర్ సమత, రవి సోదరి శాంతకుమారి, సాంబయ్య, పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రమేష్ బాబు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి

## విద్యుదాఘాతంతో ఇద్దరు దుర్మరణం

**ప్రజాశక్తి - మహానంది**

విద్యుత్ తీగలు లారీకి తగలడంతో ఇద్దరు మృతి చెందారు. ఈ సంఘటన నంద్యాల జిల్లా మహానంది మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అబ్బీపురం గ్రామం నుండి బాపట్లకు లారీలో అరటి గెలలను తరలిస్తున్నారు. లారీ కృష్ణనంది ఆలయం వైపు వెళ్తుండగా మార్గ మధ్యలో నిలిచిపో యింది. దీంతో, నంద్యాలకు చెందిన లారీ డ్రైవర్ రాఘవేంద్ర, అబ్బీపురం గ్రామానికి చెందిన రైతు నాగూర్ (45) పరిశీలించేందుకు లారీ నుంచి కిందకు దిగారు. అప్పటికే లారీ పైభాగంలో ఉన్న విద్యుత్ తీగలు తెగి కింద పడ్డాయి. కరెంటు తీగలను గమనించకుండా వాటిపై వారు కాళ్లు వేయడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు.

## ప్రజలను చైతన్యపరిచేదే ఉత్తమ సాహిత్యం

- సాహితీవేత్త మొండెపు ప్రసాద్

**ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ (విజయవాడ)**



సుజనాదేవిని సన్మానిస్తున్న నిర్వాహకులు

ప్రజలను నిద్రావస్థ నుంచి మేల్కొలిపి చైతన్యపరిచే రచనలు రావాలని, అవి ఉత్తమ సాహిత్యంగా ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలుస్తాయని ప్రముఖ సాహితీవేత్త మొండెపు ప్రసాద్ అన్నారు. ఆదివారం 'ఎక్స్ రే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ' ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ఎక్స్‌రే మాసపత్రిక నిర్వహించిన కవితల పోటీ విజేతలకు అవార్డుల బహూకరణ సభను విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ హాల్లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ.. సమాజాన్ని కవి అధ్యయనం చేయాలని సూచించారు. కాలక్షేపం కోసం కవిత్వం కాదు, జీవితపు లోతులను తెలిపేదిగా కవిత్వం ఉండాలన్నారు. సాహితీ అతిథి, న్యాయనిర్ణేత, జిల్లా సెషన్స్ జడ్జి డాక్టర్ మంగారి రాజేందర్ (జింబో) ప్రసంగిస్తూ.. కవికి అధ్యయనం కావాలని, అధ్యయనం ద్వారా మంచి సాహితీ సృజన జరుగుతుందన్నారు. కరీంనగర్‌కు చెందిన నామని సుజనా దేవి ప్రధాన అవార్డుకు ఎంపికయ్యారు. విజేతను రూ. 12 వేలు, శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. ఉత్తమ కవితా అవార్డు గ్రహీతలుగా కోరాడ అప్పలరాజు (అనకాపల్లి), చొక్కర తాతారావు (విశాఖపట్నం), ఎన్ లహరి, రాధశ్రీ (హైదరాబాదు), రేపాక రఘునందన్ (తిరువూరు), వెంకు సనాతని (బాపట్ల), పొత్తూరి సీతారామారాజు (కాకినాడ), కమలేష్ (శంకరపల్లి, రంగారెడ్డి జిల్లా), రమాదేవి (స్టేషన్ ఘనాపూర్), జగన్నాథం రామమోహన్ (కొత్తూరు, నెల్లూరు)ను ఘనంగా సత్కరించి నగదు, జ్ఞాపిక, శాలువాతో సత్కరించారు.

ఈ సందర్భంగా విజేతల కవితలతో ప్రత్యేక సంచికను శ్రీశ్రీ సాహిత్యనిధి కన్వీనర్ సింగంపల్లి అశోక్ కుమార్ ఆవిష్కరించారు. కవుల కృషిని ప్రముఖ వైద్యురాలు సిహెచ్ దుర్గారాణి అభినందించారు. ఎక్స్ రే మాస పత్రిక సంపాదకులు కొల్లూరి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో సుధీర్ సంస్థల అధినేత నూకల వెంకట సాంబశివరావు, సంస్థ ఉపాధ్యక్షులు కందికొండ రవి కిరణ్, ప్రధాన కార్యదర్శి బోడి ఆంజనేయ రాజు, కోశాధికారి చామర్తి వెంకట సుబ్బయ్య, పొత్తూరి సీతారామారావు, బి వసంత కుమార్, కొండాయగుంట రాము, కొల్లా జయశ్రీ, కనకవల్లి, సామినేని శైలజ, డి శ్రీవల్లి పాల్గొన్నారు. పలువురు సాహితీ ప్రముఖులు పాల్గొన్నారు.

## ఉద్యోగోన్నతుల్లో అక్రమాలపై జ్యుడీషియల్ విచారణ

- నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ డిమాండ్

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

విద్యాశాఖలో సహాయ సంచాలకుల అక్రమ ఉద్యోగోన్నతులపై విశ్రాంత న్యాయమూర్తులతో జ్యుడీషియల్ విచారణ జరిపించడంతోపాటు, అక్రమ ఉద్యోగోన్నతులను తక్షణమే ప్రభుత్వం రద్దు చేయాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈమేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత ఐదేళ్లుగా విద్యాశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్లు అనేక అవకతవకలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. డిఇఒ, డివైఇఒ, డైట్ ప్రిన్సిపాల్ ఉద్యోగోన్నతులపైనా న్యాయ విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు.

## రామ్మూర్తి నాయుడుకు తుది వీడ్కోలు

- పాడె మోసిన చంద్రబాబు, నారా లోకేష్
- అధికార లాంఛనాలతో అంత్యక్రియలు
- ప్రగాఢ సంతాపం తెలిపిన గవర్నర్

**ప్రజాశక్తి- రామచంద్రపురం (చంద్రగిరి)**

పాడె మోస్తున్న చంద్రబాబు నాయుడు, నారా లోకేష్

ఆంధ్రప్రదేశ్ సిఎం చంద్రబాబు తమ్ముడు, మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తి నాయుడుకు పలువురు రాజకీయ సినీ, ప్రముఖులు తుది వీడ్కోలు పలికారు. ప్రభుత్వ లాంఛనాలతో గార్డ్ ఆఫ్ హానర్ నిర్వహించి, గాలులోకి కాల్పులు జరిపి పోలీసులు వందన సమర్పణ చేశారు. సాయంత్రం నాలుగు గంటలకు కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. చంద్రబాబు నాయుడు కుటుంబసమేతంగా నారావారిపల్లెకు చేరుకున్నారు. భౌతికకాయానికి తెలుగుదేశం పార్టీ కండువా కప్పి పుష్పాంజలి ఘటించారు. అంతిమయాత్రలో పాడెను చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, ఎమ్మెల్యే పులివర్తి నాని, నందమూరి కుటుంబ సభ్యులు మోసారు. శనివారం హైదరాబాద్ గచ్చిబౌలి ఎఐజి హాస్పిటల్‌లో అనారోగ్యంతో రామ్మూర్తి నాయుడు మరణించిన విషయం తెలిసిందే. రామ్మూర్తి నాయుడు భౌతికకాయాన్ని హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో ఆదివారం ఉదయం రేణిగుంట విమానాశ్రయానికి తీసుకొచ్చారు. అక్కడి నుంచి నేరుగా తీసుకువచ్చి చంద్రబాబు ఇంటి ఆవరణంలో భౌతికకాయాన్ని ఉంచారు. కుటుంబసభ్యులు శ్రద్ధాంజలి ఘటించారు. రాష్ట్ర గవర్నర్ సిపి. రాధాకృష్ణన్ పూలమాలవేసి నివాళులర్పించారు. చంద్రబాబుకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. భౌతికకాయానికి చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు, టిటిడి బోర్డు మాజీ చైర్మన్ చదలవాడ కృష్ణమూర్తి, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు సినీ ప్రముఖులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. నివాళులర్పించిన వారిలో ఎమ్మెల్యేలు పులివర్తి నాని, సుధీర్‌రెడ్డి, ఆదిమూలం, మురళీమోహన్, గురజాల జగన్‌మోహన్, గాలి భానుప్రకాష్, సునీల్ కుమార్, చిత్తూరు ఎంపి ప్రసాద్‌రావు, సినీ ప్రముఖులు రాజేంద్రప్రసాద్, మోహన్‌బాబు, మంచుమనోజ్, నాగశౌర్య, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ఎస్‌పి సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు. అంతిమయాత్రలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

**రాజకీయంగా అండ : చంద్రబాబు**

తన తమ్ముడు రాజకీయంగా తనకు అండగా నిలిచిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని చంద్రబాబు తెలిపారు. టిడిపి పార్టీ అభివృద్ధికి కష్టపడిన తీరు, అజాతశత్రువుగా కల్మషం లేకుండా అందరితో కలిసిమెలిసి నడిచారని గుర్తుచేసుకుంటూ కన్నీటి పర్యంతమయ్యారు. తమ్ముడి కుటుంబానికి అండగా ఉంటానంటూ ధైర్యం చెప్పారు.

**IREL (ఇండియా) లిమిటెడ్**
(గతంలో ఇండియన్ రేర్ ఎర్త్స్ లిమిటెడ్)
రేర్ ఎర్త్స్ డివిజన్, కొచ్చి, కేరళ,
ఇమెయిల్: purchase-red@irel.co.in
CIN: U15100MH1950G01008187
An ISO 9001:2015, ISO 14001:2015 & ISO 45001:2018 కంపెనీ

**అప్రెంటిస్‌ల నియామకం**

రేర్ ఎర్త్స్ డివిజన్, ఉద్యోగమండల్, జిల్లా: ఎర్నాకులం, కేరళ-683 501లో అప్రెంటిస్ చట్టం, 1961 కింద అప్రెంటిస్‌ల నియామకం కోసం అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానించబడ్డాయి. చివరి తేదీ: 30/11/2024. వివరాల కోసం దయచేసి www.irel.co.in యొక్క 'కెరీర్స్' పేజీని సందర్శించండి.
పై పేర్కొన్న వాటికి ఏదైనా పొడిగింపు ఎగువ వెబ్‌సైట్‌లో మాత్రమే హోస్ట్ చేయబడుతుంది.

సం/-
సిజిఎం & హెడ్,
ఆర్ఇడి

తేదీ: 18.11.2024
CBC 48145/12/0004/2425

**UNIMONI FINANCIAL SERVICES LIMITED**
RO: N.G. 12 & 13 Ground Floor, North Block, Manipal Centre, Dickenson Road, Bangalore - 560 042. CIN No.U85110KA1995PLC018175

**బహిరంగ ప్రకటన**

తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాల వేలం UNI MONI FINANCIAL SERVICES LIMITED ద్వారా 21.11.2024 ఉదయం 10.00 గంటలకు దిగువ ఇవ్వబడిన సంబంధిత కేంద్రాలలో నిర్వహించబడుతుందని ప్రజలకు తెలియజేస్తున్నాం. వేలం వేయబోయే బంగారు ఆభరణాలు బకాయిలు చెల్లించడంలో విఫలమైన మా వివిధ కస్టమర్ల రుణఖాతాలకు చెందినవి., ఈ రుణ గ్రహీతలకు మా వేలం నోటీసులు సక్రమంగా జారీ చేయబడ్డాయి. మా వివిధ కస్టమర్లు గడువు ముగిసిన ఋణం తిరిగి చెల్లించనందున వేలం వేయడం జరుగుతుంది. ఈ క్రింద వేలం వేయబడే బంగారు ఆభరణం బ్రాంచ్ పేరుతో పేర్కొన్నాం.

**Auction Centre Address & Loan Nos: KHAMMAM (KHM - D No 8-3-215, First Floor, Beside Indus Ind Bank, Wyra Roakhammam, Khammam - 507001, Contact No : 9959617256) 2109036, 2112687, 2122729, 2123079, 2085320, 2093155, 2119376, 2062919, 2110957, 2118579, 2110771, 2108388, 2112171, 2131223, 2112653, 2112655, 2118449, 2118786, 2117938, 2112500, 2111790, 2047393, 2112568, 2112404, 2088216, 2108418, 2109802, 2109899, 2110444, 2110950, 2111059, 2111349, 2112625.**

(Reserves the right to alter the number of accounts to be auctioned &/ postpone / cancel the auction without any prior notice.)

రిజిస్టర్డు ఆఫీసు: డిసిబి బ్యాంక్ లిమిటెడ్, 6వ అంతస్తు, టవర్-ఎ, పెనిసుల బిజినెస్ పార్క్, సేనాపతి బాపట్ మార్గ్, లోయర్ ప్యారెల్, ముంబయి-400013.
రిటైల్ అసెట్ కలెక్షన్ డిపార్టుమెంట్: డిసిబి బ్యాంక్ లిమిటెడ్, 8-2-120/84, 2వ అంతస్తు, జ్యోతి మజెస్టిక్, బంజారాహిల్స్, హైదరాబాద్-తెలంగాణ-500 034

**DCB BANK**

**సార్ఫసీ యాక్ట్ 2002 క్రింద ఇ-వేలం అమ్మకపు ప్రకటన**
**స్థిరాస్తి అమ్మకం**
సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 9(1) క్రింద

**ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)కు నియమాలతో చదువబడే, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద, డిసిబి బ్యాంకుకు చార్జ్‌చేయబడిన స్థిరాస్తుల అమ్మకం కొరకు బహిరంగ ఇ-వేలం ప్రకటన.**

ఇందుమూలంగా సర్వజనులకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీత, సహ-రుణగ్రహీతలు మరియు హామీదారులకు అధీకీత అదికారిచేత ప్రకటన ఇవ్వడమేమనగా, దిగువ పేర్కొనబడిన ఆస్తి **డిసిబి బ్యాంక్ లిమిటెడ్**కు తాకట్టుపెట్టబడినది. దానిని బ్యాంకు యొక్క అధీకృత అధికారి, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 యొక్క నియమాల క్రింద **స్వాధీనంచేసుకున్నారు.** పట్టికలో ఇచ్చిన వివరాల ప్రకారం దిగువ పేర్కొన్న బకాయిలు మరియు తదుపరి వడ్డీ, చార్జీలు మరియు ఖర్చులు మొ॥వాటిని రికవరీచేయుట కొరకు దిగువ పేర్కొన్నట్లుగా ఆస్తిని ఇ-వేలం ద్వారా విక్రయించబడుతుంది.
ఆస్తి "ఎక్కడ ఏది ఎలా ఉన్నది, అది అక్కడ అలాగే ఉంటుంది" షరతుపై విక్రయించబడుతుంది.

| క్ర. సం. | సెక్యూర్డ్ డెట్ వివరాలు | రిజర్వు ధర | ఇ-వేలం తేది & సమయం | ధరావత్తు డిపాజిట్ | పరిశీలించు తేది& సమయం | స్వాధీనతా విధానం |
|---|---|---|---|---|---|---|
| 1. | Rs.49,28,121/- (As of 12.11.2024) | Rs. 20,00,000/- | From 11:30 AM on 19.12.2024 | Rs. 2,00,000/- | 25.11.2024 (11 am to 4 pm) | భౌతికం |

**రుణగ్రహీత పేరు& వివరాలు: 1) ఓర్చు వెంకట రావు (రుణగ్రహీత), 2) శ్రీమతి ఓర్చు తులసి (సహ-రుణగ్రహీత).**

**స్థిరాస్తి వివరాలు: షెడ్యూలు 1:** గుంటూరు జిల్లా, పెద్దకాకాని రిజిస్ట్రేషన్ సబ్-డిస్ట్రిక్ట్, కొప్పురవూరు గ్రామపంచాయతి ఏరియా పరిధిలో, కొప్పురవూరు గ్రామం, డి.నం.26, ఎక.3-18సెంట్లు, డి.నం.27, ఎక.2-55సెంట్లు, డి.నం.28/1, ఎక.0-66.1/2 సెంట్లు, డి.నం.30/1, ఎక.4-90సెంట్లు, ఈ నాలుగు నంబర్ల పూర్తి విస్తీర్ణం ఒక సింగిల్ పీస్‌గా ల్యాండ్ విస్తీర్ణం ఎక.11-29 1/2 సెంట్లు మరియు డి.నం.26, ఎక.1-06సెంట్లు పూర్తిగా ఎక.12-35.1/2సెంట్లుగా వి.జి.టి.ఎం. ఉడా ఫైల్ నం.ఇ2/120/2014 ప్రకారం, ఎల్.పి.నం.19/2014/జిఎన్‌టి ప్లాన్ ప్లాట్ నం.65 విస్తీర్ణం 220చ.గ.లు, ప్లాట్ నం.66 విస్తీర్ణం 220చ.గ.లు, ప్లాట్ నం.67, విస్తీర్ణం 220చ.గ.లు, ప్లాట్ నం.68 విస్తీర్ణం 220చ.గ.లు, ప్లాట్ నం.69 విస్తీర్ణం 220చ.గ.లు, ప్లాట్ నం.70 విస్తీర్ణం 210.83చ.గ.లు, ప్లాట్ నం.71 విస్తీర్ణం 253.33చ.గ.లు, ప్లాట్ నం.72 విస్తీర్ణం 240చ.గ.లు, ప్లాట్ నం.73 విస్తీర్ణం 240చ.గ.లు, ప్లాట్ నం.74 విస్తీర్ణం 240చ.గ.లు, ప్లాట్ నం.75 విస్తీర్ణం 240చ.గ.లు మరియు ప్లాట్ నం.76 విస్తీర్ణం 240చ.గ.లు, పూర్తి విస్తీర్ణం 2764.16చ.గ.లు సైటు ఏదైతే "క్యాపిటల్ స్క్వైర్" "బి-బ్లాక్" నిర్మాణంలోని సైటు. సరిహద్దులు: తూర్పు: 40అ.ల వెడల్పు రోడ్డు 218'-0", దక్షిణం: శ్యామల కిషోర్ రెడ్డికు చెందిన సైటు: 115'-0", పడమర: 40అ.ల వెడల్పు రోడ్డు 214'-6". **షెడ్యూలు నం.-2:** పై పేర్కొన్న సైటు వాటా కొరకు ఏదైతే నిర్మించబడుచున్న 1250చ.అ.లు (ప్లింత్& ఉమ్మడి ఏరియాలు& ఒక కార్ పార్కింగ్ ఏరియాతో కలిపి) పూర్తి విస్తీర్ణంతో "క్యాపిటల్ స్క్వైర్" "బి బ్లాక్" యొక్క రెండవ అంతస్తులోగల ఒక సంపూర్ణమైన రెండు బెడ్ రూముల ఫ్లాట్ నం.305తో 2764.16చ.గ.లు లేదా 2311.11చ.మీ.ల సైటు పూర్తి విస్తీర్ణంలో 46చ.గ.లు లేదా 38.46చ.మీ.ల కొలతల విడదీయలేని & సూచించజాలని భాగం మొత్తం. సరిహద్దులు: తూర్పు: ఒపెన్ టు స్కై, దక్షిణం: ఒపెన్ టు స్కై, పడమర: ఉమ్మడి కారిడార్, ఉత్తరం: ఒపెన్ టు స్కై.

పాల్గొనుటలో అభ్యర్ధన లేఖతో కెవైసి, పాన్ కార్డు, ధరావత్తు చెల్లించిన రుజువుతోపాటు ధరావత్తును దాఖలుచేయుట తేది& సమయం **18.డిసెంబర్.2024**న లేదా ముందుగా సా.5గం.లకు ముందు. సంప్రదించండి: ఎ. ప్రసన్న కుమార్ 7702555584.
ఆసక్తిగల కొనుగోలుదారులు/బిడ్డరుదారులు ధరావత్తు డిపాజిట్‌ను బెనెఫిషరీ పేరు, డిసిబి బ్యాంక్, ఖాతా పేరు- డిసిబి బ్యాంక్ లోన్ ఖాతా నం., ఐఎఫ్‌ఎస్‌సి కోడ్: డిసిబిఎల్0000037, లోయర్ ప్యారెల్, బ్రాంచి-ముంబయి వారి పేరున డిడి/ఎన్ఇఎఫ్‌టి/ఆర్‌టిజిఎస్ ద్వారా కాని ధాఖలుచేయవలసిందిగా కోరబడుచున్నది.
**ఇ-వేలం యొక్క నియమాలు& నిబంధనలు దిగువ విధంగా:**
**1.** ఇ-వేలం అనునది "ఎక్కడ ఏది ఎలా ఉన్నది, అక్కడ అది అలాగే ఉంటుంది" ప్రాతిపదికన మరియు "ఆన్ లైన్" ద్వారా నిర్వహించబడుతుంది. వేలం అనునది బ్యాంకు యొక్క ఆమోదిత సర్వీస్ ప్రొవైడర్ మెసర్స్ 4 క్లోజర్ ఇండియా (సంప్రదించాల్సిన నం.......) ద్వారా వారి వెబ్ పోర్టల్ portalhttps://www.bankauctions.in.వద్ద నిర్వహించబడుతుంది. ఆన్‌లైన్ ఇ-వేలం బిడ్ ఫారం, డిక్లరేషన్, ఆన్‌లైన్ వేలం అమ్మకం యొక్క సాధారణ నియమాలు& నిబంధనలు కలిగియున్న ఇ-వేలం టెండరు పత్రంhttps://www.bankauction.in.లో అందుబాటులో ఉంటాయి.
**2.** అధీకృత అధికారికి తెలిసిన మరియు సమాచారం ఉన్నంత వరకు, ఆస్తి పై ఎటువంటి రుణభారాలు లేవు. అయితే, ఆసక్తిగల బిడ్డరుదారులు రుణభారాలు, వేలంకు [illegible] ఇ-వేలం ప్రకటన బ్యాంకు యొక్క ఏదేని ఒప్పందం లేదా ఏదేని ప్రాతినిధ్యంకు బాధ్యత వహించదు. బ్యాంకుకు ఆస్తిపై ఏదేని తెలిసిన లేదా తెలియని ప్రస్తుత మరియు తదుపరి రుణభారాలతో విక్రయించబడుతుంది. ఏదేని మూడవ వ్యక్తి పార్టీ క్లెయింలు/హక్కులు/బకాయిల కొరకు అధీకృత అధికారి/ సెక్యూర్డ్ క్రెడిటర్ బాధ్యత వహించరు.
**3.** గెలుపొందని బిడ్డరుదారులకు ఎటువంటి వడ్డీ లేకుండా ధరావత్తు తిరిగి ఇచ్చివేయబడుతుంది. క్రింది సంతకందారు ఏ కారణం చూపకుండానే ఏవేని ఆఫర్లను ఆమోదించు లేదా తిరస్కరించు లేదా అమ్మకంను నిలిపివేయు/ వాయిదావేయు అధికారాలు కలిగియుంటారు. ఒకవేళ ఆఫర్ ఆమోదించబడినచో, కొనుగోలుదారు వేలం వేసిన రోజున వెంటనే అమ్మకపు ధరలో 25% (ధరావత్తు మొత్తంను తీసివేసి) డిపాజిట్‌చేయవలసి ఉంటుంది మరియు ఒకవేళ కొనుగోలుదారు దానిని డిపాజిట్‌చేయుటలో విఫలం చెందినచో, ధరావత్తు చెల్లించిన మొత్తాలు బ్యాంకుచేత జప్తుచేయబడుతుంది మరియు ఆస్తిని తిరిగి విక్రయించబడుతుంది. కొనుగోలుచేసిన ధరలో మిగతా నగదును అమ్మకం ఆమోదించిన తరువాత 15వ రోజున లేదా ముందుగా చెల్లించవలసి ఉంటుంది మరియు నిర్ణీత కాలవ్యవధిలోగా చెల్లించుటలో డిఫాల్టిచెందినచో, ధరావత్తుకు డిపాజిట్ నగదు జప్తుచేయబడుతుంది మరియు ఆస్తి తిరిగి విక్రయించబడుతుంది. ఏవేని ఇతర చట్టబద్ధ బకాయిలు/పన్నులు/స్టాంపు డ్యూటీ/రిజిస్ట్రేషన్ ఫీజు/ట్రాన్స్‌ఫర్ ఫీజులను విడిగా కొనుగోలుదారుచేత భరించవలసి ఉంటుంది.
**4.** అమ్మకం అనునది ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద సిఫారసుచేసిన నియమాలు/ షరతుల ప్రాతిపదికన ఉంటుంది.

సం/-
అధీకృత అధికారి
డిసిబి బ్యాంక్ లిమిటెడ్

తేది: 18.11.2024
ప్రదేశం: గుంటూరు

రిజిస్టర్డు ఆఫీసు: డిసిబి బ్యాంక్ లిమిటెడ్, 6వ అంతస్తు, టవర్-ఎ, పెనిసుల బిజినెస్ పార్క్, సేనాపతి బాపట్ మార్గ్, లోయర్ ప్యారెల్, ముంబయి-400013.
రిటైల్ అసెట్ కలెక్షన్ డిపార్టుమెంట్: డిసిబి బ్యాంక్ లిమిటెడ్, 8-2-120/84, 2వ అంతస్తు, జ్యోతి మజెస్టిక్, బంజారాహిల్స్, హైదరాబాద్-తెలంగాణ-500 034

**DCB BANK**

**సార్ఫసీ యాక్ట్ 2002 క్రింద ఇ-వేలం అమ్మకపు ప్రకటన**
**స్థిరాస్తి అమ్మకం**
సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 9(1) క్రింద

**ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)కు నియమాలతో చదువబడే, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద, డిసిబి బ్యాంకుకు చార్జ్‌చేయబడిన స్థిరాస్తుల అమ్మకం కొరకు బహిరంగ ఇ-వేలం ప్రకటన.**

ఇందుమూలంగా సర్వజనులకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీత, సహ-రుణగ్రహీతలు మరియు హామీదారులకు అధీకీత అదికారిచేత ప్రకటన ఇవ్వడమేమనగా, దిగువ పేర్కొనబడిన ఆస్తి **డిసిబి బ్యాంక్ లిమిటెడ్**కు తాకట్టుపెట్టబడినది. దానిని బ్యాంకు యొక్క అధీకృత అధికారి, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 యొక్క నియమాల క్రింద **స్వాధీనంచేసుకున్నారు.** పట్టికలో ఇచ్చిన వివరాల ప్రకారం దిగువ పేర్కొన్న బకాయిలు మరియు తదుపరి వడ్డీ, చార్జీలు మరియు ఖర్చులు మొ॥వాటిని రికవరీచేయుట కొరకు దిగువ పేర్కొన్నట్లుగా ఆస్తిని ఇ-వేలం ద్వారా విక్రయించబడుతుంది.
ఆస్తి "ఎక్కడ ఏది ఎలా ఉన్నది, అది అక్కడ అలాగే ఉంటుంది" షరతుపై విక్రయించబడుతుంది.

| క్ర. సం. | సెక్యూర్డ్ డెట్ వివరాలు | రిజర్వు ధర | ఇ-వేలం తేది & సమయం | ధరావత్తు డిపాజిట్ | పరిశీలించు తేది& సమయం | స్వాధీనతా విధానం |
|---|---|---|---|---|---|---|
| 1. | Rs.35,32,486/- (As of 12.11.2024) | Rs.18,00,000/- | From 11:30 AM on 19.12.2024 | Rs. 1,80,000/- | 25.11.2024 (11 am to 4 pm) | భౌతికం |

**రుణగ్రహీత పేరు& వివరాలు: 1) అప్పా రావు (రుణగ్రహీత), 2) పిల్ల రామలక్ష్మి (సహ-రుణగ్రహీత), 3. పిల్ల అప్పల స్వామి (సహ-రుణగ్రహీత), 4. పిల్ల సత్యనాయుడు (సహ-రుణగ్రహీత).**

**స్థిరాస్తి వివరాలు:** [illegible]

పాల్గొనుటలో అభ్యర్ధన లేఖతో కెవైసి, పాన్ కార్డు, ధరావత్తు చెల్లించిన రుజువుతోపాటు ధరావత్తును దాఖలుచేయుట తేది& సమయం **18.డిసెంబర్.2024**న లేదా ముందుగా సా.5గం.లకు ముందు. సంప్రదించండి: ఎ. ప్రసన్న కుమార్ 7702555584.
ఆసక్తిగల కొనుగోలుదారులు/బిడ్డరుదారులు ధరావత్తు డిపాజిట్‌ను బెనెఫిషరీ పేరు, డిసిబి బ్యాంక్, ఖాతా పేరు- డిసిబి బ్యాంక్ లోన్ ఖాతా నం., ఐఎఫ్‌ఎస్‌సి కోడ్: డిసిబిఎల్0000037, లోయర్ ప్యారెల్, బ్రాంచి-ముంబయి వారి పేరున డిడి/ఎన్ఇఎఫ్‌టి/ఆర్‌టిజిఎస్ ద్వారా కాని ధాఖలుచేయవలసిందిగా కోరబడుచున్నది.
**ఇ-వేలం యొక్క నియమాలు& నిబంధనలు దిగువ విధంగా:**
**1.** ఇ-వేలం అనునది "ఎక్కడ ఏది ఎలా ఉన్నది, అక్కడ అది అలాగే ఉంటుంది" ప్రాతిపదికన మరియు "ఆన్ లైన్" ద్వారా నిర్వహించబడుతుంది. వేలం అనునది బ్యాంకు యొక్క ఆమోదిత సర్వీస్ ప్రొవైడర్ మెసర్స్ 4 క్లోజర్ ఇండియా (సంప్రదించాల్సిన నం.......) ద్వారా వారి వెబ్ పోర్టల్ portalhttps://www.bankauctions.in.వద్ద నిర్వహించబడుతుంది. ఆన్‌లైన్ ఇ-వేలం బిడ్ ఫారం, డిక్లరేషన్, ఆన్‌లైన్ వేలం అమ్మకం యొక్క సాధారణ నియమాలు& నిబంధనలు కలిగియున్న ఇ-వేలం టెండరు పత్రంhttps://www.bankauction.in.లో అందుబాటులో ఉంటాయి.
**2.** అధీకృత అధికారికి తెలిసిన మరియు సమాచారం ఉన్నంత వరకు, ఆస్తి పై ఎటువంటి రుణభారాలు లేవు. అయితే, ఆసక్తిగల బిడ్డరుదారులు రుణభారాలు, వేలంకు [illegible] ఇ-వేలం ప్రకటన బ్యాంకు యొక్క ఏదేని ఒప్పందం లేదా ఏదేని ప్రాతినిధ్యంకు బాధ్యత వహించదు. బ్యాంకుకు ఆస్తిపై ఏదేని తెలిసిన లేదా తెలియని ప్రస్తుత మరియు తదుపరి రుణభారాలతో విక్రయించబడుతుంది. ఏదేని మూడవ వ్యక్తి పార్టీ క్లెయింలు/హక్కులు/బకాయిల కొరకు అధీకృత అధికారి/ సెక్యూర్డ్ క్రెడిటర్ బాధ్యత వహించరు.
**3.** గెలుపొందని బిడ్డరుదారులకు ఎటువంటి వడ్డీ లేకుండా ధరావత్తు తిరిగి ఇచ్చివేయబడుతుంది. క్రింది సంతకందారు ఏ కారణం చూపకుండానే ఏవేని ఆఫర్లను ఆమోదించు లేదా తిరస్కరించు లేదా అమ్మకంను నిలిపివేయు/ వాయిదావేయు అధికారాలు కలిగియుంటారు. ఒకవేళ ఆఫర్ ఆమోదించబడినచో, కొనుగోలుదారు వేలం వేసిన రోజున వెంటనే అమ్మకపు ధరలో 25% (ధరావత్తు మొత్తంను తీసివేసి) డిపాజిట్‌చేయవలసి ఉంటుంది మరియు ఒకవేళ కొనుగోలుదారు దానిని డిపాజిట్‌చేయుటలో విఫలం చెందినచో, ధరావత్తు చెల్లించిన మొత్తాలు బ్యాంకుచేత జప్తుచేయబడుతుంది మరియు ఆస్తిని తిరిగి విక్రయించబడుతుంది. కొనుగోలుచేసిన ధరలో మిగతా నగదును అమ్మకం ఆమోదించిన తరువాత 15వ రోజున లేదా ముందుగా చెల్లించవలసి ఉంటుంది మరియు నిర్ణీత కాలవ్యవధిలోగా చెల్లించుటలో డిఫాల్టిచెందినచో, ధరావత్తుకు డిపాజిట్ నగదు జప్తుచేయబడుతుంది మరియు ఆస్తి తిరిగి విక్రయించబడుతుంది. ఏవేని ఇతర చట్టబద్ధ బకాయిలు/పన్నులు/స్టాంపు డ్యూటీ/రిజిస్ట్రేషన్ ఫీజు/ట్రాన్స్‌ఫర్ ఫీజులను విడిగా కొనుగోలుదారుచేత భరించవలసి ఉంటుంది.
**4.** అమ్మకం అనునది ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద సిఫారసుచేసిన నియమాలు/ షరతుల ప్రాతిపదికన ఉంటుంది.

సం/-
అధీకృత అధికారి
డిసిబి బ్యాంక్ లిమిటెడ్

తేది: 18.11.2024
ప్రదేశం: విజయవాడ.

"రాసిందంతా సాహిత్యం కాదు. అందమైన భాషలో సత్యాన్ని వ్యక్తీకరిస్తూ మనస్సు మీద ప్రభావాన్ని కలిగించేది మాత్రమే సాహిత్యం."
– ప్రేమ్‌చంద్

## భూటాన్ పద్యాలు

భూటాన్ భూమి మీద కాలు మోపిన క్షణమే
పర్వత రాగం ఏదో పాదాన్ని తాకి
పైకి పాకి గుండెల్ని చుట్టుకుంది
సెలయేటిలో స్నానమాడిన
ఆకాశం పక్షి
కోటి రెక్కలతో వాటేసుకుంది

★★★

అక్కడ అడవులన్నీ ఆరామాలే
కొండలన్నీ విగ్రహాలే
లోయలన్నీ మందిరాలే
అంతటా బోధి వృక్షాల భిక్షు సంచారం
అదంతా బౌద్ధ పర్యావరణం

★★★

భూటాన్ భూతల స్వర్గం
అన్నారంటే నిజమే
బుద్ధుడున్నాడు కదా మరి!

★★★

వీధుల్లో చెత్త లేదు
మనుషుల్లో మురికి లేదు
భూటాన్ని తిరగేస్తే పచ్చదనం
బోర్లేస్తే మనిషి తనం
అది ఆకాశం పెదవి రాల్చిన
కాంతి పూల శాంతివనం!

★★★

జలపాతం ఉయ్యాల మీద కూర్చుని
కొండల్లో రంగులరాట్నం తిరిగాను
కలల్లో కూర్చుని
జీవితంలో తిరిగినట్టు ...

★★★

జలపాతాలు
రాత్రిపూట
నక్షత్రాలు ఆడుకునే
జారుడుబండలు

★★★

లోకం పసిపాప కోసం
ఆకాశం మీద కొత్త బొమ్మలు గీయడానికి
కుంచెలుగా మొలిచిన
మునీశ్వరులు ఈ వృక్షాలు

★★★

రోజూ కొండలెక్కి వీళ్ళు
తమ ఉన్ని తువ్వాళ్లతో
ఆకాశాన్ని తుడిచి వస్తారు
దేవతలు దీవిస్తారేమో
ముసలి వాళ్లలో కూడా యవ్వనం
తన ముఖాన్ని చూసుకుంటోంది!

★★★

అంత ఎత్తు ఎక్కే కొద్దీ
నా ఎత్తు తగ్గుతూ వచ్చింది
ఆ స్థూపం ముందు నా రూపం
ఆకంత దీపంలా రెపరెపలాడింది

★★★

కొండలు చెక్కి దారులు వేసి
ఏ కష్టజీవి ఏ చెట్టుగా మారిపోయాడో..
ఆకాశం తరచుగా ఇలా
మంచు బొట్లు రాల్చి
వారికి అభిషేకం చేస్తుంది

★★★

ఈ మబ్బులు అదే పనిగా
కొండల తలలు దువ్వుతున్నాయి
జలపాతాల జడలు వేస్తున్నాయి
వృక్షాల వొళ్ళు తుడుస్తున్నాయి
నీటి నీడల బట్టలు విప్పేసి
లోయల కౌగిలింతల్లో
పరవశాల పద్యాలల్లుతున్నాయి

★★★

కొండ మనుషులు
చెట్లతో పళ్ళు తోమి
మబ్బులతో మొహం తుడుచి
కొండ ఏటి కింద స్నానాలు చేసి
ఆకాశాన్ని దులిపి కిందపరిచి
దానిమీద
జీవితాలను ఆరబెట్టుకుంటారు
అప్పుడు వారి ఆత్మలు
ఆకాశం ఖాళీ చేసిన
శూన్యంలో ఆడుకుంటాయి

★★★

ఇక్కడ ప్రతి వ్యక్తీ
ఒక పర్వతారోహకుడే
కండలు కరిగించి కొండలు ఎక్కితే తప్ప
జీవితానికి ఆకలి తీరదు
ఆకలికి జీవితం దొరకదు

★★★

కొండ రైతు
కొండను పెన్సిల్లా చెక్కి
పంట పొలాన్ని
చిత్రపటంలా తీర్చాడు

★★★

బుద్ధుణ్ణి ఈ ప్రాంతం
ఎంతగా ప్రేమించిందో..
అందుకే ఆ తథాగతుని బొమ్మను
ఆకాశమంత అద్దంలా మలచుకుంది

★★★

ఆ కొండల్లో తిరిగింది కొన్ని రోజులే
తిరిగి వచ్చాక కొండలు
రోజూ నాలో తిరుగుతున్నాయి
నిజమే భూమి గుండ్రంగానే ఉంది!

– ప్రసాదమూర్తి
84998 66699

## వరిచేను కోత

ఊరంతా ఉత్సవంలా వుంది
పంట కళ్ళల్లో మెరిసిపోతోంది
ఇన్నాళ్ల కష్టం
రెప్పల్లో తొణికిసలాడుతూ
రేపటి భరోసాపై
రెపరెపలాడుతోంది.

ఎవర్ని పలకరించినా
వరికోతల పలవరింతలే
రైతు జీవితంలోనే
జీవన క్రమం దాగుంది
పంటను చూసే కళ్ళను
కళ్ళలో వెలిగే వెలుగునూ
ఆత్మీయంగా చూసుకోవాలనుంది.
ముద్దాడి మురిసిపోవాలనుంది!

– గవిడి శ్రీనివాస్
70192 78368

# వజ్రాయుధ కవికి శత జయంతి నివాళి

జయంతి

దాదాపు ఏడు దశాబ్దాలు సాహితీ వ్యాసంగంలో నిమగ్నమైన వజ్రాయుధం కవి ఆవంత్స సోమసుందర్ (నవంబరు 18 1924 – ఆగష్టు 12 2016) తెలుగు సాహిత్యక్షేత్రంలో గొప్ప కవి, విమర్శకుడు. శతాధిక గ్రంథకర్త. చాలా పుస్తకాలు అనేక పునర్ముద్రణలు పొందాయి. సోమసుందర్ జన్మించి 100 సంవత్సరాలు పూర్తి కాబోతున్న సందర్భంగా 18 నవంబర్, 2023 నుండి 18 నవంబర్, 2024 వరకూ ఆయన శత జయంతి వేడుకలు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ ఘనంగా నిర్వహించడం ఆయన పాండితీ ప్రకర్షకు తార్కాణం. సోమసుందర్ కవితా రీతుల్లో వర్గ సంఘర్షణ, విప్లవ ప్రబోధం, సమ సమాజ నిర్మాణం, మానవతా వాదం వంటి ఆదర్శ అనుసరణీయ అంశాలెన్నో దర్శనమిస్తాయి. వారి కవితా సంపుటులైన వజ్రాయుధం, కాహళి, రక్తాక్షి, ఆగతానికి శుభారంభం మొదలైన కావ్యాల్లో అభ్యుదయ కవితా రీతులు గమనించిన వారికి అభ్యుదయ, విప్లవ వాదాల సారం విదిత మవుతుంది.

సోమసుందర్‌లో అభ్యుదయ భావాలకు పునాదులు ఆయన బాల్యంలోనే పడ్డాయి. వీరి తండ్రి, విప్లవజ్యోతి అల్లూరి సీతారామరాజుకు కొంతకాలం ఆశ్రయం కలిగించాడన్న కారణాన, బ్రిటిష్ ప్రభుత్వం ఆయన్ను జైలుపాలు చేయడం, మనసును కలిచి వేసి ఆయనలో తిరుగుబాటు భావాలు చెలరేగాయి. సమాజంలో ఆర్థిక, రాజకీయ, సాంఘిక వ్యత్యాసాల్ని చిన్ననాడే గమనించిన వీరు సమాజంలో రెండు వర్గాలు ఉంటాయని గమనించారు. శాంతి, స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఆశించే వర్గం ఒకరైతే, దీనికి పూర్తిగా వ్యతిరేకంగా వ్యవహరించే దోపిడీ వర్గం మరొకటి ఉందన్న ఎరిక ఆదిలోనే కలిగింది. మనసులో ఆ భావాలన్నీ చిన్ననాటి నుండీ ఆయనలో కనలి, కనలి వజ్రాయుధం రూపంలో బహిర్గత మయ్యాయి. వజ్రాయుధం కావ్యం ఆయనకు ఎనలేని కీర్తి సంపదలను సంపాదించి పెట్టింది.

వజ్రాయుధంలోని 'బానిసల దండయాత్ర' కవితలో "అసుర వృద్ధ వకోదరుల/ అంధకార జాత్యంధుల/ అభివృద్ధి నిరోధించు/ ధనస్వామ్య స్వార్ధాలకు/ అభ్యర్ధుల ప్రతినిధుల/ ఏహ్యమాన రుజాగర్వ/ తిరోగామి లోకమొకటి" అంటూ అభివద్ధిని నిరోధిస్తూ రాక్షసంగా ప్రవర్తించే కొంతమంది వ్యక్తులు సమాజంలో చేరి బడుగు వర్గాలవారిని అణగదొక్కాలని యత్నిస్తూ ఉంటే, అభ్యుదయ భావాలతో జీవనం గడిపేవారు కొంతమంది ఉన్నారని, ఆ రెండు శక్తుల మధ్య సంఘర్షణ నిరంతరం కొనసాగుతూనే ఉంటుందని చెప్పారు. ఈ రెండు వర్గాల మధ్య భేద సారూప్యాలు ఏవిధంగా ఉన్నాయో వివరించే ప్రయత్నం చేశారు. "యుగధర్మం గుర్తించని/ ప్రజాకాంక్ష చూడలేని/ అధికారపు దివాంధాలు/ తమ స్వారీ సాగించగ/ సడలుతున్న సంకెళ్ళను/ విడిపోయే కళ్ళెములను/ సవరించే యత్నమొకటి/ యువశంఖం పూరిస్తూ/ భవిషత్తు నాశిస్తూ/ సమధర్మం స్థాపించగ/ పరపీడమంతరించ/ నరులంతా సౌఖ్యాలను/ పంచుకొనే వ్యవస్థకై/ సాగించే యత్నమొకటి" అంటూ వర్గ సంఘర్షణ విధానాన్ని చూపిస్తాడు. 'సమధర్మం'కవితలో ప్రాచీన సమాజం, ఆధునిక సమాజాలను వివరిస్తూ "వృద్ధ జగతి సమాధిపై సమధర్మం ప్రభవించును/ నిద్దుర చీకటి వెలుపల వేకువ మెళుకువ పుట్టును/ ధరణీ చక్రం గిరగిర/ పరిభ్రమిస్తుందదిగో/ నిమ్నోత్తముల జగతికి/ ఉద్వాసన చదువుతోంది" అంటూ భూమి కదలికలలో హెచ్చు తగ్గుల కారణంగా ముప్పు ఏర్పడిన విధంగా ఈ సమాజంలో నిమ్నోత్తముల వల్ల అధోగతికి దారితీస్తుందని చెప్పారు. ఖరార్ నామా కవితలో రెండు పరస్పర భావాల మధ్య సమాజ స్థితి ఎలా ఉంటుందో వివరిస్తాడు. "పిరికితనపు సిగ్గుల కగ్గలమై/ దగ్ధ పటలమై పొగచూరిన/ భూతకాల మర్యాదలు–/ వ్రేలాడే బూజులు–/ వేటాడే భూతాలై నిను తరుముతుంటె/ పిరికి మందు తింటావా?/ నరుడా!/ వీరునివలె తిరుగుబాటు చేస్తావా?" అని ప్రశ్నిస్తాడు. ఒకప్పటి సాంఘిక మర్యాదలను, బూజుపట్టిన భావలను ప్రశ్నిస్తూ, అవన్నీ భూతాల వలె బడుగులను తరుముతూ ఉంటే, వాటిని ఎదుర్కోవడానికి సిద్ధం కమ్మని వారిలో ఉత్తేజం నింపుతాడు.

"కాహళి" కవితా సంపుటిలో 'విన్నవీ కన్నవీ' అన్న కవితలో "శూన్య దిగ్భిత్తికల కనులతో గ్రోలుతూ/ దైన్యాల నెమరేసి నిలువుకాళ్ళం బడుతు/ నిముషాల యానాల బ్రతుకు పసరాలనే/ తమ రైతు యజమాని చంపి తింటున్నారు" అంటే యజమానికి, పనిచేసే రైతుకూ ఉన్న సంబంధాన్ని తెలియజేస్తూ, పొలం మీద అధికారం లేకపోవడం వల్ల యజమాని అమానుషత్వానికి రైతు బలైపోతున్నాడనే విషయాన్ని స్పష్టం చేస్తున్నాడు. ఇది వర్గ సంఘర్షణను ప్రతిబింబిస్తున్నది. రక్తాక్షి' రూపకంలో పాలకులకు, పాలితులకు మధ్య జరిగే సంఘర్షణను కళ్ళకు కడతాడు. పాలకుల అసంబద్ధ పాలనలో పాలితులైన ప్రజలు పడే కష్టాలను వివరిస్తాడు. "తనయులను కాంచి మన మనసులు చలించినవి/ జనముల విషాద కథ వినిన హృదయమ్ముల్/ కనలినవి శోకమున చెదరినవి పాలకుల/ కినిసినవి శౌర్యమున వణకు భువనమ్ముల్" అంటాడు సోమసుందర్.

సమాజంలో ఉండే అసమ ధర్మాన్ని, సాంఘిక రుగ్మతలను వివరించాల్సిన అగత్యం తనకుందని భావిస్తాడీ కవి. గత కాలంలోని ఆచార వ్యవహారాలు సామాన్యుడిని అథః పాతాళానికి తొక్కేసిన మాట వాస్తవం. గత నిరాసనంలో పడి మసి మసి అయిపోకుండా సమధర్మ స్థాపనకు నడుం బిగించాలని, సామాజిక న్యాయం కోసం తిరుగుబాట్లు చెయ్యాలని 'సమధర్మం' కవితలో 'తిరుగుబాటు బావుటాలు/ జగమంతా నిండినయ్/ శతసహస్ర కంఠమ్ములు/ ప్రతిచోటా కలిసినై' అని ఐక్యతా రాగం ఆలపిస్తాడు. కాహళి కవితా సంపుటిలో 'ధరణీ గీతం' అనే కవితలో సామ్యవాద జగతి కోసం ప్రజలంతా ఏకం కావాలని పిలుపునిస్తాడు. కలకత్తాలో జరిగిన భారతీయ సంస్కృతి మహాసభల్లో అమర్ షేక్ పాడిన హిందీ గీతానికి అనువాదం చేస్తూ ... 'నరులందరినీ మనం ఏక మొనరించగా/ విశ్వమందంతటను ప్రేమ కాంతులు జల్లి/ సామ్య జగతిని నవ్య సభ్యతల నెలకొల్పి/ బంధన విముక్తితో బానిసలు పొంగగా/ నరుల శిరములు స్వేచ్ఛ గర్వోన్నతుల తేల్చ/ పుడమిపై నవనరుల సష్టిద్దాం' అంటారు. వజ్రాయుధం కవితా సంపుటిలో 'ధ్రువతార' కవితలో లెనిన్ సమసమాజ స్థాపనకు నిలబడ్డ మహాశయుడని స్తుతిస్తాడు.

సోమసుందర్ ముట్టని సాహితీ ప్రక్రియ లేదు. కవిత్వం, గేయాలు, కథ, సాహితీ విమర్శ, నాటకం, అనువాదం, బాల సాహిత్యం, రేడియో నాటిక, ఇంకా నవలలు రాశారు. ఇంతవరకూ ప్రచురించిన 130 పుస్తకాలే కాకుండా, అప్రచురితంగా వున్న వేలసంఖ్యలో వ్యాసాలూ, సాహిత్యకారులతో జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలూ ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రకి దర్పణాలై ఆయన సాహితీ స్వరూపాన్ని నిరూపిస్తాయి. అన్య వ్యాపకాలేమీ లేకుండా పూర్తి జీవితకాలాన్ని సాహిత్య సేవకై వినియోగించిన కవి ఆయన. 'సాహిత్యమే జీవితం, జీవితమే సాహిత్యం' అన్న సూక్తి సో.సుకు అక్షరాలా సరిపోతుంది.

– డా. టేకుమళ్ల వెంకటప్పయ్య
94904 00858

## 23న 'కథా కచ్చీరు' ఆవిష్కరణ

డా. వెల్దండి శ్రీధర్ రచించిన 'కథా కచ్చీరు' తెలంగాణ కథా సాహిత్య విమర్శ పుస్తకం ఈనెల 23 సాయంత్రం 5 గంటలకు హైదరాబాదులోని రవీంద్ర భారతి మినీ హాల్ (మొదటి అంతస్తు)లో ఆవిష్కరణ జరుగుతుంది. సభాధ్యక్షులుగా ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి. కాశీం వ్యవహరిస్తారు. సురవరం ప్రతాపరెడ్డి విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య వెలుదండ నిత్యానందరావు, డా. కె. శ్రీనివాస్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా. మామిడి హరికృష్ణ, ప్రొ. కె.లావణ్య, డా.సంగిశెట్టి శ్రీనివాస్, వలి హుస్సేన్ పాల్గొంటారు. తొలి ప్రతిని డా.సరోజన బండ స్వీకరిస్తారు.

– టి.వి.నారాయణ,
ఎలగొండ రవి, ఆడెపు లక్ష్మణ్,
మానేరు రచయితల సంఘం.

## తెలుగు సాహితీవనం
## దీపావళి కవితల పోటీ ఫలితాలు

తెలుగు సాహితీవనం ఆధ్వర్యాన శేషం నరసింహాచార్యులు స్మారకార్థం నిర్వహించిన దీపావళి కవితల పోటీ ఫలితాలు వెలువడ్డాయి. ఉత్తమ కవితా విజేతలుగా మమతా కట్ల – కరీంనగర్, సృజన కుమార్ ముస్కూరి – కరీంనగర్, సత్య చాగంటి – కాకినాడ ఎంపికయ్యారు. వీరికి ఒక్కొక్కరికి రూ.1,116 నగదు బహుమతి, సన్మానం ఉంటుంది. ప్రోత్సాహక బహుమతి విజేతలుగా వసంత ఇంజాపురి– కరీంనగర్, సోమిశెట్టి వేణుగోపాల్ –కరీంనగర్, చంద్రశేఖర ప్రతాప్– కరీంనగర్ ఎంపికయ్యారు. వీరికి వీరికి రూ.516 చొప్పున నగదు, సన్మానం అందిస్తారు. బహుమతి ప్రదానం 1.12.2024 తేదీన కరీంనగర్‌లో జరిగే 'వైజయంతి' పుస్తక ఆవిష్కరణ సభలో ఉంటుంది. విజేతలు తప్పనిసరిగా సభకు వచ్చి బహుమతిని అందుకోవాలని నిర్వాహకులు వసుధాదేవి తిరుమల కోరారు.

– తెలుగు సాహితీవనం

## 24న 'వేకువ' కథాసంపుటి ఆవిష్కరణ

ఈనెల 24వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు విజయనగరం జిల్లా రాజాంలోగల శ్రీవిద్యానికేతన్ పాఠశాలలో రాజాం రచయితల వేదిక 118వ సమావేశం జరుగుతుంది. డా. మజ్జి భారతి రచించిన 'వేకువ' కథా సంపుటిని మజ్జి చంద్రినాయుడు ఆవిష్కరిస్తారు. గార రంగనాథం అధ్యక్షతన జరగనున్న సభలో రచయిత్రితో పాటు అట్టాడ అప్పలనాయుడు, గంటేడ గౌరునాయుడు, పొట్నూరు కోటిబాబు అతిథులుగా పాల్గొంటారు.

## పాలబుగ్గల తోలుబంతి

కొట్టు! గట్టిగా కొట్టు!
గురిపెట్టి కొట్టు!

నేను వద్దని మొత్తుకుంటే మాత్రం
నువ్వు కొట్టడం ఆపుతున్నావా!
నా జాతి అంతమే నీ ఆకాంక్ష కదా
సరే... అలాగే కొట్టు! ఇంకా కొట్టు!
నీ చేతులు కందేలా కొట్టు!
నీ రక్తపోటు హెచ్చేలా కొట్టు!

కొట్టడానికి నీ ఒక్కడి సత్తువ సరిపోక
నీ అనుంగు మిత్రుడి అండతో కొడుతున్నావ్
అతనికున్న వీటో హక్కుతో కొడుతున్నావ్

కానీ, నువ్వు విసిరి కొట్టే ఉగ్ర బాంబుకు
ఉన్నపాటున కుప్పకూలటానికి
నేను చలనంలేని భవంతిని కాదు!

నువ్వు ఎంత గట్టిగా కొడితే
అంత గట్టిగా పైకి లేచి
నరాల నిండా నెత్తుటి చైతన్యపు
గాలి తరంగాల్ని వెంటబెట్టుకొని
చెక్కుచెదరని స్థైర్యంతో

నిద్రపోతున్న దిక్కుల గుండెల మీద గుద్ది మరీ
మేల్కొలపగల పాలస్తీనా
పాలబుగ్గల తోలుబంతిని!
కళ్ళు మిరుమిట్లు గొలిపే
వెయ్యి విద్యుత్ కిరణాల గునపాలతో
నీ కుటిల పన్నాగాల అద్దాల సౌధాన్ని
బద్దలు కొట్టగల సూర్య కాంతిని!
కండ కావరంతో పొటమరించిన
నీ అహంకారపు ఆక్రమణవాద కళ్ళ గంతల్ని
తునాతునకలు చేయగల విశ్వ శాంతిని!

భవనాల్ని బద్దలు కొట్టి
బతుకుల్ని ధ్వంసం చేసినంత సులభం కాదు
నా కాలి కింద నేలను గుంజుకోవటం ...

ఇవాళ ఈ క్షణం నీది కావచ్చు
నీకు ఇబ్బడి ముబ్బడిగా
ఆయుధాలు అందిస్తున్న బేహార్లది కూడా
కావచ్చు
కానీ...
ఈ గడ్డమీద గడ్డ కడుతున్న
నా నెత్తుటి మడుగుల సాక్షిగా
రేపటి ఎర్రని చిగురు వసంతం మాత్రం నాదే!

– పతివాడ నాస్తిక్
94417 24167

# విలక్షణ కవిత్వం, విశిష్ట వ్యక్తిత్వం

సందర్భం





'చిన్ననాడే నన్ను ఏదో లయ వెంటా'డిందని చెప్పుకున్న కోగిర జైసీతారామ్ ఆ లయల అగాథపు లోయల్లో పడిపోకుండా

"... సుందరాంగుల చన్నుగవ పై
మందముగా చందస్సు అలదను..."
"..... రాచసభలకు రంగు వేయను
దోచు దొరలకు దోవచూపను...." అని

అంటారు.. ఆ 'అక్షర సైన్యం' అనే కవితలోనే ఇంకా ఇలా ప్రకటిస్తారు :

"నేపథ్యంలో ఏడవను
బ్రాకెట్లో బ్రతకను
అరసున్నగా అసలే జీవించను"

కనుకనే 'కవికోకిల' అనే ఇస్తామంటే వద్దు, కాకి పేరే జీవితమే కడు వాస్తవికం, ఎంతో ముద్దు కనుక తనను 'కవికాకి' అని పిలవమన్న సాహసి జై సీతారామ్!

సుమారు మూడున్నర దశాబ్దాల క్రితం అనంతపురం ఆకాశవాణి గళం సారించిన సందర్భంలో మారుమూల పల్లె ప్రాంతాల్లో ఉన్న కళాకారులను సైతం రికార్డు చేసే అవకాశం లభించింది. అప్పటికి నాకు మా కోగిర తెలుసు కానీ, కోగిర సీతారామ్ గురించి తెలియదు. అయితే పెనుకొండలో జరిగిన పరిచయమే ఉప్పెనలా నా హృదయాన్ని కొట్టి, కట్టి పడేసింది.. ఏమిటా జీవద్భాష అని! అప్పటికి మూడేళ్లుగా కొంకణి ప్రసార భాషగా ఉన్న ఆకాశవాణిలో పని చేయడంతో తెలుగూ, దాని మాండలిక సొగసూ నామీద కొంత అదనపు అధికారం చలాస్తున్నాయి. అనంతపురం జిల్లా.. ఆ పెనుగొండ తాలూకా... రొద్దం మండలపు అచ్చమైన కోగిర గ్రామ ప్రాంతపు భాష. మరీ ముఖ్యంగా శ్రామికుల భాష. అప్పటికి ఈనాటి టెక్నాలజీ రాలేదు, లేకపోయింటే సీతారామ్ యూట్యూబ్లో వాడవాడలా వెల్లువై ప్రతిధ్వనించేవాడు. మాట్లాడేభాషను ఎప్పుడైనా ప్రాంతం, కాలం, సామాజిక నేపథ్యం అనే ఈ మూడు గొప్పగా ప్రభావితం చేస్తాయి. సీతారామ్ రచనల్లో, ఆయన ప్రజెంటేషన్లో ఈ మూడూ చాలా స్పష్టంగా, సులువుగా పరిశీలించవచ్చు. నిజానికి ఆయన రచనల్లోని మౌఖిక భాషాలక్షణాలను సాకల్యంగా పరిశీలించాలని నాకైతే ఆశ ఉంది, అది సాధ్యమవుతుందో లేదో!

'కోగిర సీతారామ్'గా ప్రచారంలో ఉన్న గౌని జైసీతారామ్ రెడ్డి కోగిరలో1924 నవంబర్ 14న జన్మించి, 2000 అక్టోబరు 9న కనుమూశారు. అంటే ఆయన శతజయంతి సంవత్సరం ఈ నెలోనే పూర్తయింది. గౌని చన్నమ్మ, గౌని ఓబుళరెడ్డి దంపతులకు జన్మించిన సీతారామ్ బాల్యం ఒడిదొడుకులుగానే సాగింది. 5వ తరగతి తర్వాత మేకల కాపరిగా మారిపోయాడు. వారి పూర్వీకులు రెడ్డి ఉద్యోగం చేశారు కనుక రెడ్లు అయ్యారు, కానీ వారు గొల్లలు లేదా యాదవులు. చదువు మీద ఆశతో ఇంటి నుంచి పారిపోతే, వెనక్కి పట్టుకొచ్చి ఎద్దులు కాపరిగా ప్రమోషన్ ఇచ్చారని ఆయనే అంటారు. ఈ ఐదవ తరగతి చదువుకే ఆయనకు కృష్ణ, సుమతి, వేమన, దాశరథి, భాస్కర, నరసింహ శతకాలతో పాటు గజేంద్ర మోక్షం, రుక్మిణి కళ్యాణం, అమరం, ఆంధ్ర నామ సంగ్రహం వంటివి కంఠస్థంగా వచ్చేవి. ఈ శతకాల పుణ్యమా అని సీతారామ్‌కు ఆటవెలది, తేటగీతి అల్లిక బాగా అలవాటయింది. ఇక్కడ ఛందస్సుకూ, పద్యాలు చేయగలిగిన కమ్యూనికేషన్ సామర్థ్యానికీ లంకె ఏమిటో ఒకసారి చూడాలి.

1971 నవంబర్ 13న అనంతపురంలో జరిగిన ఒక కవిసమ్మేళనంలో శ్రీశ్రీ, ఇంకా నలుగురు దిగంబర కవులతోపాటు పాల్గొన్న సీతారామ్ తన 'మదాంధ భారతం'లోని కొన్ని పద్యాలను చదివారు. శ్రీశ్రీ ప్రతిస్పందిస్తూ "కవిత్వం సామాన్యులకర్థమైతుంది. అది చందోబద్ధమైతే వచ్చిన నష్టమేమి?" అంటూ పుస్తకం అచ్చు వేయించండని తన విరాళంగా రూ.10 ఇచ్చారు. ఎమర్జెన్సీ కాలంలో ముషీరాబాద్ జైల్లో విప్లవ రచయితలందరూ సమావేశమైనచోట రాకెట్, జాకెట్, లాకెట్, పాకెట్ అనే దత్తపదిని ఇంగ్లీష్‌లో ఇస్తే సీతారామ్ అలవోకగా ఉత్పలమాల చెప్పేశారు. దీనికి తోటి రాజకీయ ఖైదీ, తర్వాత ఎమర్జెన్సీలో ఒరిస్సా గవర్నర్‌గా పనిచేసిన బి.సత్యనారాయణ రెడ్డి 'దత్తపదిలో కూడా విప్లవాన్ని గురించే చెప్పినాడు, అందులోనూ ఇచ్చిన నాలుగు పదాలు ఇంగ్లీషువే అయినా వాటిని తెలుగు పదాలుగా పరివర్తించడం ఎంతో చాతుర్యం. ఆయనను చందోబద్ధంగానే రాయనీయండి" అని అన్నారు. అదీ సీతారామ్ రచనా సామర్థ్యం, సార్వత్రికత.

మనిషి మహా సన్నం. అంత ఎత్తు కాదు. మొహాన గాంధీ కళ్ళజోడు. ఫ్రెంచ్ కట్టు మీసం. అయితే మనిషి ఎల్లప్పుడూ ఎంతో చురుగ్గా ఉండేవాడు. ఎప్పుడూ ముతక నూలు పంచె, షర్టు, భుజాన చల్లా... అప్పుడప్పుడు చలికాలంలో అయితే స్వెటర్. వీటన్నిటినీ మించి చెరగని చిరునవ్వు, వదలని చమత్కారం. వీటికి మించి మాటకు మాట రిపార్టీ. ఆయన మంచి చిత్రకారుడు. ఫ్రెంచి కట్ మీసంతో సహా తన సంతకంలో సులువుగా తన మొహాన్ని మనకు దర్శింప చేయగల నేర్పరి. తన 'అక్షర సైన్యం' పుస్తకం 1996 ఏప్రిల్ 14న నాకు ఇస్తూ చేసిన సంతకం ఎలా ఉందో చూడండి. వారసత్వంగా సంక్రమించి జీవితాంతం పీడించిన ఆస్మా గురించి 'అబ్బగంటైన ఉబ్బసంబు' అని చమత్కారంగా అనడమే కాదు; పలు సభల్లో 'దుర్భర దారిద్ర్యాన్ని మహా దర్జాగా అనుభవిం'చానని కాలరెగరేస్తూ చెప్పగల వేదాంతి. విప్లవ రచయితల సంఘం సభ్యుడు కాకపోయినా ఆ సంస్థ సభ్యుడిగా ముద్ర వేసి అరెస్టు చేశారు. ముషీరాబాద్ జైల్లో 17నెలలు ఉన్నప్పుడు 'ఇందిరమ్మ జైలురా ఇంటి కన్నా మేలురా' అంటూ పాటలు పాడేవారు. జైల్లో వీరికి సోపులు, పేస్టులు మొదలైనవి ఇస్తే వాటిలో కొన్నింటిని వాడుకొని, మిగతా వాటిని ఇతరులకు ఇచ్చి, వాళ్ళు ఇచ్చిన డబ్బులతో పుస్తకాలు కొని చదివారు. అక్కడ 'విప్లవ రచయితలందరూ ఒక చోట చేరి, ప్రతిరోజు విప్లవాన్ని గురించి తరగతులు నిర్వహిస్తూ, రచనలు వినిపిస్తూ ఎంతో ఆనందోత్సాహాలతో గడిపిన మహదావకాశమది. అది ప్రభుత్వం భరించిన ఖర్చుతో నిర్వహించ బడిన ఒక కోర్సు.' అని 'అక్షర సైన్యం' ముందు మాటలో సీతారామ్ అంటారు.

బాలుడిగా సీతారామ్ శ్రద్ధను గమనించిన తల్లిదండ్రులు ఇక తప్పదని అనంతపురం మున్సిపల్ పాఠశాలలో చదువుకు పంపితే ఎనిమిదో తరగతి పూర్తి చేశారు. స్ట్రీట్ లైట్ వెలుగులో చదువుకోవడమే కాకుండా, సర్కస్ కంపెనీ వారి అడ్వర్టైజ్మెంట్ పేపర్లను నోట్బుక్‌గా చేసుకొని చదువు సాగించిన సాధకుడు. తర్వాత ఎయిర్ గ్రేడ్ టీచర్‌గా శిక్షణ పొంది పెనుకొండ గుట్టల్లో చాలా బదిలీలు ఎదుర్కొంటూ ఉపాధ్యాయులుగా పనిచేశారు. ఆయన నిత్య చదువరి. ఏ గ్రామంలో ఉపాధ్యాయుడిగా పనిచేసినా ఆ పాఠశాల గోడలపై తన సొంత ఖర్చులతో అ, ఆ లు, గుణింతాలు, ఒకట్లు (ఎక్కాలు), వారాలు, నెలలు, సంవత్సరాలు రంగురంగుల పెయింట్లతో రాయించేవారు. ఆయన స్వయంగా కవి, రచయిత.. గాయకుడు, చిత్రకారుడు, నటుడు కూడా! వీటన్నిటిని తన బోధనలో కలగలిపి తరగతిని అర్థవంతంగా తీర్చిదిద్దేవాడు. 1984– 85 సంవత్సరంలో మూడో తరగతి తెలుగు వాచకాన్ని రచించిన సీతారామ్‌గా ఉభయ రాష్ట్రాల తెలుగు వారికి బాగా పరిచయం. ఆయనకు నీలం సంజీవరెడ్డి, దామోదరం సంజీవయ్య, తరిమెల నాగిరెడ్డి, పరిటాల శ్రీరాములు, చితంబరరెడ్డి, బిటిఎల్ఎన్ చౌదరి, పి వి చౌదరి వంటి రాజకీయ నాయకులే కాకుండా ఎందరో సాహిత్యమూర్తులు సుపరిచితులు. 1983లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ఆనాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ద్వారా అందుకున్నారు.

సీతారామ్ భార్య పేరు వీర ఓబుళమ్మ. ఈ దంపతులకు ఆరుగురు సంతానం. కుమారులు జయసింహారెడ్డి, జయసూర్యరెడ్డి కనుమూయగా; జయచంద్రారెడ్డి కళాకారుడిగా కొనసాగుతున్నారు. జయ ఓబుళరెడ్డి వైజాగ్‌లో డాక్ యార్డ్‌లో ఉద్యోగం చేస్తున్నారు. అరుణమ్మ, జయరత్నమ్మ కుమార్తెలు. ఆయన చిత్రకళా సామర్థ్యం కొంత కుమారుడు జయఓబుళరెడ్డికి లభించగా; నటన, సాహిత్యాభినివేశం మరో కుమారుడు జయచంద్రారెడ్డికి వచ్చాయి. పల్లె ప్రాంతపు మూఢ నమ్మకాలు, నిరక్షరాస్యత, అనారోగ్యం వంటి సమస్యలను ఎదుర్కొంటూ హాస్యాన్ని రమణీయంగా కలిపిన 'అంగలాశి గాడు– కుశాలుగాడు' 1982 నుంచి పలుసార్లు, పలుచోట్ల ప్రదర్శింపబడింది. వీటికి మించి 1991– 92 నుంచి అనంతపురం ఆకాశవాణిలో ఎన్నోసార్లు ప్రసారమైంది. ఇందులో రచయిత సీతారామ్ బుడబుడకల రామన్నగా పాత్ర పోషిస్తే, అమళ్ళదిన్నె గోపీనాథ్ కుశాలుగాడిగా, రంగప్పగా రామశేషయ్య, టీచర్‌గా ఏలూరు యంగన్న, కుమారుడు జయచంద్రారెడ్డి అంగలాశిగాడుగా, గంగమ్మగా శ్రీమతి లక్ష్మీ రాందాస్ నటించేవారు.

నిట్టూర్పులు, అక్షర సైన్యం, జై సీతారం–సీసాలు తోపాటు బాలసాహిత్యానికి సంబంధించి బాలల జెండా, వెన్నెల విందు, మేం పిల్లలం ... మొత్తం ఆరు పుస్తకాలు ఇంతవరకు ప్రచురింపబడ్డాయి. అంగలాశిగాడు–కుశాలు గాడు, సుగుణ సుబోధిని ఇప్పుడు వెలువడు తున్నాయి. ఇంకా వేశ్య విశ్వామిత్ర, చలిమంట, బుడబుడకల భారతం, శినపోతన్న సిన్నాయన, యల్లామల్లీయం, మదాంధ భారతం, సున్న వాచకం, తిమ్మక్కోపాఖ్యానం మొదలైనవి ప్రచురించాల్సి ఉంది. ఆర్భాటం, ప్రచారం లేని చాలా సీదా సాదా అయిన వ్యక్తి కనక ఆయన శత జయంతి సంవత్సరం కూడా అలాగే గంభీరంగా సాగిపోతోంది.

– డా.నాగసూరి వేణుగోపాల్,
94407 32392

## ఎంపీల అనర్హతపై కొత్త చట్టానికి కేంద్రం యోచన

**న్యూఢిల్లీ :** లాభాదాయక పదవిని కలిగి ఉన్న ఎంపీల అనర్హత విషయంలో 65 ఏళ్ల కిందటి చట్టాన్ని రద్దు చేయాలని కేంద్రం చూస్తున్నది. దీని స్థానంలో ప్రస్తుత అవసరాలకు సరిపోయేలా ఒక కొత్త చట్టాన్ని తీసుకురావాలని యత్నిస్తున్నది. ఎంపీలను అనర్హులుగా ప్రకటించటానికి లాభాదాయక పదవి (ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్) ఒక కారణంగా ఉండేది. అయితే, ఇప్పుడు కేంద్రం మార్పులకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తున్నది. కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖకు చెందిన లెజిస్లేటివ్ విభాగం ఈ మేరకు 'పార్లమెంటు (ప్రివెన్షన్ ఆఫ్ డిస్క్వాలిఫికేషన్) బిల్లు, 2024' ను రూపొందించింది. 16వ లోక్‌సభలో ఎంపీ కల్రాజ్ మిశ్రా నేతృత్వంలో 'లాభాదాయక పదవులపై జాయింట్ కమిటీ (జిసిఒపి)' సిఫారసుల మేరకు దీనిని తయారు చేసినట్లు పేర్కొంటోంది. .

## ఢిల్లీని కప్పేసిన మంచు దుప్పటి

**ఢిల్లీ :** దేశ రాజధాని నగరం న్యూఢిల్లీ పరిసర ప్రాంతాలను మంచు దుప్పటి కప్పేసింది. ఒక వైపు పొగమంచు, మరోవైపు కాలుష్యం కలవడంతో ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ విమానాశ్రయంలో విజిబిలిటీ ఆదివారం ఉదయం 7:30 గంటలకు 800 మీటర్లకు పడిపోయింది, దీనితో 107 విమానాలు ఆలస్యంగా మరియు 3 రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అక్కడి వాతావరణశాఖ చెప్పిన వివరాల ప్రకారం.. బవానాలో అత్యధికంగా 471 ఏక్యూఐ నమోదైంది. అశోక్ విహార్, జహంగీర్ పురి లలో 466, ముండ్కా, వాజిర్పూర్ లలో 463, ఆనంద్ విహార్, షాదిపూర్, వివేక్ విహార్ లలో 457, రోహిణి, పంజాబి బాగ్ లలో 449, 447 ఏక్యూఐ నమోదైంది. ఢిల్లీలో ఉన్న ఈ ప్రాంతాలన్నీ హై డేంజర్ కేటగిరీలో ఉన్నాయని వాతావరణ శాఖ తెలిపింది. 22 స్టేషన్లలో గాలినాణ్యత పూర్తిగా క్షీణించింది.

## మత విద్వేషాలు రెచ్చగొడుతున్న బిజెపి

**బొకారో :** జార్ఖండ్‌లో అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి మతతత్వ ఎత్తుగడులు వేస్తోంది. ఎన్నికల ప్రచార సభల్లో మత ప్రాతిపదికన ఓట్లు సమీకరించేందుకు కుయుక్తులకు పాల్పడుతూ విద్వేష ప్రసంగాలు దట్టిస్తోంది. ఏకంగా ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు జెపి నడ్డా బహిరంగంగానే మతతత్వ ప్రసంగాలు చేయడం పట్ల రాజకీయ విశ్లేషకులు ఆందోలన వ్యక్తం చేస్తున్నారు. బొకారో జిల్లాలో ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. జార్ఖండ్‌లో జెఎంఎం నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం రాష్ట్రంలోని మదర్సాలలో బంగ్లాదేశ్ చొరబాటుదారులకు ఆశ్రయం కల్పిస్తోందని నడ్డా ఆరోపించారు. వీరందరికీ ఆధార్, ఓటర్ ఐడి, గ్యాస్ కనెక్షన్, రేషన్ కార్డు ఇస్తోందని అక్కసు వెళ్లగక్కారు. దీనిపై తమకు ఇంటెలిజెన్స్ విభాగం నివేదిక అందజేసిందని చెప్పుకొచ్చారు. జెఎంఎం పాలన కొనసాగితే జార్ఖండ్ మినీ బంగ్లాదేశ్‌గా మారిపోతుందని ఇక్కడ ఎన్నికల ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ప్రారంభం నుంచి మత విద్వేషాలను రెచ్చగొడుతూ వస్తున్నారు.

బిజెపి అధికారంలోకి వస్తే జార్ఖండ్‌లో జాతీయ పౌర రిజిస్టర్‌ను అమలు చేస్తామని, చొరబాటుదారులు గిరిజన మహిళలను పెళ్లి చేసుకుంటే వారి పిల్లలకు షెడ్యూల్డ్ తెగ హోదా లభించదని హిమంత మీడియాతో అన్నారు.

## ఇరాన్ సుప్రీం లీడర్‌గా మెజ్తాబా ఖమేనీ!

**టెల్ అవీవ్:** అయతుల్లా ఖమేని కుమారుడు మెజ్తాబా ఖమేనీ ఇరాన్ సుప్రీం లీడర్‌గా ఎన్నికైనట్లు సమాచారం. ఇరాన్ ఇంటర్నేషనల్ రిపోర్టును ఉటంకిస్తూ ఇజ్రాయిల్ మీడియా యెనెట్ తెలిపింది. అయతుల్లా ఖమేనీ (85) తీవ్ర అస్వస్థతకు గురైనట్లు వార్తలొచ్చాయి. ఖమేనీ అభ్యర్థన మేరకు సెప్టెంబరు 26న జరిగిన అత్యున్నత స్థాయి నేతలు సమావేశమై మెజ్తాబాను వారసుడిగా ఎంపిక చేసినట్లు ఇజ్రాయిలీ న్యూస్ ఏజెన్సీ తెలిపింది. మెజ్తాబా అరుదుగా బహిరంగంగా కనిపిస్తాడు. అయితే 2009 ఎన్నికల తర్వాత ఆయన ఇరాన్‌లో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. 2021లో ఇరాన్‌లో అత్యున్నత బిరుదు అయిన 'అయతుల్లా' ను మెజ్తాబా అందుకున్నారు. అయితే ఈ విషయాన్ని ఇరాన్ ఇంకా ధ్రువీకరించలేదు. రుహోల్లా ఖమేనీ తర్వాత 1989 నుంచి అయతుల్లా ఖమేనీ ఇరాన్ సుప్రీం లీడర్‌గా ఉన్నారు.

# చిన్నారుల ఎదుగుదలకూ కులం అవరోధమే!

- ఆధిపత్య కులాల కంటే అణగారిన పిల్లల్లో సమస్య అధికం
- ఆదివాసీ, దళితుల్లో మరింత ఆందోళనకరం
- బాధితుల సంఖ్య 35 శాతానికి పైనే
- సబ్-సహారా ఆఫ్రికా దేశాల కంటే అధ్వానం
- తాజా అధ్యయనంలో వెల్లడి

**భారత్‌లో చిన్నారుల ఎదుగుదలకూ కులం ఒక అవరోధంగా వేధిస్తోంది. పెత్తందారి సామాజిక తరగతుల పిల్లలతో పోలిస్తే అణగారిన తరగతులకు చెందిన చిన్నారుల్లో ఎదుగుదల లోపం అధికంగా ఉంటోంది. ఆదివాసీ, దళిత పిల్లల్లో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంది. దేశంలో ఐదేళ్లలోపు చిన్నారుల్లో 35 శాతం మంది ఎదుగుదల సమస్యతో బాధపడుతున్నారని ఇటీవల ఒక నివేదిక వెల్లడించింది. ప్రపంచంలోని ఇతర దేశాలే కాదు.. సబ్-సహారా ఆఫ్రికాలోని దేశాల కంటే కూడా ఈ లోపాన్ని ఎదుర్కొంటున్న చిన్నారుల సంఖ్య భారత్‌లోనే అధికంగా ఉన్నట్లు తెలిపింది.**

**న్యూఢిల్లీ :** దేశంలో లక్షలాది మంది చిన్నారులు ఎదుగుదల లోపం (వయసుకు తగిన ఎత్తు లేకపోవటం) తో బాధపడుతున్నారు. ఇందులో అనాదిగా వస్తున్న కుల వ్యవస్థ పాత్ర కనిపిస్తున్నది. అంతేకాదు, ప్రభుత్వాల నిర్లక్ష్యపూరితమైన చర్యలూ ఇందుకు కారణమవుతున్నాయి. తగిన చర్యలు తీసుకోకపోవటంతో పోషకాహార లోపం కారణంగా చిన్నారులు ఇలాంటి సమస్యలను ఎదుర్కొంటున్నారని నిపుణులు, విశ్లేషకులు అంటున్నారు. పలు జాతీయ, అంతర్జాతీయ నివేదికలు సైతం ఇదే విషయాన్ని తెలుపుతున్నాయి. సబ్-సహారా ఆఫ్రికా కంటే అధిక స్థాయిలో భారత్‌లోని పిల్లల ఎదుగుదల లోపానికి దశాబ్దాలుగా వస్తున్న కుల వివక్ష కూడా కారణమని తాజా అధ్యయనం ఒకటి వెల్లడిస్తున్నది. అశోక యూనివర్సిటీకి చెందిన అశ్వినీ దేశ్‌పాండే, మలేషియాలోని మోనాశ్ యూనివర్సిటీకి చెందిన రాజేశ్ రామచంద్రన్‌లు ఈ అధ్యయనాన్ని నిర్వహించారు.

**ఆఫ్రికా దేశాల కంటే దుర్భర స్థితిలో భారత్**

ప్రపంచంలో ఈ రెండు ప్రాంతాల్లో కలిపి ఐదేళ్లలోపు చిన్నారులు.. 44 శాతం మంది ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎదుగుదల లోపంతో బాధపడుతున్న పిల్లల్లో దాదాపు 70 శాతం మంది ఈ రెండు ప్రాంతాల నుంచే ఉండటం గమనార్హం. ఇది పోషకాహార లోపానికి ఒక సూచికగా విశ్లేషకులు చెప్తున్నారు. అయితే, ఇందులో భారత రేటు 35.7 శాతంగా ఉన్నది. 49 దేశాలను కలిగిన సబ్-సహారా ఆఫ్రికా రేటు 33.6 శాతంతో భారత్ కంటే తక్కువగానే ఉన్నది. సబ్-సహారా ఆఫ్రికాతో పోలిస్తే భారత చిన్నారులు ఎత్తు తక్కువున్నారన్న హైట్ గ్యాప్ మీదనే దృష్టిని సారిస్తూ.. పిల్లల పోషకాహార లోపంలో సామాజిక గుర్తింపు పాత్రను, ముఖ్యంగా కులాన్ని విస్మరిస్తున్నారని అధ్యయనం తెలిపింది.

**'గోల్డెన్ పీరియడ్'లో చిన్నారులకు సవాళ్లు**

చిన్నారుల జీవితంలో 'గోల్డెన్ పీరియడ్'గా పిలవబడే తొలి వెయ్యి రోజులు చాలా కీలకం. రెండేండ్ల వయసు వచ్చేనాటికి 80 శాతం మెదడు ఎదుగుతుంది. ఇది సుదీర్ఘ జీవితానికి కావాల్సిన ఒక పునాది. ఈ కీలకమైన సమయంలో చిన్నారులకు ఆరోగ్య సంరక్షణ, మంచి పోషకాహారం, ప్రారంభ అభ్యాసం, సురక్షితమైన వాతావరణం వంటివి చాలా ముఖ్యం. ఇవి చిన్నారుల భవిష్యత్తును నిర్ణయిస్తాయని నిపుణులు చెప్తున్నారు. అయితే, గోల్డెన్ పీరియడ్‌లో చిన్నారులకు ఇవేమీ అందకపోవటంతో వారి ఎదుగుదలపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయని అంటున్నారు. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం.. 2021లో సబ్‌సహారా, దక్షిణాసియా (భారత్‌తో కలుపుకొని)లు ప్రపంచ పేదరికంలో 85 శాతం వాటాను కలిగి ఉన్నాయి. ఇది పేదరిక, అభివృద్ధిలో సవాళ్లను తెలియజేస్తున్నది. ఇది కూడా చిన్నారులపై ప్రభావం చూపిందని విశ్లేషకులు చెప్తున్నారు. ప్రపంచంలోనే అత్యధిక ఎదుగుదల సమస్య రేట్లు యుద్ధంతో దెబ్బతిన్న సబ్-సహారా ఆఫ్రియాలోని డి.ఆర్ కాంగో వంటి దేశాల్లో ఉన్నాయి.

**ప్రపంచవ్యాప్తంగా 22 శాతం**

భారత్‌లోని 13.7 కోట్ల మంది ఐదేళ్లలోపు చిన్నారుల్లో 35 శాతం కంటే ఎక్కువ మంది ఎదుగుదల లోపంతో బాధపడుతున్నారు. ఇది ప్రపంచవ్యాప్తంగా 22 శాతం మాత్రమే కావటం గమనార్హం. ఐదేళ్లలోపు వయసున్న చిన్నారుల్లో మూడోవంతు కంటే ఎక్కువ వాటాను కలిగి ఉన్న ఆదివాసీలు, దళితుల్లో పరిస్థితులు మరింత క్లిష్టంగా ఉంటాయని నిపుణులు చెప్తున్నారు.

భారత్‌లో అణగారిన కులాలతో పోలిస్తే.. ఆధిపత్య కులాల పిల్లల్లో ఎదుగుదల లోపం 20 శాతం తక్కువ అని పరిశోధకులు చెప్పారు. జనన క్రమం, పారిశుధ్య పద్దతులు, తల్లి ఎత్తు, తోబుట్టువుల సంఖ్య, విద్య, రక్తహీనత, కుటుంబ సామాజిక ఆర్థిక పరిస్థితి వంటి అంశాలను ఇందులో పరిగణలోకి తీసుకున్నారు. దేశంలో ఉన్న కుల వ్యవస్థ ఇప్పటికీ ఇక్కడి చిన్నారుల ఎదుగుదలకు అడ్డంకిగా మారుతున్నదని నిపుణులు, విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేశారు.

## బిజెపి పాలనలో ద్రవ్యోల్బణ సెగలు

- తేజస్వియాదవ్



**బొకారో :** దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, నిత్యావసర వస్తువుల ధరలకు కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వానిదే బాధ్యత అని ఆర్‌జెడి నాయకులు తేజస్వియాదవ్ విమర్శించారు. అలాగే బిజెపి విద్వేషాన్ని వ్యాప్తి చేస్తుందని విమర్శించారు. 'కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం అనుసరిస్తున్న తప్పుడు విధానాలు కారణంగానే నిరుద్యోగం, ద్రవ్యోల్బణం పెరుగుతున్నాయి. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను అరికట్టడంలోనూ, ఉపాధి అవకాశాలను పెంచడంలోనూ బిజెపి విఫలమైంది' అని జార్ఖండ్‌లోని బొకారో పట్టణంలో జరిగిన ఎన్నికల ర్యాలీలో తేజస్వి యాదవ్ విమర్శించారు. అలాగే, వివిధ రాష్ట్రాల్లోని బిజెపియేతర ప్రభుత్వాలను పడగొట్టేందుకు ఇడి,సిబిఐ, ఐటి వంటి కేంద్ర సంస్థలను బిజెపి దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. 'వారు(బిజెపి) జార్ఖండ్ ముఖ్యమంత్రి హే మంత్ సోరెన్, బీహార్ మాజీ సిఎం లాలూ ప్రసాద్‌లను జైలుకు పంపారు. నన్ను కూడా కటకటాల వెనక్కి నెట్టడానికి ప్రయత్నించారు. జైలు పేరు చెబితే భయపడం' అని తేజస్వీ పేర్కొన్నారు. నిజమైన సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే హిందూ, ముస్లిం పేరుతో బిజెపి విద్వేషాన్ని వ్యాప్తి చేస్తోందని విమర్శించారు. జార్ఖండ్‌లో రెండో, చివరి దశ అసెంబ్లీ ఎన్నికలు ఈ నెల 20న జరగనున్నాయి.

## మోడీకి నైజీరియా పురస్కారం

**అబుజ :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీని నైజీరియా రెండో అత్యున్నత పురస్కారంతో సత్కరించింది. 'ది గ్రాండ్ కమాండర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ నైగర్ (జిసిఒఎన్)' అనే ఈ పురస్కారాన్ని మోడీకి ఆ దేశ అధ్యక్షులు బోలా అహ్మద్ తినుబు అందజేశారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ నైజీరియా నుంచి జిసిఒఎన్ అందుకోవడం గౌరవంగా భావిస్తున్నానని తెలిపారు. భారత్-నైజీరియా స్నేహానికి ఈ పురస్కారాన్ని అంకింతం చేస్తున్నట్లు చెప్పారు. విదేశీయులకు ఈ అవార్డును బహుకరించడం ఇది రెండసారి మాత్రమే. 1969లో జిసిఒఎన్ అవార్డును క్వీన్ ఎలిజిబెత్‌కు బహుకరించారు. కాగా, మోడీ అందుకున్న 17వ అంతర్జాతీయ అవార్డు ఇది. మూడు దేశాల పర్యటనలో భాగంగా ఆదివారం ముందుగా నైజీరియాకు మోడీ చేరుకున్నారు. అధ్యక్షులు తినుబుతో చర్చల్లో పాల్గొన్నారు. ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింత పటిష్టం చేయడం, విస్తృతంగా మార్చడంపై ఈ సమావేశాల్లో చర్చించినట్లు మోడీ చెప్పారు. ఆర్థిక, ఇంధనం, వ్యవసాయం, భద్రత, సాంస్కృతిక రంగాల్లో కొత్త అవకాశాలను గుర్తించినట్లు చెప్పారు. భారత్-నైజీరియా మొత్తం ఆఫ్రికా ఖండంలోని ప్రజల శ్రేయస్సు కోసం కలిసి ముందుకు సాగుతాయని, ప్రపంచ ప్రయోజనాలకు-ప్రాధాన్యతలకు ప్రాముఖ్యత నిస్తాయని అన్నారు. 2007లో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ పర్యటన తరువాత నైజీరియాలో భారత ప్రధాని పర్యటించడం ఇదే మొదటిసారి. నైజీరియా పర్యటన తరువాత మోడీ బ్రెజిల్‌కు వెళ్ళనున్నారు. అక్కడ నుంచి గయానా పర్యటనకు వెళ్తారు.

## వారం రోజులైనా అతీగతీ లేదు

- కాప్ 29 కొలిక్కి రాని చర్చలు

**బాకు :** కాప్ 29 ప్రారంభమై వారం రోజులైనా చర్చల్లో ఎలాంటి పురోగతీ లేదు. ఈ సదస్సులో కీలక అంశాలైన క్లైమేట్ ఫైనాన్స్, ట్రేడ్ మెజర్స్, వాతావరణ చర్యలకు సమాన జవాబుదారీతనం వంటి వాటిపై అభివృద్ధి చెందిన దేశాలు, అభివృద్ధి చెందుతున్న దేశాలు మధ్య తీవ్రమైన అంతరాలు చర్చలు ముందుకు జరగకుండా నిరోధిస్తున్నాయి. జి-77కు ప్రాతినిధ్యం వహించే భారత్, చైనా దేశాలు ఆర్థిక సాయానికి సంపన్నదేశాలదే బాధ్యత అని స్పష్టం చేస్తున్నాయి. ఇంకా అమలుకానీ ఆర్థిక సాయాలకు సంపన్నదేశాలే జవాబుదారీ అని పేర్కొంటున్నాయి. క్లైమేట్ ఫైనాన్స్ ఏడాదికి 1.3 ట్రిలియన్ డాలర్లగా ఉండాలని జి-77 దేశాలు పునరుద్ఘాటించాయి. ఇప్పటికే వాతావరణ మార్పుల ప్రభావాలకు గురైన ఆర్థిక వ్యవస్థలకు గ్రాంట్లు, రాయితీ నిధులు అందించాలని కోరుతున్నాయి. అలాగే ఇప్పటి వరకూ అందించిన క్లైమేట్ ఫైనాన్స్‌లో సుమారు 70 శాతం రుణాలనే అని, ఇది ఆమోద యోగ్యం కాదని, అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థిక వ్యవస్థలపై తీవ్రమైన ఒత్తిడిని కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. అయితే వీటికి అభివృద్ధి చెందిన దేశాలు వీటికి అంగీకరించడం లేదు. నిజానికి ఈ సదస్సుకు అభివృద్ధి చెందిన దేశాల నుంచి కీలక నాయకులు పాల్గొనలేదు. క్లైమేట్ ఫైనాన్స్‌పై నిర్ణయాన్ని అత్యవసరంగా తీసుకోవాలని ఐరాస ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ సైమన్ స్టీల్ కూడా హెచ్చరించారు. ప్రపంచంలోని ఏ దేశం కూడా వాతావరణ ఆధారిత ఆర్థిక నష్టాల నుంచి తప్పించుకోలేదని తెలిపారు. ఐరాస పిలుపునకు కూడా అభివృద్ధి చెందిన దేశాల నుంచి స్పందన లేకపోవడంతో చర్చల్లో ప్రతిష్టంభన కొనసాగుతోంది. ఈ నెల 22తో కాప్ 29ను ముగియనుంది.

## నెతన్యాహు వేసవి నివాసంపై బాంబు దాడి

**టెల్ అవీవ్:** ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు నివాసంపై మెరుపు బాంబు దాడి జరిగింది. సిజేరియాలోని హాలి డే హోంపై శనివారం ఈ దాడి జరిగిందని, ఆ సమయంలో నెతన్యాహు కుటుంబ సభ్యులు ఎవరూ నివాసంలో లేదరని ఇజ్రాయిల్ అధికారికి వార్తా సంస్థ కెఎన్ నివేదించింది. ఈ దాడిని ఇజ్రాయిల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్ ఖండించారు. పోలీసులు నిందితులను పట్టుకుని తగిన విధంగా శిక్షించాలని ప్రతిపక్ష నేత అయిర్ లాపిడ్ కోరారు. గత నెల 19న కూడా ఒకసారి ఇదే నివాసంపై దాడి జరిగింది. హమాస్ చీఫ్ యాహ్యా సిన్వార్ హత్య తర్వాత డ్రోన్ దాడి జరిగింది. లెబనాన్ నుంచి ప్రయోగించిన మూడు డ్రోన్లలో ఒకటి ఈ వెకేషన్ హోమ్‌లోకి దూసుకెళ్లింది. ఈ డ్రోన్లు లెబనాన్ నుంచి 70 కి. మీ దూరం ప్రయాణించి నెతన్యాహు నివాసంపై దాడి చేయడం గమనార్హం. నెతన్యాహు నివాసాన్ని వీడి భూ గర్భ గృహంలో మకాం పెట్టారు. రోజువారీ సమావేశాలు కూడా అక్కడే నిర్వహిస్తున్నారు. ఎక్కువ సేపు ఒక చోట ఉండకూడదని భద్రతా విభాగం నెతన్యాహును కోరింది.

## మరోసారి భగ్గుమన్న మణిపూర్

(మొదటి పేజీ తరువాయి)

లాంగ్‌మీడాంగ్ బజార్‌లో హియాంగ్లాం బిజెపి ఎమ్మెల్యే వై. రాధేశ్యామ్, తౌబల్ జిల్లాలో వాంగ్‌జింగ్ టెన్థా బిజెపి ఎమ్మెల్యే పవోనమ్ బ్రోజెన్, ఖుంద్రాక్‌పామ్ తూర్పు జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యే టీ లోకేశ్వర్‌ల ఇళ్లను కూడా తగులబెట్టారు. అయితే ఈ సమయంలో శాసనసభ్యులు, వారి కుటుంబ సభ్యులు ఇంట్లో లేరు, ఈ సంఘటనలలో ఇళ్ళు పాక్షికంగా కాలిపోయాయని పోలీసులు తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఆందోళనకారులు బిజెపి ఎమ్మెల్యే, బీరెన్ సింగ్ అల్లుడు ఆర్‌కె ఇమోతో సహ మంత్రులు సపమ్ రంజన్, ఎల్. సుసీంద్రో సింగ్, వై. ఖేమ్‌చంద్, బిజెపి శాసనసభ్యులు సపం కుంజకేసోర్, జోయ్కిషన్ సింగ్ ఆస్తులను కూడా ధ్వంసం చేశారు.

వాంగ్‌ఖేయ్ సీటుకు చెందిన జెడియు ఎమ్మెల్యే అరుణ్ లాంగ్‌తబల్‌కు చెందిన శాసనసభ్యుడు కరమ్ శ్యామ్‌ల ఇళ్లను కూడా వారు ఘెరావ్ చేశారు. కైషామ్‌థాంగ్ స్వతంత్ర శాసనసభ్యుడు సపమ్ నిషికాంత సింగ్‌కు చెందిన స్థానిక వార్తాపత్రిక కార్యాలయ భవనాన్ని లక్ష్యంగా చేసుకుని దాడులు చేశారు.

ఈ అల్లర్లతో శాంతి భద్రతల పరిస్థితి అదుపు తప్పడంతో ఇంఫాల్ లోయలోని ఇంఫాల్ ఈస్ట్, ఇంఫాల్ వెస్ట్, బిష్ణుపూర్, తౌబాల్, కక్‌చింగ్ జిల్లాలలో నిరవధిక కర్ఫ్యూ విధించారు. ఇంటర్నెట్ సేవలు నిలిపివేశారు. ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యే నివాసాల వద్ద భద్రత పెంచారు. ఇంఫాల్‌లోని వేర్వేరు ప్రాంతాలలో ఆందోళన చేస్తున్న నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు భాష్పవాయు గోళాలు ప్రయోగించారు.

**ఏం జరిగింది?**

ఇటీవల జిరిబామ్‌లో ఉగ్రవాదులు, భద్రతాదళాల మధ్య కాల్పులు జరిగిన తర్వాత జిరిబామ్‌లోని పునరావాస కేంద్రం నుండి ఆరుగురు అదృశ్యమయ్యారు. వీరిలో ఇద్దరు మహిళలు, ఓ చిన్నారి మృతదేహాలు శనివారం బారక్ నదిలో లభించాయి. ఓ మహిళ, ఇద్దరు చిన్నారుల మృతదేహాలను శుక్రవారం రాత్రి కనుగొన్నారు. దీనిపై ఆగ్రహించిన నిరసనకారులు ప్రదర్శనలు జరిపారు. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేల నివాసాలపై దాడులు చేశారు. జిరిబమ్‌లో శనివారం రాత్రి భద్రతా సిబ్బందితో జరిగిన కాల్పులలో పది మంది కుకీ-జో యువకులు చనిపోయారు. వీరి మృతదేహాలను అస్సాంలోని సిల్చార్ పట్టణం నుండి చురాచాంద్‌పూర్‌కు విమానంలో తరలించారు. దానికి ముందు సిల్చార్ ఆస్పత్రిలో మృతదేహాలకు శవ పరీక్షలు నిర్వహించారు. కాగా మణిపూర్‌లో నెలకొన్న హింసాత్మక పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా మహారాష్ట్ర పర్యటనను రద్దు చేసుకొని ఢిల్లీ చేరుకున్నారు.

**పౌర సమాజం అల్టిమేటం**

సాయుధ ఉగ్రవాద దళాలపై 24 గంటలలోగా నిర్ణయాత్మక చర్యలు తీసుకోవాలని మణిపూర్‌లోని పౌర సమాజ బృందాలు ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశాయి. మరోవైపు హింసతో అట్టుడుకుతున్న మణిపూర్‌లో పర్యటించాలని, శాంతి పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోడీకి విజ్ఞప్తి చేశారు. గత సంవత్సరం మణిపూర్‌లో హింస చెలరేగినప్పటి నుండీ మోడీ ఆ రాష్ట్రంలో పర్యటించలేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే గుర్తు చేశారు.

మణిపూర్ రావణకాష్టంలా తగలబడడానికి మోడీ ప్రభుత్వమే కారణమని ఆయన పేర్కొన్నారు. ఉద్దేశపూర్వకంగానే బిజెపి, కేంద్రం మణిపూర్ హింసాకాండ కొనసాగాలా చేస్తున్నాయని విమర్శించారు.

**బిజెపికి ఎన్‌పిపి మద్దతు ఉపసంహరణ**

మణిపూర్‌లో హింసాకాండ కొనసాగుతున్న నేపథ్యంలో మేఘాలయ ముఖ్యమంత్రి కాన్రాడ్ సంగ్మా నేతృత్వంలోని నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పిపి) ఆదివారం బిజెపి నేతృత్వంలోని మణిపూర్ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకుంది. ఈ మేరకు బిజెపి జాతీయ అధ్యక్షుడు జె.పి నడ్డాకు అధికారిక లేఖ పంపింది. "ముఖ్యమంత్రి ఎన్ బీరెన్ సింగ్ నాయకత్వంలోని మణిపూర్ ప్రభుత్వం కుల హింసను నియంత్రించటంలోనూ, రాష్ట్రంలో సాధారణ స్థితిని పునరుద్ధరించటంలో పూర్తిగా విఫలమైంది. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఎన్‌పీపీ మణిపూర్‌లో బీరెన్ సింగ్ నేతృత్వంలోని ప్రభుత్వానికి తక్షణమే మద్దతు ఉపసంహరించుకోవాలని నిర్ణయించుకున్నాం' అని లేఖలో తెలిపారు.

2022లో మణిపూర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఇక్కడ మొత్తం 60 మంది సభ్యులు ఉన్నారు. అసెంబ్లీలో మెజారిటీ సంఖ్య 31 కాగా, బిజెపికి సొంతంగా 32 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. దీంతో బీరెన్ సర్కారుకు ప్రమాదం లేదని రాజకీయ పరిశీకులు విశ్లేషిస్తున్నారు. అలాగే జెడి(యు) నుంచి గెలిచిన ఆగురుగురిలో ఐదుగురు ఎమ్మెల్యేలు కాషాయపార్టీ పంచన చేరారు. దీంతో బిజెపి బలం 37 కి చేరింది. అలాగే, అసెంబ్లీలో కాంగ్రెస్ 5, నాగా పీపుల్స్ ఫ్రంట్ 5, కాన్రాడ్ సంగ్మా ఎన్‌పీపీ 7 సీట్లు గెలుచుకున్నాయి. ఇవి కాకుండా, కుకీ పీపుల్స్ అలయన్స్ స్వతంత్ర అభ్యర్థులు 2 , 3 స్థానాల్లో విజయం సాధించారు.

ఝాన్సీ ఆసుపత్రిలో చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో గాయపడ్డ 30 మందికి పైగా చిన్నారులు వేరే వార్డులో చికిత్స పొందుతున్నారు. వారి కోసం వచ్చిన తల్లిదండ్రులు ఇలా ఆసుపత్రిలో ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడ వేచిచూస్తున్నారు.

## ఝాన్సీ ఘటనపై మానవ హక్కుల సంఘం ఆగ్రహం

- యుపి ప్రభుత్వానికి, డిజిపికి నోటీసులు

**న్యూఢిల్లీ :** ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీలోని మెడికల్ కాలేజ్‌లో చిన్నారుల వార్డులో చోటుచేసుకున్న అగ్ని ప్రమాదం పట్ల మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్‌ఆర్‌సి) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నెల 15న జరిగిన ఈ దారుణ ఘటనలో 10 మంది నవజాత శిశువులు మరణించిన సంగతి తెలిసిందే. బాధిత చిన్నారులను రక్షించడంలో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్న కథనాలు వెలువడ్డాయి. పరామర్శకు వెళ్లిన ఉపముఖ్యమంత్రికి ఘనంగా స్వాగత ఏర్పాట్లు చేయడం, అటు వైపు కన్నెత్తి కూడా చూడకుండా ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఎన్నికల ప్రచారానికి వెళ్లడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. ఈ నేపథ్యంలో ఎన్‌హెచ్‌ఆర్‌సికి రాష్ట్ర ప్రభుత్వానికి, డిజిపికి నోటీసులు జారీ చేసింది. ఈ ఘటనకు సంబంధించి వస్తున్న వార్తలు ఆందోళన కలిగించేవిధంగా ఉన్నాయని తెలిపింది. వారం రోజుల్లోగా పూర్తి నివేదిక సమర్పించాలని పేర్కొంది. నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని తెలుస్తోందని, ఇది ప్రభుత్వ సంస్థ సంరక్షణలో ఉన్న బాధితుల మానవ హక్కులను తీవ్రంగా ఉల్లంఘించడమేనని ఎన్‌హెచ్‌ఆర్‌సి నోటిసుల్లో పేర్కొంది. ఈ కేసులో నమోదైన ఎఫ్ఐఆర్ స్థితి, బాధ్యులపై తీసుకున్న చర్యలు, క్షతగాత్రులకు అందుతున్న వైద్యం, బాధిత కుటుంబాలకు నష్ట పరిహారం చెల్లింపు.. వంటి అంశాలను నివేదికలో పొందుపర్చాలని నిర్దేశించింది.

## హైపర్‌సోనిక్ క్షిపణి పరీక్ష సక్సెస్

**ఢిల్లీ :** భారత అమ్ముల పొదిలో మరో శక్తివంతమైన ఆయుధం చేరింది. భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఒ) దీర్ఘశ్రేణి హైపర్ సోనిక్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించింది. ఈ విషయాన్ని ఆదివారం ఉదయం కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రకటించారు. ఒడిశా తీరంలోని డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలామ్ ద్వీపంలో ఈ పరీక్ష నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ చారిత్రక ఘట్టంతో అత్యాధునిక మిలిటరీ టెక్నాలజీని సాధించిన అతికొద్ది దేశాల జాబితాలో భారత్ కూడా చేరినట్లైందన్నారు. పరీక్షకు సంబంధించిన వీడియోను కూడా జత చేశారు. 1500 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాలను ఈ హైపర్ సోనిక్ క్షిపణి ఛేదించగలదు. వివిధ రకాల వార్‌హెడ్‌లను అమర్చేలా దీనిని డిఆర్‌డిఒ రూపొందించింది. సైనిక దళాలకు చెందిన కీలక అధికారులు, శాస్త్రవేత్తల సమక్షంలో ఈ పరీక్ష జరిగింది.

**ప్రత్యేకతలు ఇవే**

ఈ క్షిపణి గంటకు 6,115 కిలోమీటర్ల వేగంతో... అంటే శబ్దం కంటే ఐదు రెట్ల వేగంతో ప్రయాణిస్తుంది. ఇతర బాలిస్టిక్, క్రూయిజ్ క్షిపణుల వేగంతో పోలిస్తే ఇది చాలా ఎక్కువ. సంప్రదాయ క్షిపణులతో పోలిస్తే వీటి ఆచూకీని కనిపెట్టడం చాలా కష్టం. ఇవి నిమిషాల వ్యవధిలోనే సంప్రదాయ, అణు పేలోడ్లను సరఫరా చేయగలవు. ఈ క్షిపణులు మధ్యలోనే తమ గమ్యాన్ని మార్చుకుంటాయి. కాబట్టి దానిని అంచనా వేయడం అసంభవం. క్షిపణిలోని స్క్రామ్‌జెట్ ఇంజిన్లు వాతావరణం నుండి ప్రాణవాయువును గ్రహించి హైడ్రోజన్ ఇంధనంతో దానిని కలుపుకొని ప్రయాణిస్తాయి.

## బిజెపి తీరుతో ఉపాధి అవకాశాలు ఆవిరి

- మహారాష్ట్రలో కోరలుచాచిన నిరుద్యోగం
- కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ

**ముంబయి :** బిజెపి పాలకులు అవలంబిస్తున్న వివక్షపూరిత, వినాశకర విధానాల వల్ల మహారాష్ట్రలో ఉపాధి అవకాశాలు ఆవిరైపోయాయని, నిరుద్యోగం కోరలు చాచిందని కాంగ్రెస్ నాయకులు ప్రియాంక గాంధీ విమర్శించారు. మహారాష్ట్రకు దక్కాల్సిన కొన్ని భారీ ప్రాజెక్టులను పనిగట్టుకొని గుజరాత్‌కు తరలించిన కారణంగా ఇక్కడ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కుచించుకుపోయాయని ఆమె వాపోయారు. గడ్చిరోలి జిల్లాలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆమె ప్రసంగిస్తూ బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. మతతత్వ అజెండాతో మహారాష్ట్రలోని అధికార కూటమి నాయకులు వాస్తవ సమస్యల నుంచి దృష్టి మరల్చే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ (ఎంవిఎ) కూటమి అధికారంలోకి వస్తే, సోయాబీన్ పంటకు క్వింటాల్‌కు రూ.7 వేలు ఇస్తామని రైతులకు ఆమె హామీ ఇచ్చారు. మహారాష్ట్రలో 2.5 లక్షలకు పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఫాక్స్‌కాన్, ఏయిర్‌బస్ ప్రాజెక్టులను గుజరాత్‌కు తరలింటంతో మహారాష్ట్రలో ఉద్యోగాలు దక్కకుండా పోయాయని ఆమె అన్నారు. ఉపాధి అవకాశాలు లేని కారణంగానే మహారాష్ట్రలో యువత బలవన్మరణాలు పాల్పడుతున్నదని ప్రియాంక గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించటంలో బిజెపి ఘోరంగా విఫలమైందన్నారు. ఏక్ హైతో సేఫ్ హై అని బీజేపీ చేస్తున్న నినాదాన్ని ఉటంకిస్తూ.. ఈ దేశంలో వాస్తవానికి అదానీ 'సేఫ్'గా ఉన్నారనీ, సాధారణ పౌరులు మాత్రం కష్టాల్లో ఉన్నారని ఆమె ఎద్దేవా చేశారు.

## ఢిల్లీ రవాణా మంత్రి కైలాష్ రాజీనామా

**న్యూఢిల్లీ :** అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఢిల్లీలోని అధికార ఆమాద్మీ పార్టీకి భారీ షాక్ తగిలింది. ఢిల్లీ రవాణా శాఖ మంత్రి కైలాష్ గహ్లోత్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌కు ఆదివారం నాడు ఆయన ఒక లేఖ పంపారు. ఢిల్లీ ప్రభుత్వం అసంబద్ధ వాగ్దానాలు చేస్తోందని, పార్టీ తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటోందని కైలాష్ తన లేఖలో ఆరోపించారు.

**బిజెపి దిగజారుడు రాజకీయాలు**

కైలాష్ రాజీనామా నేపథ్యంలో ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ బిజెపిపై విరుచుకుపడ్డారు. బిజెపి దిగజారుడు రాజకీయాలతో ఆమాద్మీపై కుట్రలకు పాల్పడుతోందని విమర్శించారు. బిజెపి ఒత్తిళ్ల వల్లే తాజా పరిణామాలకు కారణమని పేర్కొన్నారు. గహ్లోత్‌పై సిబిఐ, ఇడి వంటి కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలను ఉసిగొల్పి వేధింపులకు గురి చేశారని ఆయన ఆరోపించారు. ఐదేళ్ల పాటు ప్రభుత్వంలో ఉన్న గహ్లోత్ ఏనాడూ ప్రస్తుతం చేస్తున్న ఆరోపణలు చేయలేదని ఈ సందర్భంగా సంజీయ్ పేర్కొన్నారు. బిజెపి స్క్రిప్టునే ఆయన చదివారని తప్పుబట్టారు. అయితే కేజ్రీవాల్ నేతృత్వ ఆప్ మునిగిపోయే పడవ అని బిజెపి ఢిల్లీ విభాగం సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసింది.

**ఆప్ గూటికి బిజెపి మాజీ ఎమ్మెల్యే**

కైలాష్ రాజీనామా చేసిన కాసేపటికే బిజెపి మాజీ ఎమ్మెల్యే అనిల్ ఝా ఆప్‌లో చేరారు. ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ సమక్షంలో ఆయన ఆప్ కండువా కప్పుకున్నారు. కిరారీ అసెంబ్లీ సీటు నుంచి గతంలో ఆయన రెండు సార్లు బిజెపి ఎమ్మెల్యేగా పనిచేశారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్‌పై ప్రశంసలు కురిపించారు. పూర్వంచల్ వర్గం కోసం పనిచేసిన ఏకైక వ్యక్తి కేజ్రీవాలేనన్నారు. ప్రతి ఇంటికీ తాగునీరు అందేలా కషిచేశారని కొనియాడారు.

**మీకోసం**

ఆమ్లెట్ కోసం గుడ్డు కలిపేటప్పుడు అందులో కొద్దిగా శనగపిండి కలిపితే ఆమ్లెట్ పొంగుతుంది.

**జీవన సౌరభం**

మంచి నడవడికకు ఉన్నతమైన ఆలోచనలు చాలా ముఖ్యం.



## పక్షులు నేర్పిన పాఠం

అప్పాజీపేట గ్రామంలో రామచంద్రుడు, అతని భార్య సరోజ నివసిస్తున్నారు. వాళ్లకి ముగ్గురు పిల్లలు. పని చేయగా వచ్చిన డబ్బులతో వారు అతి కష్టం మీద పిల్లల్ని పోషిస్తున్నారు. పిల్లలు పెరిగి పెద్ద వాళ్ళు అవుతున్నారు. ఖర్చులు పెరిగాయి. సంపాదన చాలడం లేదు. దీనికితోడు రామచంద్రుడు వ్యసనాలకు బానిస అయ్యాడు. భార్యభర్తల మధ్య తగాదాలు మొదలయ్యాయి. సరోజపై కుటుంబ బాధ్యత పెరిగింది. రోజులు భారంగా గడుస్తున్నాయి.

కొంతకాలం తర్వాత ఒకరోజు రామచంద్రుడు తన ఇంటి ఆవరణలో నివసిస్తున్న పక్షుల జంటను చూశాడు. అవి ఎంతో ప్రేమతో కలిసిమెలిసి ఉన్నాయి. పెద్ద పక్షులు గూటిలోని పిల్ల పక్షులకు ఎంతో ప్రేమగా ఆహారాన్ని పెడుతున్నాయి. ఇదంతా రామచంద్రుడు గమనించాడు. అతని మనసులో ఏదో తీరని వెలితి అనిపించింది. మాటలు లేని పక్షులు ఎంతో బాధ్యతగా మెలగుతున్నాయి. తను మాత్రం భార్యని, పిల్లలని కష్టపెడుతున్నానని బాధపడ్డాడు. తప్పు తెలుసుకుని సరోజని క్షమించమని అడిగాడు. తండ్రిలో వచ్చిన మార్పుకు పిల్లలు ఎంతో సంతోషపడ్డారు.

**- కోమటి రెడ్డి బుచ్చిరెడ్డి,**
**94415 61655.**



### లెక్కలు చేయండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన పజిల్‌లో ఖాళీ గళ్లల్లో అంకెలు మీరు రాయండి. అక్కడ ఇచ్చిన గుర్తుల ఆధారంగా అవన్నీ సరైన సమాధానాలే రావాలి మరి. ట్రై చేయండి చూద్దాం.

### నేను గీసిన బొమ్మ

**- ఎం.చరణ్,**
**7వ తరగతి,**
**ఎస్‌కెవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల,**
**రాజమహేంద్రవరం.**

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

# మధుమేహానికి చెక్ పెడదాం!

**ప్రపంచవ్యాప్తంగా నేడు విస్తరిస్తున్న వ్యాధుల్లో డయాబెటిక్ (మధుమేహం) లేదా షుగర్ ఒకటి. మిగతా దేశాలతో పోలిస్తే భారతదేశంలోనే ఈ కేసులు ఎక్కువగా నమోదవుతుండటం ఆందోళన కల్గించే అంశం. ప్రపంచవ్యాప్తంగా 2021 గణాంకాల ప్రకారం 53.7 కోట్ల మంది మధుమేహ వ్యాధిగ్రస్తులు ఉండగా ఆ సంఖ్య 2045 నాటికి 78.3 కోట్లకు చేరుకుంటుందని అంచనా. భారతదేశంలో ఈ సంఖ్య సుమారు 7.7 కోట్ల నుంచి 12.5 కోట్లకు చేరే అవకాశాలు ఉన్నాయి. మధుమేహ వ్యాధి నియంత్రణకు అవగాహనకు మించిన మందు లేదు. ఆహారపు అలవాట్లు, వ్యాయామం వంటివి వ్యాధి బారినపడకుండా రక్షణ కవచంలా పనిచేస్తాయి.**

**- డాక్టర్ కె.వేణుగోపాలరెడ్డి,**
**చైర్మన్, విజిఆర్ డయాబెటిక్స్ ఆసుపత్రి,**
**విజయవాడ. సెల్ : 93467 96260**


ప్రస్తుత జీవన శైలి కారణంగా వ్యాధులు పెరుగుతున్నాయి. చిన్న వయస్సులోనే హార్ట్ ఎటాక్, పక్షవాతం వంటి జబ్బుల బారిన పడటం ఆందోళన కల్గిస్తోంది. కాలుష్యం మధుమేహంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. వ్యాధి ప్రారంభంలోనే గుర్తించి చికిత్సలు మొదలు పెడితే త్వరగానే తగ్గిపోయే అవకాశం ఉంటుంది. అదే ఆలస్యం చేస్తే నియంత్రణ కూడా ఆలస్యంగానే అవుతుంది. అనుమానాలను పక్కనపెట్టేసి అవగాహనతో ముందుకు సాగితే మధుమేహాన్ని నియంత్రించొచ్చు.

**సరిపడా ఆహారాన్ని తీసుకోవాలి**

మధుమేహం వచ్చిందని తినే ఆహారాన్ని పూర్తిగా తగ్గించేయొద్దు. ఆహారం పూర్తిగా మానెయ్యటం సబబు కానే కాదు. మధుమేహం వచ్చినా సరే, ఎవరైనా గానీ ఆరోగ్యకరమైన, సమతులాహారం తీసుకోవాలి. ఆహారంలో మాంసకృత్తులు, పిండి పదార్థాలు, పండ్లు, కూరగాయల వంటివన్నీ సమద్ధిగా ఉండేలా చూసుకోవాలి. నిజానికి మధుమేహం విషయంలో ఆహార వ్యాయామాల వంటివి ముఖ్యమేగానీ వాటికంటే కూడా.. గ్లూకోజు నియంత్రణకు వైద్యులు చెప్పినట్టుగా మందులు వేసుకోవటం, క్రమం తప్పకుండా పరీక్షలు చేసుకోవటం మరింత ముఖ్యం. అవసరమైతే పోషకాహార నిపుణుల సలహా మేరకే ఆహార నియమాలు పాటించాలి.

సాధారణంగా మధుమేహం వచ్చిన తర్వాత మొదటి పదేళ్ల పాటు పైకి పెద్దగా ఎలాంటి దుష్ప్రభావాలూ ఉండవు. దీంతో చాలామంది ఏళ్ల తరబడి మధుమేహాన్ని పట్టించుకోకుండా తిరుగుతున్నారు. నాకేం సమస్యల్లేవని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుంటారు. కానీ దీనివల్ల త్వరలోనే ఆరోగ్యం ఘోరంగా దెబ్బతిని ఆపదల పాలవుతుంటారు.

**కిడ్నీ సమస్యలు**

మధుమేహ దుష్ప్రభావాల కారణంగా పదేళ్లకల్లా కిడ్నీలు విఫలమయ్యే ప్రమాదం ఉంది. దాన్ని గుర్తించిన ఏడాదిలోనే కిడ్నీ మార్పిడి చేస్తే మంచి ఫలితాలు ఉంటాయి. లేకపోతే కిడ్నీ మార్పిడి తర్వాత కూడా ఎక్కువ కాలం బతికే అవకాశాలు తక్కువ. కాబట్టి ఇతరత్రా సమస్యలు, లక్షణాలు లేవు కదా అని రక్తంలో గ్లూకోజును ఏమాత్రం నిర్లక్ష్యం చెయ్యొద్దు. ఏళ్ల తరబడి నిర్లక్ష్యం చెయ్యటం వల్ల శరీరంలోని రకరకాల అవయవాలు మళ్లీ కోలుకోలేనంత తీవ్రంగా దెబ్బతినిపోయే ప్రమాదం ఉంటుంది. ఈ వ్యాధి వలన కలిగే ఇతర ఆరోగ్య సమస్యలను బట్టి చూస్తే దీనిని ఒక ప్రజారోగ్య సమస్యగా తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది. ఈ జబ్బు ఉందని తెలియకుండా ఆరోగ్యంగా ఉన్నామని భ్రమిస్తూ ఉన్నవారు తమ లక్షణాలను గమనించి, విధిగా పరీక్ష చేయించుకునొని చికిత్స ప్రారంభించేలా చర్యలు ఉండాలి.

**చెప్పుకునేందుకు ఇబ్బంది**

మందుల పట్ల, ఇన్సులిన్ పట్ల రకరకాల అపోహలు పెంచుకుని చిట్కా వైద్యాలకు మారటం వంటివన్నీ చేస్తూ చేజేతులా సమస్యలు కొని తెచ్చుకుంటున్నారు. అపోహల వల్ల మన సమాజంలో కొందరు తమకు 'మధుమేహం వచ్చిందని' బయటకు చెప్పుకోవాలంటేనే ఇబ్బందికర వాతావరణం



నెలకొంటోంది. ముఖ్యంగా పెళ్లి కావాల్సిన ఆడపిల్లల వంటివారు చాలా ఇక్కట్ల పాలవుతున్నారు.

వివాహాల విషయంలో కూడా- మధుమేహం ఉన్న ఆడపిల్లల విషయంలో ఎలాంటి అపోహలూ పెట్టుకోవాల్సిన పని లేదు. మధుమేహాన్ని నియంత్రణలో ఉంచుకోవటానికి ఇప్పుడు ఇన్సులిన్‌తో సహా సమర్థమైన మందులున్నాయి. దాన్ని నియంత్రణలో పెట్టుకుంటే దాంపత్య జీవితం విషయంలోగానీ, సంతానం విషయంలోగానీ ఎలాంటి సమస్యలూ ఉండవు. మధ్య తరగతి వారు ఇలాంటి అనుమానాల్లోంచి బయటపడాల్సిన అవసరం చాలా ఉంది. అలాగే మందుల కంటే పసర్లు, కషాయాలు, పొడుల వంటివే ఉత్తమమనీ, వాటితో దుష్ప్రభావాలు ఉండవనీ.. ఇలాంటి అపోహల నుంచి బయటపడటం మంచిది.

**నియంత్రణకు ఇవి పాటించండి**

- ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి
- జీవన శైలిలో మార్పులు చేసుకోవాలి
- ఎక్కువగా ఒకేసారి తినకుండా కొద్దిగా ఎక్కువ సార్లు తినటం మేలు
- ఒత్తిడి లేని జీవితాన్ని గడపాలి
- ప్రశాంతంగా ఉండటాన్ని అలవర్చుకోవాలి
- ప్రతి చిన్న విషయానికి భయపడటం, టెన్షన్ పడకుండా ఉండాలి
- ప్రాణాయామం, యోగా కూడా మంచిదే
- మందులు మానివేయకుండా ఖచ్చితంగా వాడాలి
- పస్తులు, ఉపవాసాలకు దూరంగా ఉండాలి
- వ్యాధి నియంత్రణ తీరుపై తరచుగా పరీక్ష చేయించుకోవాలి
- పాదాలకు రక్షణ ఉంచుకోవాలి. చెప్పులు లేకుండా నడవరాదు

**మందులు వాడాల్సిందే...**

చాలామంది మధుమేహులు రక్తంలో గ్లూకోజు ఒక్కటే చూసుకుంటూ.. ట్రైగ్లిజరైడ్లు, కొలెస్ట్రాల్, హైబీపీ వంటివేమీ పట్టించుకోవటం లేదు. కానీ ఇది సరికాదు. ఎందుకంటే రక్తంలో గ్లూకోజు నియంత్రణలోనే ఉంటున్నా కూడా (అంటే పరగడుపున రక్తంలో గ్లూకోజు 125 కంటే తక్కువగానే ఉంటున్నా కూడా)... వీళ్లకు రక్తంలో కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్లు, హైబీపీ వంటివి ఎక్కువ ఉంటే మధుమేహం కారణంగా వచ్చే దుష్ప్రభావాలన్నీ ముంచుకొచ్చే ప్రమాదం ఉంటుంది. కాబట్టి రక్తంలో గ్లూకోజు మాత్రమే తగ్గించుకుంటే సరిపోదని గుర్తించాలి. నిజానికి మధుమేహులు రక్తంలో గ్లూకోజుతో పాటు- ఊబకాయం, హైబీపీ, కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్లు.. ఈ నాలుగింటినీ కూడా కచ్చితంగా పట్టించుకోవాలి. వీటిలో హైబీపీ, కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్లు ఎక్కువగా ఉంటే వాటికి కచ్చితంగా మందులు కూడా వాడుకోవాల్సి ఉంటుంది.

**వయోభేదం లేనేలేదు**

వయోభేదం లేకుండా సంక్రమిస్తున్న షుగర్ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. షుగర్ వ్యాధిని అదుపులో ఉంచుకోకపోతే రక్తంలో గ్లూకోస్ ఎక్కువగా ఉండటం వల్ల నీరసంగా ఉండటం, బరువు తగ్గినీర సంగా ఉండటం, బరువు తగ్గిపోవటం, అతి మూత్రం వంటి సమస్యలు ఎదురౌతాయి. ముఖ్యంగా రక్తనాళాల గోడలు త్వరితంగా పెళుసు బారతాయి. దానివల్ల కొవ్వు పదార్థాలు అడ్డుపడి రక్తనాళాలు మూసుకుపోతాయి. ఫలితంగా శరీరంలోని ముఖ్య అవయవాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. త్వరితగతిన ముసలితనం ఆవరిస్తుంది కూడా.

# టాలీవుడ్‌లో 'బాహుబలి' కోలీవుడ్‌లో 'కంగువా'

**తమిళ హీరో సూర్య నటించిన పానిండియా చిత్రం 'కంగవా' ఈనెల 14న విడుదలైంది. ఫాంటసీ యాక్షన్ మూవీగా దర్శకుడు శివ భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను తెరకెక్కించారు. టాలీవుడ్‌కు 'బాహుబలి' ఎలాగో కోలీవుడ్‌కు 'కంగువా' అంటూ చిత్రబృందం ప్రచారం చేయటంతో ఈ చిత్రంపై దేశవ్యాప్తంగా ఆసక్తి పెరిగింది. టీజర్, ట్రైలర్లలోని విజువల్స్, యాక్షన్ సీన్స్ మరింత ఉత్సుకతను పెంచాయి. ప్రస్తుతం ఈ సినిమా థియేటర్లలో విజయవంతంగానే ప్రదర్శించబడుతోంది. ఓవరాల్‌గా హీరోగా సూర్య తనవంతు పాత్రకు న్యాయం చేశారు. కథలోకి వెళ్తే వెయ్యేళ్ల కిందట ఓ జానపద కథకూ, వర్తమాన కాలానికి ముడిపెడుతూ తెరకెక్కించారు. ఆనాటి సమాజంలో ఉన్న పరిస్థితులకు అనుగుణంగా మనుషులు, వారి జీవన విధానం, దుస్తులు, నేటి వర్తమాన కాలంతో పోల్చుతూ సరికొత్తగా చూపించారు. ప్రేక్షకుల్ని ప్రత్యేకమైన ప్రపంచంలో లీనం చేసి తాము అనుకున్న కథను జొప్పించారు. ఆ ప్రపంచాన్ని ఆవిష్కరించే క్రమంలో ఇదివరకెప్పుడూ తెరపై చూడని నేపథ్యాన్ని, కొత్త విజువల్స్‌ను కళ్లకు కడుతూ సరికొత్త వినోదం పంచే ప్రయత్నం చేశారు. రెండు విభిన్న కాలాల ఆవిష్కరణలోనూ, భావోద్వేగాల వ్యక్తీకరణలోనూ దర్శకుడు, నటీనటులూ చక్కని ప్రతిభ చూపారు.**

**ప్రవణ, కపాలకోన చుట్టూనే...**

ప్రణవకోన, కపాల కోన, సాగరకోన, అరణ్యకోన, హిమ కోన అంటూ ఐదు వంశాలను పరిచయం చేశారు. ఏ కోనతోనూ, మరే వంశంపైనా ప్రేమలు ఉండవు. అరుపులు, కేకలు, కక్షలు, కార్పణ్యాలు తప్ప. ఆయా కోనల్లో జీవన విధానంపైన కేంద్రీకరించి చూపించారు. నిజానికి ఇందులో కథ ప్రధానంగా ప్రణవకోన, కపాల కోన చుట్టూనే తిరుగుతుంటుంది. ప్రతి పాత్రలో బిగ్గరగా అరుపులు విన్పిస్తుంటాయి. వాటి తాలూకా భావోద్వేగాలు కూడా ఉంటాయి. ఏదైనా కొత్త ప్రపంచంలోకి దర్శకుడు తీసుకెళ్లారనే చెప్పాలి. ప్రతి సినిమాను ఒకదానితో మరొకటి పోల్చి చూడకూడదు. కానీ 'కంగువ' కథని చూసినప్పుడు 'బాహుబలి' తప్పకుండా గుర్తొస్తుంది. 'బాహుబలి' కథా ప్రపంచం, పాత్రలు ప్రేక్షకులపై ప్రత్యేకమైన ముద్ర వేశాయి. వాటిలో ప్రయాణం చేసేలా ప్రభావితం చేశాయి. బాహుబలి, బాహుబలి-2 చిత్రాల్లోని సన్నివేశాలు కొన్ని ప్రభావితం చేస్తాయి. మాహిష్మతి రాజ్యంలో జరిగిన ఘటనలను ఊహాజనితంగా తెరకెక్కించారు. ప్రతి సన్నివేశం పసందుగా ఉంటుంది. పాటైనా, ఫైటైనా కనువిందు చేస్తుంది.




కంగువా కూడా ఆ తరహా ఊహా ప్రపంచంలోకి తీసుకెళ్తుంది. కంగువా, పులవ నేపథ్యంలో వచ్చే సన్నివేశాలు, ఆ రెండు పాత్రల మధ్య పండిన భావోద్వేగాలు ఈ సినిమాగా హైలెట్‌గా నిలిచాయి. పులవ కుటుంబం కోసం కంగువా నిలబడే తీరు, పులవని కాపాడటం కోసం తన ఎంచుకునే దారి, రుధిర (బాబీదేవోల్)తో పోరాటం తదితర సన్నివేశాలు సినిమాకు బలాన్నిచ్చాయి. పతాక సన్నివేశాలు సినిమాకు మరో హైలెట్. సూర్య కంగువా, ఫ్రాన్సిస్ పాత్రల్లో పూర్తిగా ఒదిగిపోయారు. కంగువాగా ఆయన చూపించిన వీరత్వం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. దిశాపటానీ, యోగిబాబు తమ పాత్రలతో సందడి చేస్తారు. సాంకేతికంగా సినిమా ఉన్నతంగా సాగింది. వెట్రి కెమెరా పనితనం వెయ్యేళ్ల కిందటి కాలంలోకి తీసుకెళ్లిందనే చెప్పాలి.

**బాహుబలి... కల్కి**

'కల్కి 2898' సినిమాలో కథ కాశీ, కాంప్లెక్స్, శంబాలా అనే ప్రపంచాల మధ్య సాగుతుంది. ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన సైన్స్ ఫిక్షన్ కథే 'కల్కి 2898'. దీపిక పదుకొణె, అమితాబ్‌బచ్చన్, కమల్‌హాసన్, దిశాపటానీ తదితరులు కీలకపాత్రలు పోషించారు. రెండోభాగం కూడా త్వరలో సెట్స్‌పైకి వెళ్లనుంది. మూడు ప్రపంచాల మధ్య జరిగే కథగా తెరకెక్కించారు. కాంప్లెక్స్‌లోకి వెళ్లాలంటే మిలియన్ల కొద్దీ యూనిట్లు కలిగివుండాలి. అక్కడికి వెళ్లాలంటే ఎవరైనా తమ జీవితాన్ని ఫణంగా పెట్టి వెళ్లాల్సిందే. కాశీ, కాంప్లెక్స్‌తోపాటుగా శంబాలా అనే మరో ప్రపంచం కూడా ఉంది. వివిధ సంస్కృతుల్లో కూడా ఈ పేరును వాడుతుంటారు. ప్రతి సంస్కృతిలో ఒక రహస్య ప్రపంచం దాగుంటుంది. దాన్నే కొందరు ఆధునిక ప్రపంచం లేదా అవతార్ లోకంగా చెబుతుంటారు. కల్కితో ఆ ప్రపంచాలను అనుసంధానం ఉంటుంది. ఈ మూడు ప్రపంచాలు ఒకదానితో మరొకటి అనుసంధానమవుతూ 'కల్కి' కథ నడుస్తుంది. ఈ మూడు ప్రపంచాల్లోని ప్రజానీకం, వారి ఆచారాలు, సంప్రదాయాలు, ఆధిపత్య పోరాటం వంటి ఘటనలు కల్కి చుట్టూ సాగిన విషయం తెలిసిందే. ఇదే తరహాలోనూ 'కంగువా'లో కోన వంశాల జీవనయానం కనిపిస్తుంది.

# విజయంతో ముగిస్తారా?

**మలేషియాతో భారత్ ఢీ నేడు**
**గచ్చిబౌలిలో ఫిఫా ఫ్రెండ్లీ మ్యాచ్**
**రాత్రి 7.30 నుంచి స్పోర్ట్స్18లో..**

**హైదరాబాద్ :** భారత ఫుట్‌బాల్‌కు ఈ ఏడాది మిశ్రమ ఫలితాలు ఇచ్చింది. జనవరిలో వరుసగా రెండోసారి ఆసియా కప్‌లో పోటీపడిన భారత్.. జూన్‌లో ఫిఫా ప్రపంచకప్ క్వాలిఫయర్స్ నుంచి నిష్క్రమించింది. ఫిఫా ర్యాంకింగ్స్‌లోనూ దిగజారిన 'బ్లూ టైగర్స్'.. సొంతగడ్డపై ఇంటర్‌కాంటినెంటల్ కప్‌ను సైతం చేజార్చుకుంది. కొత్త కోచ్ మనాలో మార్కెజ్‌పై అంచనాలు భారీగా ఉన్నప్పటికీ.. జట్టు ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేదు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఆఖరిసారి భారత ఫుట్‌బాల్ జట్టు మైదానంలోకి రానుంది. హైదరాబాద్‌లోని జిఎంసి బాలయోగి అథ్లెటిక్ స్టేడియంలో నేడు మలేషియాతో ఫిఫా ఫ్రెండ్లీ మ్యాచ్‌లో తలపడనుంది. వచ్చే ఏడాది ఆరంభంలో మలేషియా, భారత్‌లు ఆసియా కప్ క్వాలిఫయర్స్‌లో బరిలోకి దిగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ రెండు జట్ల మధ్య ఫిఫా ఫ్రెండ్లీ మ్యాచ్ ఆసక్తిగా మారింది.

**కుర్రాళ్లకు సవాల్ :** కోచ్ మనాలో మార్కెజ్ గత నాలుగేండ్లుగా హైదరాబాద్‌తో అనుబంధం కలిగి ఉన్నాడు. హైదరాబాద్ ఎఫ్‌సీ కోచ్‌గా మనాలో ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) టైటిల్ సాధించాడు. కుర్రాళ్లకు ఎక్కువ అవకాశాలు కల్పించి, ఫలితాలు రాబట్టడం మనాలో శైలి. కానీ ఇంటర్‌కాంటినెంటల్ కప్‌లో ఆ ప్రయోగం ఆశించిన ఫలితాలు అందించలేదు. అయినా, మనాలో మార్కెజ్ శైలిలో మార్పులేమీ రాలేదు. గత మ్యాచుల్లో చేసిన పొరపాట్లను సరిదిద్దుకుని, కఠోర సాధన చేస్తున్న భారత జట్టు ఈ ఏడాదిని విజయంతో ముగించాలని ఎదురు చూస్తోంది. నేడు మలేషియాతో మ్యాచ్‌లో మైదానంలో ఆటగాళ్ల మార్పును మనాలో ఏ విధంగా చేస్తాడనే ఆసక్తి కనిపిస్తోంది. 'మలేషియా భిన్నమైన జట్టు. ఈ సవాల్‌కు భారత్ కొత్తగా సన్నద్ధమైంది. గతంలో చేసిన పొరపాట్ల నుంచి నేర్చుకున్నాం. ప్రత్యర్థిని దీటుగా ఎదుర్కొంటామనే దీమా ఉంది. చివరగా భారత్ ఇక్కడ మ్యాచ్‌కు అభిమానులతో స్టేడియం నిండిపోయింది. నేడు మలేషియాతో మ్యాచ్‌కు సైతం అభిమానుల నుంచి అదే స్థాయిలో మద్దతు ఉంటుందని ఆశిస్తున్నాను' అని మనాలో మార్కెజ్ అన్నారు. ఫిఫా ర్యాంకింగ్స్‌లో భారత్ 125వ స్థానంలో, మలేషియా 133వ స్థానంలో కొన సాగుతున్నాయి. భారత కోచ్ మనాలో, మలేషియా కోచ్ మార్టిన్‌లు స్పెయిన్‌లోని బార్సిలోనా నగరానికి చెందిన వ్యక్తులు కావటం విశేషం.

**ఘనంగా ఏర్పాట్లు :** భారత్, మలేషియా ఫిఫా ఫ్రెండ్లీ మ్యాచ్‌కు తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్) ఘనంగా ఏర్పాట్లు చేసింది. గతంలో ఇంటర్‌కాంటినెంటల్ కప్‌కు ఆతిథ్యం అందించిన గచ్చిబౌలి స్టేడియం ఇప్పుడు ఫిఫా ఫ్రెండ్లీ మ్యాచ్‌కు అంతకుమించి ముస్తాబైంది. తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్‌రెడ్డి ఇరు జట్ల ఆటగాళ్లతో కరచాలనం చేసి మ్యాచ్‌ను ఆరంభించనున్నారు. ఫుట్‌బాల్ మ్యాచ్ రాత్రి 7.30 గంటలకు ఆరంభం కానుండగా.. సాయంత్రం 5.15 గంటల నుంచి స్టేడియంలో సంగీత కచేరి నిర్వహించనున్నారు.

# రోహిత్ శర్మ దూరం

- పెర్త్ టెస్టుకు హిట్‌మ్యాన్ గైర్హాజరు

**పెర్త్ (ఆస్ట్రేలియా) :** బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ తొలి టెస్టుకు భారత కెప్టెన్ రోహిత్ శర్మ దూరం అయ్యాడు!. పితృత్వ సెలవులో ఉన్న రోహిత్ శర్మ నవంబర్ 22న ఆరంభం కానున్న పెర్త్ టెస్టుకు అందుబాటులో ఉంటాడనే అంచనాలు ఉన్నాయి. కానీ, రోహిత్ శర్మ కుటుంబంతో ఉండేందుకు మొగ్గుచూపటంతో హిట్‌మ్యాన్ లేకుండానే భారత్ పెర్త్ టెస్టుకు సిద్ధం కానుంది. రోహిత్ శర్మ, రితిక దంపతులు శుక్రవారం రెండో బిడ్డకు జన్మనిచ్చిన సంగతి తెలిసిందే. భారత్, ఆస్ట్రేలియా రెండో టెస్టు డిసెంబర్ 6 నుంచి ఆడిలైడ్‌లో ఆరంభం కానుంది. కానీ, నవంబర్ 30 నుంచి భారత్ మూడు రోజుల డే నైట్ వార్మప్ మ్యాచ్ ఆడనుంది. పింక్‌బాల్ వార్మప్ మ్యాచ్ సమయానికి రోహిత్ శర్మ జట్టుతో చేరనున్నాడని సమాచారం. ఈ మేరకు బీసీసీఐ, సెలక్షన్ కమిటీకి రోహిత్ శర్మ సమాచారం అందించినట్టు తెలుస్తోంది.

**టాప్ ఆందోళన! :** పెర్త్ టెస్టుకు భారత్ టాప్ ఆర్డర్ సమస్యలు ఎదుర్కొంటుంది. రోహిత్ శర్మ పితృత్వ సెలవులో ఉండగా.. శుభ్‌మన్ గిల్ ఎడమ చేతి బొటనవేలి గాయానికి గురయ్యాడు. దీంతో గిల్ సైతం తొలి టెస్టుకు అందుబాటులో లేడు. రోహిత్ స్థానంలో గిల్ ఓపెనర్‌గా వస్తాడనే అంచనాలు కనిపించాయి. ఇప్పుడు రోహిత్, గిల్ దూరం కానుండటంతో.. ప్రత్యామ్నాయ ఆటగాళ్లు కెఎల్ రాహుల్, అభిమన్యు ఈశ్వరన్ ఇద్దరూ తుది జట్టులో నిలిచే అవకాశం లేకపోలేదు. మరో ఆటగాడు దేవదత్ పడిక్కల్ సైతం తొలి టెస్టులో ఆడేందుకు ఎదురుచూస్తున్నాడు. ఇద్దరు కీలక బ్యాటర్లు దూరం కావటంతో బ్యాటింగ్ బలోపేతం కోసం పేస్ ఆల్‌రౌండర్లను జట్టులో చేర్చనున్నారు. నితీశ్ కుమార్ రెడ్డి, హర్షిత్ రానాలు సైతం తొలి టెస్టులో ఆడే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

## అఖిల్‌కు ఎఫ్4 టైటిల్

- ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్

**కోయంబతూర్ :** హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ డ్రైవర్ అఖిల్ అలీభాయ్ ఎఫ్4 ఇండియన్ చాంపియన్‌షిప్ టైటిల్ సొంతం చేసుకున్నాడు. రుహాన్ అల్వ (బెంగళూర్) ఆఖరు రేసులో టాప్ పొజిషన్‌లో నిలిచినా.. రేసు ఆరంభానికి ముందే 29 పాయింట్ల ఆధిక్యంలో నిలిచిన అఖిల్ అలీభాయ్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. సీజన్‌లో ఆరు విజయాలు సాధించిన అఖిల్.. ఆదివారం రెండుసార్లు పోడియంపై నిలిచాడు. అఖిల్‌ను హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ సహ యజమాని అక్కినేని నాగచైతన్య అభినందించారు.


Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68